రిపోర్టర్లు కావలెను
అక్షర సవాల్
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న 'అక్షర సవాల్' మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9642225337, 9912125337 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

అక్షర సవాల్
ప్రశ్నించే సామాన్యుడి గొంతుక జాతీయ తెలుగు దిన పత్రిక
Website:www.aksharasaval.com Email: aksharasaval@gmail.com

రిపోర్టర్లు కావలెను
తెలుగులో అనర్గళంగా మాట్లడగలిగి, సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
AS TV
తెలుగు రాష్ట్రాలలో నూతన ఒరవడిన సృష్టించబోతున్న 'ఏఎస్' టీవి ఛానల్ మీకు సరైన వేదిక.. తెలుగు రాష్ట్రాలలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. అన్ని నియోజకవర్గాల, మండలాల వారిగా రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9642225337, 9912125337 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 102 | ఎడిటర్ : బైరెడ్డి రాజేందర్ రెడ్డి | బుధవారం : 28-06-2023 | పేజీలు : 12 | వెల : రూ. 5/-

# మాది బహుజనుల టీమ్

## బిజెపి, కాంగ్రెస్ ఎంత బద్నాం చేసినా బిఆర్ఎస్‌ను విస్తరించి తీరుతాం

## రెండో రోజూ కెసిఆర్‌కు బ్రహ్మరథం

- మహారాష్ట్రలో అన్ని పార్టీలకు అధికారమిచ్చినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు
- రైతుల కోసం పని చేసే వాళ్లను ఆశీర్వదించండి
- ఇక్కడ తెలంగాణ పథకాలను అమలు చేస్తాం
- మొదటి సారి అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదమిచ్చింది బిఆర్ఎస్సే
- బిజెపికి దమ్ముంటే ప్రతి ఎకరానికి నీళ్లివ్వాలి
- మేకిన్ ఇండియా అమలైతే ఇంకా దేశంలో చైనా బజార్లు ఎందుకు?
- సర్కోలి సభలో బిఆర్ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ గర్జన
- ఎన్‌సిపి నేత భగీరథ బాల్కే పార్టీలో చేరిక, ఆయనకు అండగా ఉంటానని హామీ



(అక్షర సవాల్ ) /హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి దేశంలోని రైతులందరికీ ప్రతినిధి అని బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. బిఆర్ఎస్ ఏ పార్టీకి ఎ టీమ్, బి టీమ్ కాదని.. పేద, దళిత, బిసి, రైతుల టీమ్ అని స్పష్టం చేశారు. భారత్ పరివర్తన కోసం పుట్టిన పార్టీ బిఆర్ఎస్ అని అన్నారు. బిఆర్ఎస్ భారతదేశ గతిని మార్చే, భారతదేశంలో పరివర్తన తెచ్చే ఒక మిషన్ అని, ఇది జాతీయస్థాయిలో పనిచేసే పార్టీ అని పేర్కొన్నారు. దేశాన్ని తప్పకుండా మారుస్తామని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ తెలంగాణకో, మహారాష్ట్రకో పరిమితం కాదని అన్నారు. ఎన్నికలలో పార్టీలు గెలవడం కాదు, ప్రజలు గెలవాలని అన్నారు. దేశంలో రైతు ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. ఈ దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలో ఎన్నో రకాల నినాదాలిచ్చాయని, కానీ మొట్టమొదటి సారి 'అబ్ కి బార్ కిసాన్ సర్కార్' అని నినదించిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ మాత్రమే అని స్పష్టం చేశారు. ఇంతకుముందు ఏ పార్టీ కూడా ఈ నినాదమివ్వలేదని తెలిపారు. 60 శాతానికిపైగా ఉన్న రైతులు, కార్మికులు తమ మద్దతును బిఆర్ఎస్ పార్టీకి ప్రకటిస్తుండటం కాంగ్రెస్, బిజెపి పార్టీలకు భయాన్ని కలిగిస్తున్నదని, దీంతో అడ్డం పొడుగు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వింత వింత ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. మహారాష్ట పర్యటనలో రెండో రోజైన మంగళవారం సిఎం కెసిఆర్ పండరిపూర్‌లోని విఠలేశ్వర స్వామి, రుక్మిణీదేవీని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్కోలిలో బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ సమక్షంలో మాజీ ఎంఎల్ఎ, దివంగత భరత్ బాల్కే కుమారుడు స్థానిక ఎన్‌సిపి నేత భగీరథ బాల్కే తన అనుచరులతో కలిసి తరువాయి 3లో





## పాఠ్యపుస్తకాలు, టీచర్లు లేకుండా పాఠాలు ఎలా చదవాలి?

### విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- ప్రయివేట్‌లో అడ్డగోలు ఫీజుల వసూళ్లపై స్పందనేదీ.. : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.ఎల్. మూర్తి, టి.నాగరాజు
- విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ల ముట్టడి

(అక్షర సవాల్ ) -సిటీబ్యూరో

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో, ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్ మూర్తి, ...5లో



## గో రక్షకుల దారుణం

- గోమాంసం తరలిస్తున్నారన్న అనుమానంతో ముస్లిం వ్యక్తిని కొట్టి చంపిన దుండగులు..మహారాష్ట్రలో ఘటన

**నాసిక్ :** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో గో సంరక్షకులుగా చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు ఓ యువకుడిని కొట్టి చంపారు. మరో యువకుడిని తీవ్రంగా గాయపరిచారు. యువకులు ఆవు మాంసాన్ని రవాణా చేస్తున్నారన్న అనుమానంతో వారు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. అఫాన్ అబ్దుల్ మజీద్ అన్సారీ, నాసిర్ హుస్సేన్ షేక్ అనే వ్యక్తులు ఓ కారులో 450 కిలోల మాంసాన్ని ముంబయికి రవాణా చేస్తుండగా 10-15 మంది గో సంరక్షకులు అటకాయించి ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో అన్సారీ ప్రాణాలు కోల్పోయారు. దాడికి పాల్పడిన 11 మంది దుండగులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. రవాణా చేస్తున్న మాంసం నిషిద్ధ జాతికి చెందినదా కాదా అని తెలుసుకునేందుకు దానిని ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపారు. కాగా నాసిక్ జిల్లాలోనే ఈ నెల 8న ఇలాంటి సంఘటనే మరొకటి జరిగింది. రాష్ట్రీయ బజరంగ్‌దళ్‌కు చెందిన గో సంరక్షకులు ఒక వ్యక్తిని చంపి, మరో ఇద్దరిని గాయపరిచారు. వీరు పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న అనుమానంతో ఈ దారుణానికి పాల్పడ్డారు.

# స్వదేశంలో గాడ్సే

## ఆయన విధానం ప్రజాస్వామ్యానికే ప్రమాదం

- రాజ్యాంగ రక్షణకే ప్రతిపక్షాల ఐక్యత
- రాష్ట్రస్థాయిల్లోనే కూటములు
- సిమ్లా సమావేశానికి మరిన్ని పార్టీలు చేరుతాయి : సీతారాం ఏచూరి





**న్యూఢిల్లీ :** "ప్రతి రాష్ట్రంలోని పరిస్థితి భిన్నంగా ఉంటుంది. రాష్ట్రాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా చర్చలు రాష్ట్రస్థాయిల్లో జరగాలని నిర్ణయించాం. అందుకనుగుణంగానే ఎన్నికల నిర్వహణ ఉంటుంది. రాష్ట్ర స్థాయిల్లోనే కూటములు ఏర్పాటు చేస్తాం. తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర వలే ఇతర రాష్ట్రాల్లో కూడా ఎన్నికల అవగాహనలు ఉంటాయి" అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టంచేశారు. శని, ఆదివారాల్లో సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పొలిట్ బ్యూరో సమావేశం తీసుకున్న నిర్ణయాలను సీతారాం ఏచూరి వివరించారు. పాట్నాలో జరిగిన సమావేశంలో ప్రతిపక్షాలన్ని కలిసి పని చేయాలని నిర్ణయించామన్నారు.

సిమ్లాలో జరిగే ప్రతిపక్షాల సమావేశానికి మరిన్ని పార్టీలు చేరుతాయన్నారు. రాజ్యాంగ హక్కులపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగాన్ని పరిరక్షణ,విద్వేష, టెర్రర్ రాజకీయాలను వ్యతిరేకించడం, మతోన్మాద విభజన, ప్రజాస్వామ్య హక్కులు, మానవ హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉమ్మడి ప్రచార కార్యక్రమం నిర్వహించాలని ఆ సమావేశంలో నిర్ణయించామన్నారు. దేశంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ప్రజా జీవనోపాధి సమస్యలైన నిరుద్యోగం, ధరలు పెరుగుదలలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా ఆర్థిక పురోగమనం లేదన్నారు. గత రెండేళ్లలో ఒక శాతం కార్పొరేట్ల వద్ద 40 శాతానికి పైబడి సంపద కేంద్రీకతం అయిందని, అట్టడుగున ఉన్న 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉందని, ఆ రకంగా ఆర్థిక అసమానతలు పెరిగాయని తెలిపారు. ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారని, పేదలు మరింత పేదలుగా మారుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై ప్రతిపక్షాలన్నిటితో కలిసి ఉమ్మడిగా పోరాడుతామని అన్నారు.

మణిపూర్‌లో పరిస్థితి సంక్షోభ స్థాయికి చేరుకుందని, దీనికి కారణం మోడీ ప్రభుత్వమేనని విమర్శించారు. ప్రతి రోజూ హింస కొనసాగుతోందని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని, అఖిలపక్ష ...5లో

ప్రధాని మోడీ విదేశాల్లో ఉంటే గాంధీ, ఇండియాలో ఉంటే గాడ్సే అని ధ్వజమెత్తారు. మోడీ అమెరికా పర్యటనలో దేశ ప్రయోజనాలు లేవని, ఇప్పటికే ఉన్న ఒప్పందాలనే తిరగదోడారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకు లా కమిషన్ యూనిఫాం సివిల్ కోడ్‌పై మళ్లీ సంప్రదింపులు ప్రారంభించిందని, ఇప్పటికే 2016 నుంచి 2018 వరకు రెండేండ్ల గత లా కమిషన్ సంప్రదింపులు జరిపిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు లా కమిషన్ సంప్రదింపుల్లో అర్థం లేదని అన్నారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను రుద్దొద్దని హితవు పలికారు. మహిళలతో సహా పౌరులందరికీ సమానత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కోర్టులో పోరాటం కొనసాగిస్తాం



**న్యూఢిల్లీ :** డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల కేసుపై కోర్టులో తమ పోరాటం కొనసాగిస్తామని ఆందోళన చేసిన రెజ్లర్లు ప్రకటించారు. రెజ్లింగ్ చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై ఛార్జ్‌షీటు దాఖలు హామీని నెరవేర్చిందని రెజ్లర్లు వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్, భజరంగ్ పునియా తెలిపారు. ఈ మేరకు సోమవారం ముగ్గురు రెజ్లర్లు ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. రెజ్లర్లతో ప్రభుత్వం చర్చలు, జూన్ 15న రెజ్లింగ్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సాక్షి మాలిక్ ...5లో



## ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాల్సిందే

### పెండింగ్‌లో ఉన్న డబుల్ ఇండ్లు పూర్తి చేయాలి

- లేదంటే గుడిసెలు వేసి ఆక్రమిస్తాం :తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య
- వికారాబాద్, మహబూబ్‌నగర్‌లో సాగిన బస్సు యాత్ర

(అక్షర సవాల్ ) -పరిగి/ మహబూబ్‌నగర్

ప్రభుత్వాల విధానాల వల్ల పేదలకు నిల్వ నీడ కరువైందని, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే పంపిణీ చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేయాలన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సాధన కోసం తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యపోరాట వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర సోమవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించింది. సంగారెడ్డి జిల్లా నుంచి వికారాబాద్ మీదుగా పరిగి పట్టణానికి చేరుకుంది. పరిగి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి లేబర్ అడ్డా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు రోజు రోజుకూ అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. ఎంతోమంది నిరుపేదలు సొంత ఇండ్లు లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తానని చెప్పి, నేటికీ ఇవ్వలేదన్నారు. ఎర్రజెండా అండగా ఎంతోమంది నిరుపేదలు ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. గుడిసెలు వేసుకున్న పేదలపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ ...5లో

# పాదచారుల కోసమే స్కై వాక్‌లు

### ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్...ఉప్పల్‌లో స్కై వే, కన్వెన్షన్ హాల్ ప్రారంభం

(అక్షర సవాల్ ) -ఉప్పల్

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా హైదరాబాద్ నగరంలో స్కైవాక్‌ల నిర్మాణం చేపడుతున్నట్టు ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. సోమవారం ఉప్పల్ చౌరస్తాలో స్కై వాక్, నాగోల్ శిల్పారామంలో కన్వెన్షన్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ చౌరస్తాలో నాగోల్, వరంగల్, హబ్సిగూడ వైపు నుంచి వచ్చే వాహనాల రద్దీ వల్ల పాదచారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. ఇప్పుడు ఈ చౌరస్తాలో స్కై వాక్ నిర్మాణం వల్ల పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు వీలుగా ఉందని తెలిపారు. ఈ స్కై వాక్‌ను మొత్తం 660 మీటర్ల నిర్మాణంలో రూపొందించామని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేకంగా లిఫ్ట్ సౌకర్యం, ఎక్సలేటర్‌తో ఆరు ఎంట్రీలు, ఆరు ఎగ్జిట్‌లను హెచ్ఎండీఏ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో రూ.453 కోట్లతో తాగునీటికి ట్యాంకులు, పైప్ లైన్‌లు వేశామని, మిగతా 5 శాతం పనులు త్వరలో పూర్తి చేయనున్నామని చెప్పారు.

70 కిలోమీటర్ల మేర ఉన్న మెట్రో రైలు మార్గాన్ని పెంచుతామనీ, శంషాబాద్ వరకు మరో 31 కిలోమీటర్ల మార్గాన్ని రెండున్నరేండ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. ఉప్పల్ ...5లో



# దేశకీ నేత కేసీఆర్..

### మహారాష్ట్రలో సీఎంకు ఘన స్వాగతం

- షోలాపూర్ చేరుకున్న గులాబీ దళపతి
- నేడు పండరీపురానికి ...



(అక్షర సవాల్ ) బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం మహారాష్ట్రకు బయలుదేరి వెళ్లారు. రోడ్డు మార్గంలో ...5లో

# ప్రజలకు మరింత మెరుగైన సేవలు




(అక్షర సవాల్ ) హైదరాబాద్ : ప్రజలకు మరింతగా మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. మార్కెట్ లో పోటీకి దీటుగా కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టేషన్లను ఆధునిక హంగులతో సుందరీకరిస్తున్నామని ఆయన తెలిపారు. మంగళవారం మంత్రి పువ్వాడ, ఆర్టీసి ఎండి సజ్జనార్‌తో కలిసి ఎంజీబీఎస్‌ను తనిఖీ చేశారు. అనంతరం రంగారెడ్డి రీజియన్‌కు సంబంధించి ఆర్టీసి ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక ఏడాదిలో 100 బస్టాండ్లను ఆధునీకరించగా, ఈ ఏడాదిలో 150 బస్టాండ్లను ఆధునీకరించేందుకు సంస్థ ప్రణాళిక రూపొందించిందని ఆయన వివరించారు.

## మెట్రో, రైల్వే, ఎయిర్ పోర్టు అథారిటీతో అనుసంధానం

రెండేళ్లలో ఎన్నో వినూత్న కార్యక్రమాలతో సంస్థ ప్రజలకు మరింతగా చేరువ అయ్యిందని మంత్రి అన్నారు. గతేడాది రూ.1900 కోట్ల నష్టాన్ని తగ్గించగలిగామని ఆయన గుర్తుచేశారు. ప్రయాణికులకు సౌకర్యాల విషయంలో ఏమాత్రం రాజీ పడటం లేదన్నారు. ఇప్పటికే 760 కొత్త బస్సులను కొనుగోలు చేశామని, త్వరలోనే హైదరాబాద్ లో నాన్ ఎసి ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని ఎండి తెలిపారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని, మెట్రో, రైల్వే, ఎయిర్ పోర్టు అథారిటీతో అనుసంధానం చేసి ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని అధికారులకు సూచించారు.

## సిబ్బంది పట్టుదలతో....

రెండేళ్లుగా సంస్థలోని 45 వేల మంది సిబ్బంది పట్టుదలతో పనిచేస్తున్నారని, వారు నిబద్ధతతో విధులు నిర్వహించడం వల్లే సత్ఫలితాలు వస్తున్నాయని మంత్రి చెప్పారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇప్పటి వరకు 7 డిఏలను ప్రకటించామని, దాని వల్ల ఒక్కొక్కరి వేతనం 35 శాతం వరకు పెరిగిందన్నారు. ప్రజ రవాణా వ్యవస్థ ప్రజలదేనని, దైనందిన జీవనంలో భాగమైన ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యతపై ప్రతి పౌరుడిపై ఉందని మంత్రి గుర్తుచేశారు.

## ప్రయాణికుల సౌకర్యాలపై మంత్రి ఆరా

తనిఖీలో భాగంగా మంత్రి పువ్వాడ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. టిఎస్ ఆర్టీసి ఉచితంగా అందిస్తోన్న టాయిలెట్‌లను, మంచినీటి సదుపాయాన్ని పరిశీలించారు. ఎంజీబీఎస్‌లోని స్టాళ్లను పరిశీలించిన మంత్రి పువ్వాడ ఎంఆర్‌పి ప్రకారమే వస్తువులను ప్రయాణికులకు విక్రయించాలని ఆయన సూచించారు. తర్వాత భద్రాచలం వైపునకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సులోని ప్రయాణికులతో మంత్రి ముచ్చటించారు. ఆర్టీసి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

## ఆక్యుపెన్సీని 75 శాతానికి పెంచడమే లక్ష్యం

ఆర్టీసి ఎండి విసి సజ్జనార్ మాట్లాడుతూ రెండేళ్లుగా సంస్థను ప్రజలు ఆదరిస్తున్నారని, ఫలితంగా రాబడి కూడా పెరుగుతుందన్నా. రాబోయే రోజుల్లో ఆక్యుపెన్సీ రేషియాను 75 శాతానికి పెంచడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తోందన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను బట్టి కొత్త కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నామని ఆయన వివరించారు. భక్తుల కోసం త్వరలోనే మహారాష్ట్రలోని షిర్డీ, ఆంధ్రప్రదేశ్ లోని శ్రీశైలానికి టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా జూలై 3వ తేదీన తమిళనాడు అరుణాచలంలో జరిగే గిరి ప్రదర్శన ప్యాకేజీకి భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని ఎండి చెప్పారు. ఇప్పటికే 9 బస్సుల్లో సీట్లు నిండాయని, త్వరలోనే మరికొన్ని బస్సులను ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. ఒకవైపు టికెట్ ఆదాయాన్ని పెంచుకుంటూనే మరోవైపు టికెటేతర ఆదాయంపై సంస్థ దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలోనే జీవా వాటిల్ బాటిళ్లు, స్నాక్ బాక్స్ తో పాటు పెట్రోల్ బంక్ ల ఏర్పాటు, లాజిస్టిక్స్ కార్గో సేవలను అందిస్తున్నామని ఆయన వివరించారు.

## ఎంజీబిఎస్‌లో రక్తదాన శిబిరం ప్రారంభం

ఎంజీబీఎస్ ప్రాంగణంలో ఆర్టీసి ఎండి విసి సజ్జనార్‌తో కలిసి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలతో ముచ్చటించారు. వారికి పండ్లు, జ్యూస్‌ను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 101 ప్రాంతాల్లో సామాజిక బాధ్యతగా ఆర్టీసి మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని 8 వేల మంది సిబ్బంది రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారని, వారికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని, దానం ఒక్కటే మార్గమన్నారు. అంతకముందు ఎంజీబిఎస్ ప్రాంగణంలో ఆర్టీసి ఎండి సజ్జనార్‌తో కలిసి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీసి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పురుషోత్తం, మునిశేఖర్, కృష్ణకాంత్, రంగారెడ్డి ఆర్ఎం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



- మార్కెట్ లో పోటీకి దీటుగా కొత్త బస్సులు అందుబాటులోకి...
- ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌స్టేషన్లకు ఆధునిక హంగులు
- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

## బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి : మహమూద్ అలీ



(అక్షర సవాల్ ) హైదరాబాద్ : బక్రీద్ పండుగ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం పరిశుభ్రత కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందని హోంమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ తెలిపారు. నగరాల్లో బలి జంతువుల వ్యర్థాలు, బలి స్థలాలు, చర్మాలను వెంటనే శుభ్రం చేయడానికి తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఈద్ –ఉల్– అజా సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు, ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు ఈదుల్ –ఉల్– అదా శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో మన జీవితంలో మరో ఈద్ ఉల్ అదా భాగ్యం కలిగిందన్నారు. బక్రీద్ త్యాగం సందర్భంగా స్వచ్ఛత, పరిశుభ్రత పట్ల ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇళ్లతో పాటు, పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రత్యేకించి, అందరితో ప్రేమ ఆప్యాయతలతో వ్యవహరించాలని. బలి అనంతరం జంతువుల వ్యర్థాలను ఇతరులకు ఇబ్బంది కలగకుండా మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన స్థలంలో వేయాలని హోం మంత్రి కోరారు. సర్వ శక్తిమంతుడైన అల్లా మన ప్రార్థనలు, పారాయణాలు మరియు త్యాగాలను స్వీకరిస్తాడని తెలిపాడు. ఈదుల్ అదా సందర్భంగా ప్రార్థనలు నిర్వహించడం ద్వారా దేశంలో పరిస్థితులు మెరుగుపడాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించాలని కోరారు.

## చేతి వృత్తులను ఆధునీకరించండి : జూలూరు



(అక్షర సవాల్ ) హైదరాబాద్ : సిఎం కెసిఆర్ దార్శనిక ఆలోచనలతో బహుజనుల కోసం చేపడుతున్న ప్రభుత్వ పథకాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా సాంకేతిక విశ్వవిద్యాలయాల్ని తయారు చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. బీసీలు, ఎంబీసీల కోసం లక్షరూపాయల సహాయం చేసే ప్రభుత్వ పథకానికి బహుజనులను ఉత్పత్తి శక్తులుగా మార్చేందుకు ఇంజనీరింగ్ కళాశాలలను ప్రయోగశాలలుగా మార్చేందుకు కార్యాచరణ పథకాన్ని రూపొందించాలని ఆయన కోరారు. దేశానికే మోడల్‌గా చేపట్టిన ప్రభుత్వ పథకాలకు సాంకేతిక జ్ఞాన ఇంజన్లను తయారు చేసే కేంద్రాలుగా కళాశాలలు తీర్చిదిద్దాలని అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి పూర్తి స్థాయి చైర్మన్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిని నియమించిన సందర్భంగా మంగళవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఆయన్ని కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాల్లో గుణాత్మకమైన మార్పు రావాలని తలంచి కేసీఆర్ తెలంగాణా రాష్ట్రంలో అనేక వినూత్న పథకాలను చేపట్టారని తెలిపారు.కెసిఆర్ చేపట్టిన పథకాలు ఈ రోజు దేశానికే మోడల్ గా మారాయని అన్నారు. బిసిలు, ఎంబిసిల ఎంబీసీల కోసం ప్రభుత్వం చేసే లక్షరూపాయల డబ్బుతో చేతివృత్తులు స్వతంత్రంగా నిలబడడానికి ఆధునిక పరిజ్ఞానంతో ఏవిధంగా ఉత్పత్తులను పెంచుకోవచ్చునో ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని వారికి అందించే బాధ్యతను ఉన్నత విద్యామండలి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన లక్షరూపాయల పథకం వేలాది మంది సహస్రవృత్తుల చేతివృత్తులకు అండగా నిలిచే వస్తువులను తయారు చేసే విధానాన్ని వారికి అందిస్తే అవి దేశానికే గొప్ప మానవ సంపదగా మారుతాయని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ముప్పయి మూడు జిల్లాల్లో వివిధ చేతివృత్తులకు సంబంధించిన వర్క్ షాపులు నిర్వహించాలని అన్నారు. నగరంలో సిగ్నల్ లైట్లు వద్ద రెండు మూడు నిముషాల్లో ఒక వస్తువును అమ్మగలిగిన వ్యాపారాత్మక నైపుణ్యాలు సంచార జాతుల సొంతమని వారికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తే దేశానికే కావలసిన ఉత్పత్తి శక్తులుగా మారుతారని అన్నారు. కెసిఆర్ దార్శనిక ఆలోచనలకు అండదండగా బహుజనుల చేతివృత్తులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా ఇంజనీరింగ్ కళాశాలలను మలచాలన్నారు. ప్రతిభ ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రోత్సాహమిస్తే చేతివృత్తులను ఆధునీకరించే అద్భుత ఆవిష్కరణలతో ఉత్పాదక రంగానికి ఎంతో మేలు చేస్తారని తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ గా నియమితులైన డా. యస్.కే. మహ్మూద్ ను జూలూరు ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరుతో పాటు కార్యదర్శి నామోజు బాలాచారి కూడా పాల్గొన్నారు.

## ఈటల ఏ పార్టీలో ఉన్నా ప్రశాంతంగానే ఉన్నారు : ఈటల జమున



(అక్షర సవాల్ ) హైదరాబాద్ : బిజెపి నాయకులు ఈటల రాజేందర్ ఏ పార్టీలో ఉన్న సంతృప్తిగా ఉన్నారని ఆయన ప్రజలకోసం పనిచేస్తారని ఈటెల జమున అన్నారు. మంగళవారం ఆమె షామీర్‌పేటలో మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ తాము ఎప్పుడు పదవుల కోసం పాకులాడలేదన్నారు. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం లేదని, పరోక్షంగా ఉండి ఈటల రాజేందర్ కు అండగా ఉంటానని తెలిపారు. ఈటల రాజేందర్ ప్రతిష్ఠ దిగజారిందని, మెప్పు కోసం మాట్లాడబోతున్నారు అని వాట్స్‌ప్‌లో పెడుతున్నారు. కానీ ఈటల ప్రతిష్ఠ ఎప్పుడు దిగజారదు. ఈటల ఉద్యమ కారుడు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ ప్రజలు అనుకుంటే ఏ పార్టీతో అయినా కెసిఆర్ ను ఓడించడం సాధ్యమేని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 20 కోట్లు పెట్టి ఈటల రాజేందర్‌ను చంపేస్తా అని ఎంఎల్‌సి కౌశిక్ రెడ్డి చెప్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రజలే మమ్ముల్ని కాపాడుకుంటారని తామెప్పుడు చెడు పనులు చేయలేదన్నారు.

## సోలిపేట రామచంద్రారెడ్డి మృతి

(అక్షర సవాల్ ) హైదరాబాద్ : రాజ్యసభ మాజీ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి ఈ ఉదయం స్వల్ప అస్వస్థతతో హైదరాబాదులో కన్నుమూశారు. ఆయన వయసు 92 సంవత్సరాలు. సిద్దిపేట జిల్లా చిట్టాపూర్‌కు చెందిన రామచంద్రారెడ్డి తొలితరం కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో పట్టభద్రులైన రామచంద్ర రెడ్డి అనంతరం రాజకీయాల్లో పూర్తి కాలం పనిచేశారు. స్వగ్రామం చిట్టాపూర్ సర్పంచ్ గా, దుబ్బాక సమితి అధ్యక్షుడిగా, సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా, అప్పటి మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా, దొమ్మాట శాసనసభ్యునిగా సేవలందించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా, రాజ్యసభలో ఆ పార్టీ నాయకులుగా, రాజ్యసభ హామీల అమలు స్థాయి సంఘం సభ్యులుగా, పలు హోదాల్లో విశిష్ట సేవలు అందించారు. ఇటీవలి కాలంలోనూ భారత చైనా మిత్రమండలికి అధ్యక్షులుగా, సి. ఆర్. ఫౌండేషన్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు వంటి సంస్థలకు సభ్యులుగా సేవలందించారు. లోక్ సత్తాలో కూడా కొంతకాలం కలిసి పని చేశారు. 70ఏళ్ల పాటు రాజకీయాలలో క్రియాశీలంగా పనిచేసి మచ్చలేని వ్యక్తిగా పేరుపొందారు. సోలిపేట రామచంద్రారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి చిన్న కుమార్తెను తమ పెద్ద కుమారుడు వెంకటేశ్వర్ రెడ్డికి చేసుకున్నారు. ఆయన మృతదేహాన్ని బంజారాహిల్స్ శాసనసభ్యుల నివాసాల్లో 272 ఏలో ఉంచారు. ఫిలింనగర్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి.

### ముఖ్యమంత్రి కెసిఆర్ సంతాపం

మాజీ ఎంపీ సోలిపేట రామచంద్రారెడ్డి మరణం పట్ల సిఎం కెసిఆర్ సంతాపాన్ని ప్రకటించారు. తొలితరం కమ్యూనిస్టు నేతగా, నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న 'సోలిపేట' జీవితం ఆదర్శవంతమైనదని సిఎం తెలిపారు. ఆయన రాజకీయ జీవితంలో సర్పంచి స్థాయి నుంచి ఎంఎల్‌ఏగా, ఎంపీగా ప్రజా జీవితంలోఉన్నత స్థాయికి ఎదిగిన క్రమం రేపటి తరానికి స్ఫూర్తిదాయకమని సిఎం పేర్కొన్నారు. సిద్దిపేట ప్రాంత వాసిగా, రాజకీయ. సామాజిక రంగాల్లో వారు ఆచరించిన కార్యాచరణ, ప్రజా జీవితంలో కొనసాగుతున్న తమ లాంటి ఎందరో నేతలకు ప్రేరణగా నిలిచారని అన్నారు. సోలిపేట మరణంతో తెలంగాణ మరో తొలి తరం ప్రజానేతను కోల్పోయిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సోలిపేట మృతి పట్ల మంత్రి సత్యవతి రాథోడ్ సంతాపం వ్యక్తం చేశారు. రామచంద్రరెడ్డి పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## బిజెపి అధికారంలోకి రావడం ఖాయం

### అధికార ప్రతినిధి సంగప్ప

(అక్షర సవాల్ ) హైదరాబాద్ : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో తమ పార్టీ అధికారంలోకి తప్పకుండా వస్తుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప సంగప్ప అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 600 కార్ల కాన్వాయ్‌తో సిఎం కెసిఆర్ మహారాష్ట్ర పర్యటనకు వెళ్లడం పై ఆయన విమర్శలు గుప్పించారు. కెసిఆర్ 600 కార్ల కాన్వాయ్‌తో హైదరాబాద్ నగరం నుంచి మహారాష్ట్ర బార్డర్ దాకా వెళ్ళడంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పై ఒక మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన ఆరోపణలని ఆయన ఖండించారు. ఈ సమావేశంలో బిజెపి అధికార ప్రతినిధులు విఠల్, కట్టా సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈటలవే హత్యా రాజకీయాలు

- ఎంపిటిసిని చంపిందెవరు, ఇప్పుడు నన్ను కూడా..
- రాజేందర్ దంపతులకు కౌశిక్ రెడ్డి కౌంటర్



(అక్షర సవాల్ ) /హైదరాబాద్ : బిజెపి నేత ఈటల రాజేందర్, ఆయన సతీమణి ఈటల జమున చేసిన వ్యాఖ్యలకు బిఆర్ఎస్ ఎంఎల్‌సి కౌశిక్ రెడ్డి కౌంటరిచ్చారు. ఈటలకే హత్యా రాజకీయాలు చేసే అలవాటుందని, ఉద్యమం సమయంలో ఆయన ఎంతోమందని వేధించారని రాజేందర్ ఆరోపించారు. 2001లో ఎంపిటిసి బాల్ రెడ్డిని ఈటల హత్య చేయించారని కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఆయనను చంపడం కాదని, ఈటలే తనను హత్య చేయిస్తారని భయంగా వుందని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో వున్నప్పుడు తనను చంపేందుకు కుట్ర చేశారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ.20 కోట్లిచ్చి చంపిస్తానని అంటున్నారని, ఇంతకంటే పెద్ద జోక్ లేదంటూ కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. జమున కూడా ఈటల డైరెక్షన్‌లోనే మాట్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. హుజూరాబాద్ అభివృద్ధిపై తాను ఈటలతో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. హుజురాబాద్‌లో అమర వీరుల స్థూపాన్ని తాను కూల్చివేసినట్లుగా ఈటల దంపతులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపాలిటీ తీర్మానం మేరకే కూల్చారని ఎంఎల్‌ఏగా ఆ తీర్మానాన్ని ఈటల రాజేందర్ ఆమోదించారన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా పురపాలక సంఘం అధికారులే దానిని తొలగించారని తెలిపారు. ఆ స్థూపంపై ఈటల పేరు లేదని, అసలక్కడ ఎలాంటి శిలాఫలకం లేదని ఆయన పేర్కొన్నారు. టిఆర్ఎస్ ఆవిర్భావ సమయంలో అసలు రాజేందర్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఎంఎల్‌ఏగా గెలవాలనే 2004లో ఈటల రాజేందర్ బిఆర్ఎస్ పార్టీలో చేరారని ఆయన ఆరోపించారు. ఈటల రాజేందర్‌ను ఇక నుంచి చీటర్ రాజేందర్‌గా పిలుస్తానన్నారు. ఈటల రాజేందర్ భార్య ముదిరాజ్‌లను చిన్న కులంగా సంబోధించి అవమానించారని, దానికి ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు ఇల్లు కూడా సరిగా లేని ఈటల వందల కోట్లతో ఐదెకరాల గడీ ఎలా కట్టుకున్నారని, పది, పదిహేను కోట్ల రూపాయల కార్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. దళితులు, బిసిలు, గిరిజనుల భూములను లాక్కున్నారని ఆరోపించారు. ఈటలను ఓడించే వరకూ తాను విశ్రమించేది లేదని, రాజకీయంగా కూల్చేది తనేనని అన్నారు. ఓటమి తప్పదని తెలిసి ఈటల ఆగమవుతున్నారని, అన్ని పార్టీలతో సంప్రదింపులు చేస్తున్నారని ఆరోపించారు.

## మొక్క నాటిన మన్నే క్రిశాంక్



గ్రీన్ ఇండియా ఛాలెంజ్

(అక్షర సవాల్ ) హైదరాబాద్ : తన పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపుమేరకు కంటోన్మెంట్ లోని తన నివాస ప్రాంగణములో తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే క్రిశాంక్ మొక్క నాటారు. ఈ సంద ర్భంగా మన్నే క్రిశాంక్ మాట్లాడుతూ తెలంగాణలో ఏ శుభకార్యం జరిగిన మొక్కలు నాటడం సాంప్రదాయంగా మారిందన్నారు. సిఎం కెసిఆర్ హరితహారం, ఎంపి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాల ద్వారా తెలంగాణలో గ్రీనరి పెరిగిందన్నారు. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ లో పాల్గొని మొక్కలు నాటడం ఆనవాయితీగా వస్తుందన్నారు. రాబోయే తరాలకు మంచి పర్యా వరణం అందించాలన్న లక్ష్యంతో ఎంపి సంతోష్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో ఎందరో భాగస్వామ్యం అయి మొక్కలు నాటుతున్నారన్నా రు. ఇంత మంచి కార్యక్రమం ప్రారంభించినందుకు ఎంపి సంతోష్‌కు అభినందలతో పాటు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండి యా చాలెంజ్ ప్రతినిధి శ్రవణ్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి

### 1న కలెక్టరేట్‌ల ముట్టడి : ఆర్ కృష్ణయ్య

(అక్షర సవాల్ ) హైదరాబాద్ : ఇంజినీరింగ్, డిగ్రీ, పి.జి తదితర కాలేజీ కోర్సులు చదివే 14లక్షల మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థుల గత రెండు సంవత్సరాల ఫీజులు బకాయిలు రూ. 5వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా స్కాలర్ షిప్స్ రెండు రెట్లు పెంచాలని ఆయన కోరారు. పై డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో భాగంగా జూలై 1న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ లు , ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓ కార్యాలయాలు ముట్టడించాలని రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షులు అంజి ప్రధాన కార్యదర్శి వేముల రామ కృష్ణతో కలిసి ఆర్ కృష్ణయ్య పిలుపును నిచ్చారు. కాలేజీ తరగతులు బహిష్కరించి శాంతి యుతంగా ర్యాలీలు నిర్వహించాలని కోరారు. మంగళవారం బిసి భవన్‌లో జరిగిన సమావేశంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, రాజ్‌కుమార్, జి. కృష్ణ యాదవ్, సతీశ్, వెంకట్, భాస్కర్, నందగోపాల్, కె.నర్సింహా గౌడ్, రాజ్ కుమార్, బలరామ్, నిఖిల్ తదితరులు ప్రసంగిచారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు బడ్జెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గత రెండు సంవత్సరాల ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నాయని, క్లాసుల నుంచి బయటకు పంపి ఎండలో నిలబెట్టి అవమాన పరుస్తున్నాయన్నారు.

## వినికిడి లోపం నివారణ కోసం కృషి చేయాలి

- మానసిక వైకల్యం పెరగకుండా చర్యలు చేపట్టాలి
- ఇండియన్ సైన్స్ లాంగ్వేజ్ అభివృద్ధి కోసం పోరాడాలి
- హెలెన్ కెల్లర్ జయంతి స్మారక సెమినార్‌లో వక్తలు



(అక్షర సవాల్ ) హైదరాబాద్ : దేశంలో పెరిగిపోతున్న వినికిడి లోపం నివారణ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు. మానసిక వైకల్యం పెరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. బధిరుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 143వ జయంతి సందర్భంగా మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హెలెన్ కెల్లర్ విద్యా సంస్థలు, ఎన్‌పిఆర్‌డి టిఎస్‌ఎల్‌పిఎ ఆధ్వర్యంలో వినికిడి లోపం, ఆటిజం, మానసిక వైకల్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై స్మారక సెమినార్' జరిగింది. వికలాంగుల వాయిస్ మాస పత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సెమినార్‌లో హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎమ్ శశిధర్ రెడ్డి, తెలంగాణ ఆడియలజిస్ట్, స్పీచ్ లాంగ్వేజ్ పాతలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె నాగేందర్, ఇమధ్ ఖాన్ రుమాని, క్లినికల్ సైకాలజిస్ట్ పూజ సిద్ధంశెట్టి, ప్రముఖ ఆడియలాజిస్ట్ సుజన్, ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె వెంకట్, ఎమ్. అడివయ్య, కేంద్ర కమిటీ సభ్యులు అర్ వెంకటేష్, జె.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు యశోద, సహాయ కార్యదర్శులు ఉపేందర్, దశరథ్, బాలిశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1880 జూన్ 27న అమెరికాలోని తుస్కుంబియ అనే చిన్న గ్రామంలో హెన్రీ కెల్లర్, కెట్ అడమ్స్ కెల్లర్ దంపతులకు జన్మించిన హెలెన్ కెల్లర్ 19నెలల వయస్సులోనే తీవ్రమైన అనారోగ్యం కారణంగా దృష్టిని, వినికిడి శక్తిని కోల్పోయారన్నారు. 1933లో నేషనల్ లైబ్రరీ ఆఫ్ బ్లైండ్ సంస్థకు అధ్యక్షురాలుగా ఎంపికై అనేక పుస్తకాలను బ్రెయిలీ లిపిలో ముద్రించిందన్నారు. ప్రస్తుతం ప్రతి 18 మందిలో ఒకరు వినికిడి సమస్య ఎదుర్కొంటున్నారని, ప్రపంచ వ్యాప్తంగా 2050 నాటికి వినికిడి సమస్యలున్న వారి సంఖ్య 105కోట్లకు చేరుతుందని డబ్ల్యుహెచ్ఓ ప్రకటించిందని వక్తలు పేర్కొన్నారు. 78శాతం పేద దేశాల్లో 10లక్షల మందికి ఒక ఇఎన్‌టి డాక్టర్ కూడా లేరని ఆడియాలజిస్టులు, స్పీచ్ తెరపిస్టులు చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వినికిడి పరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్యశ్రీ పథకంలో వినికిడి సమస్యలు చేర్చడం ద్వారా ఎక్కువ మందికి వైద్యం అందుబాటులోకి తేవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం కాకతీయ ఇంప్లాంటేషన్ ఉచితంగా చేస్తుందని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పీట్స్ తెరపిస్టులు ఆడియాలజిస్టు నియమించడం ద్వారా వినికిడి సమస్య నుండి బయటపడవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. కేంద్రం అజాధిక అమృత్ మహోత్సవాలు ఒకవైపు చేస్తూ మరోవైపు ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌ని అభివృద్ధి చేయకుండా అమెరికన్ చైన్ లాంగ్వేజ్ వినియోగించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బదిరుల విద్యాభివృద్ధి కోసం సైన్ లాంగ్వేజ్ పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక టీచర్ల నియమించాలన్నారు. మనదేశంలో 15నుండి 20శాతం మంది వినికిడి మరియు మాట సంబంధిత సమస్యతో బాధపడుతున్నారని వక్తలు పేర్కొన్నారు. 50 ఏళ్ల లోపు వయస్సున్న వారిలో 60 శాతం, 70 ఏళ్ల పై వయసున్న వారిలో 75శాతం మంది వినికిడి లోపానికి గురవుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం 5000 మంది మాత్రమే ఆడియాలజిస్టులు ఉన్నారు ప్రభుత్వ ఆసుపత్రి అన్నింటిలో ఆడియాలజిస్టులను నియమించాలన్నారు. ప్రతి 66 మంది పిల్లలలో ఒక్కరికి ఆటిజం సమస్య ఉందని. ఆటిజం బాలికల కంటే అబ్బాయిల్లో 40 శాతం ఎక్కువగా నిర్ధారణ అవుతోందన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ఆటిజంను కూడా అంగవైకల్యంగా గుర్తించినా ఇప్పటి వరకు వారికి వైకాల్య ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.





# మాది బహుజనుల టీమ్

(మొదటిపేజీ తరువాయి)

బిఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు సిఎం కెసిఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సర్కోలిలో జరిగిన బహిరంగ సభలో సిఎం కె.చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. తెలంగాణ మాదిరిగా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి సాధ్యం కాలేదని ప్రశ్నించారు. తెలంగాణలో అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యం అయినప్పుడు మహారాష్ట్రలో ఎందుకు కాదని అన్నారు. వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ మహారాష్ట్ర ఇలా ఉండాల్సింది కాదని, మరింత అభివృద్ధి చెందాల్సి ఉండాలని అభిప్రాయపడ్డారు. దశాబ్దాల పాటు మహారాష్ట్రను పాలించిన కాంగ్రెస్, బిజెపి పార్టీలపై కెసిఆర్ విరుచుకుపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిపోయాయని, అభివృద్ధి ఎలా ఉందో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. అభివృద్ధి విషయంలో పొరుగు దేశం చైనా ఎక్కడున్నది...? భారత్ ఎక్కడున్నదో చూడాలని పేర్కొన్నారు.

## నేతలు దివాళా.. రైతులకు దివాళి

తెలంగాణ సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే దివాళా తీస్తామని కొందరు అంటున్నారని.. కానీ, దివాళా తీసేది నేతలు, దివాళి పండుగ చేసుకొనేది రైతులని సిఎం కెసిఆర్ అన్నారు. రైతు సంక్షేమ పథకాలు అమలైతే దేశంలోని రైతులంతా బిఆర్ఎస్ వెంట నడుస్తారని బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు భయం పట్టుకున్నదని ఎద్దేవా చేశారు. అందుకే బిఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.భారతదేశంలో 41 కోట్ల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమి ఉందని, దేశంలో 1 లక్ష 40 వేల టిఎంసిల వర్షపాతం సంభవిస్తుందని వివరించారు. దీంట్లో సగం నీరు భాష్పీకరణ ప్రక్రియ ద్వారా ఆవిరిగా మారుతుండగా, మిగిలిన 70 నుంచి 75 వేల టిఎంసిల స్వచ్ఛమైన నీరు నదుల్లో ప్రవహిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు దమ్ముంటే, వారు సరైన విధానాలు అమలు చేస్తే ప్రతీ ఎకరానికి సరిపడా సాగు నీటిని అందించవచ్చని తెలిపారు. దేశంలో అందుబాటులో ఉన్న 70 వేల టిఎంసిల నీటిలో ... మనం ఎన్ని టిఎంసిలు వాడుకొంటున్నామని అడిగారు. దేశంలో ఇంత నీరుండగా ఎందుకు వాడుకోలేకపోతున్నామని ప్రశ్నించారు. వ్యవసాయ యోగ్యమైన భూమిలో ఎంత మేర మనం సాగు చేయగలుగుతున్నామని అడిగారు. ప్రభుత్వంలో సత్తా ఉంటే ప్రతి ఎకరాకు నీరు అందించవచ్చని పేర్కొన్నారు. బిజెపికి దమ్ము ఉంటే దేశంలోని ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలని సవాల్ విసిరారు. భారత జల్ నీతిని మార్చాలని, నీల్లుండగా మోసపోకూడదని పిలుపునిచ్చారు. విద్యుత్తు ఉత్పత్తి 5 రకాలుగా జరుగుతుందని, థర్మల్ విద్యుత్తు మాత్రమే సరియైన విధానమని పేర్కొన్నారు. దేశంలో 150 ఏండ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఎందుకు వాటిని సరిగా ఉపయోగించుకోకూడదని ప్రశ్నించారు. మనం ఐక్యం కానంత వరకు మన సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కిసాన్ సర్కార్ ఏర్పాటు చేసి, రైతులకు 24 గంటల నిరంతన ఉచిత విద్యుత్తును అందిస్తామని హామీ ఇచ్చారు.

## రైతులకు అండ..

తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ప్రతి సంవత్సరం ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుందని కెసిఆర్ తెలిపారు. దేశంలో పండుతున్న ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం రైతులు ఆందోళన బాట ఎందుకు పట్టాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడాలంటే బిఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని అన్నారు. పని చేయని ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, రైతుల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు.

## ఈయన పేరు భగీరథ.. ఈ ప్రాంతానికి నీళ్ల తెస్తడు

భగీరథ బాల్కే.. ఈయన పేరులోనే భగీరథుడి పేరు ఉన్నదని, ఈ ప్రాంతానికి నీళ్ల తెస్తాడని సిఎం కెసిఆర్ తెలిపారు.భగీరథ్ బాల్కే రానున్న రోజుల్లో చంద్రబాగ్ నీటిని మంగళ్‌వాడ్‌కు తరలించనున్నారని చెప్పారు. భగీరథ బాల్కేను గెలిపిస్తే మంత్రిని చేస్తానని ప్రకటించారు. మహారాష్ట్రలో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణలో అమలయ్యే ప్రతి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆసరా పింఛన్లు, దళితబంధు, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి తదితర పథకాలను అమలు చేస్తామని వెల్లడించారు.

## నా కళ్ళ ముందే ఎన్నో దేశాలు గొప్పగా పురోగమించాయి

తాను ఈ సభలో ప్రస్తావించే విషయాలను మీరు మీ మీ గ్రామాలకు వెళ్ళాక మిత్రులతో, బంధువులతో చర్చించాలని సిఎం కెసిఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన దేశానికి ఏదైనా లక్ష్యముందా లేక లక్ష్యం లేకుండా మనం దారి తప్పిపోయామా..?, దారి మరిచి చీకట్లో మగ్గుతున్నామా..? అని ప్రశ్నించారు. ప్రతి భారతీయునికి ఈ విషయంపై ఆలోచించాల్సిన అనివార్య సమయమిదని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో త్యాగాలతో నేడు మనం స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని, కానీ నేడు మరో స్వాతంత్ర్య సంగ్రామాన్ని మనం చేపట్టాల్సి ఉన్నదని పిలుపునిచ్చారు. నూతనోత్సాహంతో విప్లవ మార్గంలో ఒక కొత్త ఉషోదయం కోసం భారతదేశం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.మనకు స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు అయిందని, ఇది తక్కువ సమయమేమీ కాదని పేర్కొన్నారు. మన కళ్ళ ముందే ఎన్నో దేశాలు గొప్పగా పురోగమించాయని తెలిపారు. సౌత్ కొరియా, జపాన్, సింగపూర్, మలేషియా, భౌగోళికంగా హిమాలయాలకు ఆవల మన సరిహద్దు దేశమైనా చైనా దేశం ఉందని, 1982 వరకు చైనా దేశం మన దేశం కంటే బీద దేశంగా ఉండేదని వివరించారు. నేడు చైనా దేశం ఎక్కడుంది.. .మనం ఎక్కడున్నామని, ఈ విషయంపై ప్రతి ఒక్కరు ఆలోచించాలని కోరారు.



ఆలయాన్ని సందర్శించి బయటికి వస్తున్న కెసిఆర్‌కు విఠలేశ్వరుడు, రుక్మిణీ అమ్మవార్ల ప్రతిమ అందజేస్తున్న స్థానికుడు

# ఒక్క పార్టీ అయినా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిందా..?

ఎన్నికలు వస్తుంటాయి. పోతుంటాయి.. ఒకరు గెలుస్తారు. ఒకరు ఓడుతారు.. ఎన్నీ పార్టీలకు మీరు మద్దతు పలికారని ప్రజలను ఉద్దేశించి సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని ప్రజలు అందలం ఎక్కించని ఒక్క పార్టీ పేరైనా చెప్పండని అడిగారు.కాంగ్రెస్ పార్టీ 50 సంవత్సరాలు పాలించింది... వీరి తర్వాత ఎన్‌సిపికి అవకాశమిచ్చారు...శివసేనకు, బిజెపికి...ఇలా అందరికీ అవకాశం కల్పించారని, వీరిలో ఒక్కరైనా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చారా..? అని ప్రశ్నించారు. నూతన రాష్ట్రమైన తెలంగాణలో అతి తక్కువ సమయంలో రైతుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. నాకు మరాఠీ మాట్లాడటం రాదు...కానీ అర్థం చేసుకోగలనని కెసిఆర్ చెప్పారు. మన యుద్ధంలో న్యాయం ఉంది... తప్పకుండా మనం విజయం సాధిస్తామని సిఎం కెసిఆర్ ధీమా వ్యక్తం చేశారు. కొద్దిరోజుల్లోనే మహారాష్ట్ర మారుతుందని.. రైతుల జీవితాలు మారుతాయని చెప్పారు. తుమ్మచెట్టును నాటితే మామిడి పండ్లు ఎలా కాస్తాయి?(బోయా పేడ్ బబూల్ కా, ఆయే కహా సే ఆమ్...?), మామిడి పండ్లు తినాలనుకుంటే మామిడి చెట్టునే నాటాలి(ఆమ్ కా అపేక్షా హై తో ఆమ్ కో పౌదా లగానా చాహియే) అని పేర్కొన్నారు. ముండ్ల చెట్టును నాటి, పండ్లు కావాలంటే కుదరదు(కాంటోన్ కా పేడ్ లగాకే, ఫలోం కా అపేక్షా కరేతో నహీ మిలేగా), పాలు కావాలంటే ఆవులకు గడ్డి వేయండి, గాడిదలకు గడ్డి వేసి, ఆవుల నుండి పాలు ఎలా పొందగలం..?(గాయ్ సే దూద్ లేనా హై తో గాయ్ కో గాస్ దీజియే, ఘదోంకో గాస్ దేదో ఔర్ గాయోన్ కో దూద్ పూఛో తో కహా సే మిలేగా) అని అన్నారు. మీకున్న ఓటు శక్తితో అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని ప్రజలకు పిలుపునిచ్చారు. మనం విభజింపబడక పోయినట్లైతే తప్పకుండా మనం ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. తాను స్వయంగా రైతును అని, రైతు కుటుంబంలో పుట్టినందుకు తాను గర్వపడుతున్నానని కెసిఆర్ అన్నారు. ఒక రైతుగా తాను రైతుల కష్టాలను, బాధలను అర్థం చేసుకోగలనని చెప్పారు. పశ్చిమ మహారాష్ట్రలో ఉచితంగా రైతలుకు కరెంటు ఇస్తున్నారా..?, రైతులకు పంట పెట్టుబడి ఇస్తున్నారా.. ? అని సిఎం కెసిఆర్ అడగగా, ఇవ్వటం లేదని రైతుల గట్టిగా సమాధానం చెప్పారు. గ్రామ రెవన్యూ వ్యవస్థను కొనసాగించాలా..? అని కెసిఆర్ అడుగగా, వద్దు.. వద్దంటూ ప్రజలు గట్టిగా సమాధానం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియాను ప్రకటించిందని, డిజిటల్ ఇండియా సరైనదే అయితే మహారాష్ట్ర రైతుల కోసం ఈ సౌకర్యాన్ని ఎందుకు కల్పించటం లేదని నిలదీశారు. రెవెన్యూ వ్యవస్థలోని అక్రమాల నుండి ప్రజలను కాపాడాలని, కానీ ఎవరూ ఈ మాటలు చెప్పడం లేదని అన్నారు. దేశ ప్రధాని మేకిన్ ఇండియా అన్నారు.. మేకిన్ ఇండియా అమలైతే ప్రతి చోట చైనా బజార్లు ఎందుకు కనిపిస్తున్నాయని ప్రశ్నించారు. పతంగుల మాంజాలు, హోళీ రంగులు, దీపావళి పటాకులు అన్నీ చైనా నుండి వస్తున్నాయని ఎద్దేవా చేశారు. భారతదేశంలో వీటిని తయారుచేయలేమా...? అని అడిగారు.దేశంలో నూతన విధానాలు రావాలి....పారదర్శకత పెంపొందాలని, అందుకు ప్రజల ముందుండాలని పిలుపునిచ్చారు. గ్రామ రెవెన్యూ ఉద్యోగులు తమకు వ్యతిరేకంగా ఓటు వేస్తారని, అయినా జనం బాగు కోసం గ్రామ రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని ప్రతి ప్రాంతంలో తాను అడిగితే, గ్రామ రెవెన్యూ వ్యవస్థను తొలగించాలని చెప్పారని అన్నారు. భూ రికార్డుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తెలంగాణలో ధరణి పోర్టల్ ద్వారా పకడ్బంధీగా రికార్డులను కాపాడుతున్నామని తెలిపారు. సిఎం కెసిఆర్ అమలు చేస్తున్న ఈ పథకాలను మీరెందుకు అమలు చేయడం లేదని నాయకులను అడగాలని ప్రజలకు చెప్పారు. మహారాష్ట్ర ప్రజలు తెలంగాణకు వస్తే అక్కడ అమలవుతున్న పథకాలను స్వయంగా చూపిస్తామని అన్నారు. 70 కోట్ల మంది రైతాంగం బిఆర్ఎస్ వెంట ఉండగా బిఆర్ఎస్ మరో పార్టీకి టీం ఎలా అవుతుంది..? ప్రశ్నించారు. రైతులు బిఆర్ఎస్ వెంట ఉన్నారా..? యుద్ధం చేద్దామా...? అని కెసిఆర్ అడుగగా, మీ వెంటే ఉన్నామంటూ రైతుల నినాదాలు చేశారు.



# ఆలయాలను సందర్శించిన కెసిఆర్

**రెండు రోజుల మహారాష్ట్ర పర్యటన ముగించుకుని తిరిగి ప్రగతి భవన్ చేరిక**

(అక్షర సవాల్ ) /హైదరాబాద్ : మహారాష్ట్ర పర్యటనలో రెండో రోజైన మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తుల్జాపూర్లో కొలువైన తుల్జా భవానీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయం వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో భవానీ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌కు అర్చకులు ఆశ్వీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు సిఎం కెసిఆర్ సర్కోలిలో జరిగిన బిఆర్ఎస్ సభలో పాల్గొన్నారు. అక్కడి నుంచి తుల్జాపూర్ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం తన రెండు రోజుల పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ఉన్నారు.

## శ్రీవిఠలేశ్వర స్వామికి, రుక్మిణీ అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

పండరిపూర్‌లోని విఠలేశ్వర స్వామి, రుక్మిణీదేవీని సిఎం కెసిఆర్ మంగళవారం ఉదయం దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిఠల్ రుక్మిణీ ఆలయ సందర్శన సందర్భంగా సిఎం కెసిఆర్ శ్రీవిఠలేశ్వర స్వామికి, రుక్మిణీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత అమ్మవారి పాదాలను పసుపు కుంకుమలతో అలంకరించి మొక్కుకున్నారు. ఆలయ అర్చకులు సిఎం కెసిఆర్‌కు మెడలో తులసి మాల వేసి వేదమంత్రాలతో ఆశీర్వాదించారు. అంతకుముందు కెసిఆర్ ఆలయానికి చేరుకోగానే ప్రధాన ద్వారం దగ్గర ఆయనకు పుష్ప గుచ్ఛాన్ని ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కాషాయ వస్త్రం కప్పి సత్కరించారు. అనంతరం శ్రీవిఠలేశ్వర స్వామి, రుక్మిణీ అమ్మవార్లతో కూడిన ప్రతిమను, అదేవిధంగా రుక్మిణీ అమ్మవారి చిత్రపటాన్ని సిఎం కెసిఆర్‌కు బహూకరించారు.





# ప్రతి గ్రామంలో బిఆర్ఎస్ వ్యాపిస్తుంది

- దేశ ప్రజలను, తెలంగాణ ప్రజలను సుభిక్షంగా సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని ప్రార్థించాను
- దేశంలోనే మొట్టమొదటిసారిగా ఎవరూ ఇవ్వని రైతురాజ్య స్థాపన నినాదాన్ని బిఆర్ఎస్ పార్టీ ఇచ్చింది
- 'మహా' విలేకరులు అడిగిన ప్రశ్నలకు సిఎం కెసిఆర్ సమాధానాలు



(అక్షర సవాల్ ) /హైదరాబాద్ : దేశ ప్రజలను, తెలంగాణ ప్రజలను సుభిక్షంగా సుఖ:సంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని బ్రహ్మాండ నాయకుడైన విఠలున్ని, ఇప్పుడు తుల్జా భవాని మాతనుతాను ప్రార్థించానని సిఎం కేసిఆర్ తెలిపారు. సకల జనుల సంక్షేమం కోసం పాటుపడే తాము ఉదయం బ్రహ్మాండ నాయకుడైన విఠలున్ని, ఇప్పుడు తుల్జా భవాని మాతను దర్శించుకుని ప్రార్థించానని చెప్పారు. తుల్జా భవాని అమ్మవారి సందర్శన, పూజల అనంతరం సిఎం కెసిఆర్ హైదరాబాదుకు తిరుగు ప్రయాణమయ్యే సమయంలో అక్కడ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సిఎం స మాధానాలు ఇచ్చారు. అమ్మవారె స్వయంగా పిలిపించుకుంటే తప్ప అమ్మవారి దర్శనం సాధారణంగా జరిగేది కాదని సిఎం కెసిఆర్ తెలిపారు. ఉదయం విఠలేశ్వరుని దర్శనం, ఇప్పుడు తుల్జా భవాని దర్శనం తనకెంతో ఆనందాన్నిస్తుందని, ఇది తమకు దక్కిన అదృష్టంగా సిఎం పేర్కొన్నారు.

## రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వం 35 లక్షలకు చేరుకుంటుంది

బిఆర్ఎస్ పార్టీ కార్యాచరణ ఎలా ఉండబోతుందని అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ.... తాము ఇప్పటికే పలుసార్లు స్పష్టం చేశామని, ఈ దేశంలో ప్రకృతి వనరులు సకల సంపదలు ఉన్నాగాని, దేశ రైతాంగం ప్రజలు సాగునీరు, తాగునీరు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు లేక కష్టాలు పడుతున్నారని, ఈ పరిస్థితులలో మార్పు తేవడానికి బిఆర్ఎస్ పార్టీ పుట్టిందని పునరుద్ఘాటించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఎవరు ఇవ్వని రైతురాజ్య స్థాపన నినాదాన్ని బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిందని సిఎం గుర్తు చేశారు. ఇప్పటికే మహారాష్ట్ర వ్యాప్తంగా పల్లె పల్లెనా ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఘన స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. గ్రామీణ కమిటీల్లో ఇప్పటికే 11 లక్షల మంది సభ్యులుగా చేరారని, రానున్న కాలంలో వారి సంఖ్య 35 లక్షలకు పైగా చే రుకుంటుందని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని ప్రతి గ్రా మంలో బిఆర్ఎస్ వ్యాపిస్తుందని, గ్రామ గ్రామాన 9 కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ దేశంలోని ప్రజలు, రైతాంగం తమ ప్రభుత్వాన్ని తామే ఏర్పాటు చేసుకునే దిశగా ఆలోచన చేస్తున్నారని, అందులో భాగంగా బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకొని కిసాన్ సర్కారును స్థాపించుకుంటారనే సంపూర్ణ విశ్వాసం తనకున్నదని స్పష్టం చేశారు.

## మేము ప్రజల దగ్గరికి వెళుతున్నాం... వారి తీర్పును కోరుతున్నాం

బిఆర్ఎస్ ను ఎ టీం, బి టీం అని అంటున్నారని మరో విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ... ఇటువంటి విమర్శ చేసే వాళ్ల అభద్రతాభావానికి, ఓర్వలేని తనానికి ఈ విమర్శ నిదర్శనంగా సిఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ, తాను ఎవరి పేరు తీసుకోలేదు, ఎవరినీ విమర్శించట్లేదని, వీళ్లకు దేనికి బాధ..? అని, వీళ్ళకి ఎందుకు ఆక్రోషం..? అని ప్రశ్నించారు. ఏ పార్టీకి అధికారం ఇచ్చినా అది ప్రజలు ఇచ్చిందే అని పేర్కొన్నారు. తాము ప్రజల దగ్గరికి వెళుతున్నాం... వారి తీర్పును కోరుతున్నామని తెలిపారు. ఈ దేశంలో భిన్నమైన ఆలోచనలు చేయకపోతే.. మార్పు దిశగా ఈ దేశం పయనించకపోతే.. సంక్షేమం అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ దేశంలో అందుబాటులో ఉన్న బొగ్గుని, విద్యుత్తు ఉత్పాదన కోసం.. నదీ జలాలను సాగునీరు తాగునీరు కోసం.. ఇంకా అనేక సహజ వనరులను సంపదను దేశ ప్రజల సంక్షేమం కోసం వినియోగించుకునే ఆలోచన ఔట్ ఆఫ్ ది బాక్స్ దృక్పథం ఈ దేశంలోని కేంద్ర పాలకులకు లేకపోవడమే అసలు సమస్య అని సిఎం సమాధానం ఇచ్చారు. చర్చించాల్సిన విషయాలను పక్కకు పెట్టి అనవసరమైన విషయాలను చర్చించి ప్రజల దృష్టి మళ్లించడమే లక్ష్యంగా బిజెపి, కాంగ్రెస్ చేసే విమర్శలను పట్టించుకోబోమమని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతుల ఆత్మహత్యలు లేని భారతదేశమే లక్ష్యంగా బిఆర్ఎస్ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. తాము దేశ ప్రజల ఆధరాభిమానాలు చూరకొంటామని సిఎం కెసిఆర్ పునరుద్ఘాంటించారు.

## బిఆర్ఎస్‌లోకి భారీగా 'మహా' నేతలు

బిఆర్ఎస్ పార్టీ విధానాలు, అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదానికి ఆకర్షితులై దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బిఆర్ఎస్‌లో చేరుతున్నారు. మహారాష్ట్రలోని పండరిపూర్‌లో మంగళవారం జరిగిన బిఆర్ఎస్ బహిరంగ సభలో పార్టీ అధినేత, సిఎం కెసిఆర్ సమక్షంలో పండరిపూర్ ఎన్‌సిపి నేత భగీరథ్ బల్కే తోపాటు పలువురు ముఖ్యనేతలు బిఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో అదితి యాదవ్, ప్రశాంత్ షిండె, సామధాన్ పాటే, నితిన్ భగల్, మేజర్ విలాస్ భోస్లే, తానాజీ చవన్, బిబిషన్ జాదవ్, అనంత్ భోస్లే, తదితరులు ఉన్నారు.

# అక్షర సవాల్

## మళ్లీ ఉమ్మడి పౌరస్మృతి మాట

ఒకే దేశం..ఒకే చట్టం.. అనేది భారతీయ జనసంఘ్ నినాదం. ఆ పార్టీ రూపాంతరమైన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన ఎన్నిక ప్రణాళికలో దీనిని చేర్చింది. భారతీయులంతా ఒకటేనన్న సమైక్య భావనను ఇది ప్రోది చేస్తుందనేది ఆ పార్టీ విశ్వాసం. తాజాగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఉమ్మడి పౌరస్మృతి గురించి పరోక్షంగా ప్రస్తావించారు. ఒక దేశంలో కొందరికి రెండు చట్టాలు ఎందుకు వర్తించాలన్నది ఆయన వాదన. ఈ ఏడాది ఐదు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు, వచ్చే ఏడు సార్వత్రిక ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతాయి. ఉమ్మడి పౌరస్మృతి నినాదం ఆ పార్టీ దృష్టిలో మంచిదే కావచ్చు. కానీ, బహుళత్వాన్ని కలిగి ఉన్న మనదేశలో తరతరాలుగా రెండు చట్టాలను అనుభవిస్తున్న వర్గాలు, లౌకికవాదాన్ని వినిపించే వర్గాలు ఇలాంటి చట్టాలను వ్యతిరేకిస్తాయని పాలకులకు తెలుసు. గతంలో ఉమ్మడి పౌరస్మృతి గురించి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పెద్దఎత్తున ఉద్యమం చేశారు. ఆ రోజుల్లో ఆయన ఏకాత్మతా వాదాన్ని ప్రతిపాదించారు. ఈ దేశంలో పుట్టిన పౌరులందరికీ సమాన హక్కులు, చట్టాలు ఉండాలన్నది ఆయన వాదన. ఆయనే కాదు, భారతీయ జనసంఘ్ నాయకులంతా ఆ భావజాలాన్ని వ్యాపింపజేయడానికి ఎంతో కృషి చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ మురళీ మనోహర్ జోషి ఏకాత్మతా వాదానికి ప్రజల్లో ప్రాచుర్యం తేవడానికి కాశ్మీర్ నుంచి కన్యాకుమారివరకు యాత్ర చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం కోసం బీజేపీ వ్యవస్థాపక నాయకుడు ఎల్‌కె అద్వానీ జరిపిన రథయాత్రలో కూడా అంతర్లీనంగా ఉమ్మడి పౌరస్మృతి గురించి ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఉమ్మడి పౌరస్మృతికి హిందువుల్లో వ్యతిరేకత లేదు. కానీ, ముస్లింలు దీనిని అంగీకరించరు. వారికి పర్సనల్ లాబోర్డు ఆదేశాలే శిరోధార్యం. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలని రాజ్యాంగంలోని 44వ అధికరణం కూడా నిర్దేశిస్తోంది. అయినా, దేశంలో మైనారిటీ వర్గాలు దీనిని ఎప్పటికప్పుడు వ్యతిరేకించ డంతో ఘర్షణలకు తావివ్వరాదని ప్రభుత్వం వాయిదా వేస్తోంది. ఉమ్మడి పౌరస్మృతి మాదిరిగానే ముస్లింలలో తలాక్ అనే ఆచారం ఉంది. దీనిని కూడా రద్దు చేయాలని ఎంతో కాలంగా కమలనాథులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఇది కూడా బీజేపీ అజెండాలో ఉంది. ఎన్నికల ముందు కమలనాథులు తమ అజెండాను ప్రజల ముందు ఉంచుతున్నారు కానీ, అమలు చేయలేకపోతున్నారు. ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటులో తమ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చిన తర్వాత పార్టీ అజెండాలోని అంశాలను ఒక్కొక్కటీ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఆ మందిరం నిర్మాణం చకచకా సాగిపోతోంది. దీనిని మత పరమైన, అంశంగా కాకుండా స్థల వివాదంగా కోర్టు పరిష్కరించింది. రామమందిరం స్థలానికి బదులుగా ముస్లింలు మసీదు కట్టుకునేందుకు ప్రత్యామ్నాయ స్థలాన్ని హిందువులు ఇచ్చేట్టు పరిష్కారం కుదిరింది. అలాగే, తలాక్ సమస్యను స్త్రీ, పురుషుల మధ్య సమానత్వ భావన ప్రాతిపదికగా అప్పటికప్పుడు ముమ్మారు తలాక్ చెప్పే విధానాన్ని రద్దు చేశారు. ఈజిప్ట్ వంటి ముస్లిం దేశం ఎప్పుడో దశాబ్దాల కిందటే తలాక్ విధానాన్ని రద్దు చేసిందని బీజేపీ చెబుతూనే ఉంది. ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతి సమస్యను పరిష్కరించేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ నోటివెంట ఉమ్మడి పౌరస్మృతి మాట రావడం యాదృచ్ఛికం అనుకోవడానికి లేదు. ఊహించినట్టే విపక్షాలు మోడీ వ్యాఖ్యలపై గళం విప్పడం ప్రారంభించాయి. మొత్తం మీద రాజకీయ తేనెతుట్టెను కదిపారన్న మాట. వచ్చే ఎన్నికల్లో ఈ అజెండాతో ప్రజల వద్దకు వెళ్ళేందుకు కమలనాథులు సిద్ధమవుతున్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లు పెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతిని తాము వ్యతిరేకిస్తున్నామని, హిందువుల్లో ముందు ఆ విధానం అమలు చేయాలని, ఆలయాల్లో దళితులతో పూజలు చేయడానికి అవకాశం కల్పించాలని తమిళనాడు సీఎం స్టాలిన్ అన్నారు. మిగతా రాజకీయ పార్టీలూ రేపోమాపో స్పందించడం ఖాయం. అయితే, ఉమ్మడి పౌరస్మృతిలా కాకుండా సమాజంలో స్త్రీ, పురుష భేదాన్ని నివారించేందుకు చర్యలు తీసుకుని రావాలని కోర్టులు చెబుతున్నాయి. వివిధ మతాల ప్రజ లు వారి మతాచారాల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటారు. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయడం సాధ్యం కాదని పలువురు పేర్కొంటున్నారు. మత స్వేచ్ఛ విషయంలో ఎలాంటి మార్పులు లేకుండా లింగ వివక్ష ఉండరాదన్న నియమం కింద ఈ పౌరస్మృతి అమలుకు కోర్టుల ఆదేశాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.



## హైదరాబాద్‌కి సరికొత్త హంగులు

హైదరాబాద్ నగరం విశ్వనగరంగా రూపుదిద్దుకుంటోంది. ఫ్లైఓవర్లు, సరికొత్త నిర్మాణాలు, స్కై వాక్‌లు.. ఒకటేమిటి.. మహానగరానికి ఉండాల్సిన హంగులన్నీ ఒకటొకటిగా అమరుతున్నాయి. ఉమ్మడి పాలనలో ట్రాఫిక్ జామ్‌లతో విసుగుపుట్టించేలా నగరం ఉండేది. ఇవాళ కేసీఆర్ పాలనలో సగర్వంగా స్కైవాక్లను నిర్మించుకుంటున్నది. ఎప్పుడో 1591లో నిర్మితమైన ఈ నగరం నేడు ప్రపంచ దేశాల కార్పొరేట్ పరిశ్రమలకు, డేటా సెంటర్ల భద్రతకు స్వర్గధామంగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వ కృషే కారణం. స్నేహపూర్వక పోలీసు వ్యవస్థ, పటిష్టమైన శాంతి భద్రతలు, విమానాశ్రయాలు, మెట్రో రైలు, అధునాతన రోడ్లు, పదుల సంఖ్యలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఇలా.. అనేక అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టడం వల్లే ఇదంతా సాధ్యపడింది. హైదరాబాద్ నగర జనాభా నేడు కోటిన్నర వరకు దాటింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ కష్టాలు కూడా ఎక్కువయ్యాయి. వాటిని నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మక రహదారి అభివృద్ధి(ఎస్ఆర్డీపీ) పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి దశలో రూ.8092 కోట్లతో 48 చోట్ల ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, కేబుల్ బ్రిడ్జిలు, స్టీల్ బ్రిడ్జిలు, ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటి వరకు 37 చోట్ల ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. 19 ఫ్లై ఓవర్లు, 5 అండర్‌పాస్‌లు, ఎనిమిది ఆర్వోబీ/ఆర్‌యూబీలు, ఒక కేబుల్ బ్రిడ్జి, విస్తరణ బ్రిడ్జి ఒకటి, ఓఆర్ఆర్ నుంచి మెదక్ జంక్షన్ వరకు ప్రాజెక్టులు రావడంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడింది. కాగా ఇవి అందుబాటులోకి వచ్చిన చోట ట్రాఫిక్ సమస్య పూర్తిగా తొలగిపోయింది. ప్రయాణం సాఫీగా జరగడంతో వాహనదారులకు సమయం, ఇంధనం ఆదా అవుతున్నది. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది మేమే, హైటెక్ సిటీ కట్టింది మేమే అని జబ్బలు చరుచుకున్న ఆంధ్రా నాయకులు.. నేడు హైదరాబాద్ అభివృద్ధి చూసి అసూయపడుతున్నారు. సర్వ హంగులతో నిర్మితమైన తెలంగాణ కొత్త సచివాలయం, దాని ఎదుట 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహం హైదరాబాద్ మహానగరానికి తలమానికంగా నిలుస్తున్నది. ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఉన్నది. అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు.. ఆకాశాన్నంటే భవనాల్లో ఐటీ కంపెనీ లు, విదేశాల తరహాలో స్కైవేలు, విస్తరించిన ఔటర్ రింగురోడ్డు.. మొత్తంగా చారిత్రక నగరం హైదరాబాద్ శరవేగంతో అభివృద్ధి చెందుతున్నది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ విస్తరణలో భాగంగా కొత్తగా ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ మెట్రోను విస్తరించ నున్నారు. అతి తక్కువ సమయంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకునేలా మెట్రో ప్రాజెక్ట్‌ను రూపొందిం చ నున్నారు. అలాగే మెట్రో రైలును హయత్‌నగర్ నుంచి పటాన్‌చెరు వరకు పొడిగిస్తారు. రెండో దశ మెట్రో విస్తర ణకు నిధులు అడిగితే కేంద్రం మొండి చేయి చూపింది. సొంత నిధు లతో కేసీఆర్ ప్రభుత్వమే కొత్త పాజెక్టులు చేపడుతుండటం విశేషం.

- మన్నె గోవర్ధన్ రెడ్డి
98660 87878

## న్యూ వరల్డ్ ఆర్డర్ ఆవిష్కృతం!

> స్వప్నసదృశ్యమైన ఈ అద్భుత - అమోఘ, అపురూప 'మాలిక'ను అమెరికా చట్టసభల (కాంగ్రెస్)ను ఉద్దేశించి ఇటీవల మోడీ చేసిన చారిత్రాత్మక ప్రసంగంలో ఆవిష్కరించారు. దాంతో హర్షధ్వానాలు, హర్షాతిరేకాలు వెల్లువెత్తా యి. తెలియని ఓ కాంతిపుంజం విరబూసింది. ఈ భవిష్యత్ చిత్రపటాన్ని కించిత్ గర్వం, కించిత్ ఉద్వేగంతో మోడీ అక్కడ చూపారు. భారత ప్రగతి, ఆర్థిక అభివృద్ధి అమెరికా కు సైతం ఊతమిస్తుందని, అమెరికా ఆవిష్కరణలు సాంకేతిక పరిజ్ఞానం భారత దేశానికి మేలు చేస్తుందని.. దీనివల్ల మొత్తం ప్రపంచం పరిఢవిల్లుతుందని ధైర్యంగా, ధీమాగా మోడీ సభలో పేర్కొన్నారు. ఇదే 'న్యూ వరల్డ్ ఆర్డర్'కు మూలస్తంభం. అందకనుగుణమైన సాంకేతిక బదలాయింపు, వాణిజ్య ఒప్పందాలు, విశ్వా ప్రకటనలు, పెట్టుబడుల హామీలు వెల్లువెత్తాయి.

తొలి పారిశ్రామిక విప్లవానంతరం ప్రపంచంలో ప్రభావశీల దేశాల/శక్తుల క్రమం (వరల్డ్ ఆర్డర్) మారుతూ వస్తోంది. ఆ క్రమంలో తాజాగా 'న్యూ వరల్డ్ ఆర్డర్' ఆవిష్కారమైంది. భారత్ అందులో అగ్రభాగాన ఉండటం ఓ అద్భుతం... అభినందనీయం.

ది ప్రజాస్వామ్య యుగం, ప్రజాస్వామ్యానికి భారతదేశం పుట్టిల్లు. ఆధునిక ప్రజాస్వామ్యానికి చిహ్నం అమెరికా. మొదటిసారిగా ఈ రెండు ప్రముఖ ప్రజాస్వామ్య దేశాల మధ్య స్నేహబంధం, సహకారం, విశ్వాసం, ఆదాన ప్రదానాలు ఎన్నడూ లేనంతగా శిఖరం అంచులను తాకడంతో ఈ 'న్యూ వరల్డ్ ఆర్డర్' రూపుదిద్దుకుంది. ఈ పరిణామం ప్రపంచ ప్రగతికి సరికొత్త ఉషోదయం, మానవాళికి శోభాయమాన కల్యాణం. ఈ మాట ప్రధాని మోడీ నోట వెలువడటంతో దానికి మరింత మాన్యత - సార్థకత సమకూరింది.

స్వప్నసదృశ్యమైన ఈ అద్భుత - అమోఘ, అపురూప 'మాలిక'ను అమెరికా చట్టసభల (కాంగ్రెస్)ను ఉద్దేశించి ఇటీవల మోడీ చేసిన చారిత్రాత్మక ప్రసంగంలో ఆవిష్కరించారు. దాంతో హర్షధ్వానాలు, హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. తెలియని ఓ కాంతిపుంజం విరబూసింది. ఈ భవిష్యత్ చిత్రపటాన్ని కించిత్ గర్వం, కించిత్ ఉద్వేగంతో మోడీ అక్కడ చూపారు. భారత ప్రగతి, ఆర్థిక అభివృద్ధి అమెరికాకు సైతం ఊతమిస్తుందని, అమెరికా ఆవిష్కరణలు సాంకేతిక పరిజ్ఞానం భారత దేశానికి మేలు చేస్తుందని.. దీనివల్ల మొత్తం ప్రపంచం పరిఢవిల్లుతుందని ధైర్యంగా, ధీమాగా మోడీ సభలో పేర్కొన్నారు. ఇదే 'న్యూ వరల్డ్ ఆర్డర్'కు మూలస్తంభం. అందకనుగుణమైన సాంకేతిక బదలాయింపు, వాణిజ్య ఒప్పందాలు, విశ్వా ప్రకటనలు, పెట్టుబడుల హామీలు వెల్లువెత్తాయి.

ఈ ముందుచూపుతోనే భారతదేశం త్వరలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతోంది. ఈ మాట సైతం మోడీ నోట వెలువడింది. ఇప్పుడున్న ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి దేశం మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపుదాల్చడం ఓ అపురూప - అద్భుత పరిణామం. దశాబ్దం క్రితం పదవ ఆర్థిక వ్యవస్థగా, దీనంగా కనిపించిన భారత్ త్వరలో.. అతి త్వరలో అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందడమంటే.. ఇదొక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అంశంగా భావించాలి. ఈ బలం, బలగంతోనే 'గ్రోత్ ఇంజన్ల' నడక సాగనున్నది. ప్రపంచానికి గొప్ప దిశ - దశను అందించే శక్తి సామర్థ్యాలు ప్రధాని మోడీకి ఉన్నాయని అమెరికాతో సహా అనేక దేశాలు దృఢంగా నమ్ముతున్నాయి. ఆ అద్భుతమైన - దివ్యదృష్టిలాంటి దృష్టి కోణంతోనే ఆయన అంతర్జాతీయ ప్రసంగాలు కొనసాగుతున్నాయి. వాటికి ఆయా దేశాల ఆమోదం లభిస్తోంది, ఆదరణ కనిపిస్తోంది. నాయకులే కాదు సాధారణ ప్రజలు సైతం 'ఫిదా' అవుతున్నారు. దేశాలు, ఖండాలు అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల ప్రజల మన్ననలు అందుకోవడం, ఆయన అభిలాషను గౌరవించి ఆమోదించడం ఓ అరుదైన, అద్భుతమైన సందర్భం... సకారాత్మక పరిణామాలకు ప్రేరణ.

భారతదేశాన్ని అమేయం.. అజేయంగా నిలుపుతూనే అనేకానేక సంక్షోభాలతో, ఆర్థిక మాంద్యంతో, ప్రకృతి కన్నెర్రతో కునారిల్లుతున్న అంఖ్యాక దేశాలిప్పుడు ప్రత్యక్షం గానో, పరోక్షంగా నో మోడీ మార్గం అనుసరించడానికి సిద్ధపడుతున్నాయి. తమ దేశాలకు రారమ్మని ఆహ్వానిస్తున్నాయి. ఇది కదా 'న్యూ వరల్డ్ ఆర్డర్'కు చిహ్నం. ప్రతీక.. పతాక.

ఈ నూతన భావనకు - అభిప్రాయానికి అమెరికా అధ్యక్షుడు బైడెన్ సైతం తన ట్వీట్ ద్వారా 'ఆమోదముద్ర' వేశారు. ఇరు దేశాల స్నేహం - సహకారం పర్యవసానంగా ప్రపంచం ప్రయోజనం పొందగలదని ఆ ట్వీట్ సారాంశం.



ఆ ట్వీట్‌తో ఏకీభవిస్తున్నట్లు ఢిల్లీ చేరుకున్నాక మోడీ రీట్వీట్ చేశారు. అమెరికా వైట్‌హౌస్ సైతం అధికారికంగా మోడీ పర్యటన ప్రభావాన్ని ప్రస్తావించింది. మొత్తంమీద న్యూ వరల్డ్ ఆర్డర్ ఆవిర్భవించిందన్న విషయాన్ని అందరూ అంగీకరిస్తున్నారు... ఆహ్వానిస్తున్నారు. ఈ కీలక పరిణామంలో భారత ప్రధాని అత్యంత ముఖ్య భూమికను పోషించడం ముదావహం.

రేపటి ప్రపంచానికి ఇరుసుగా.. సెమీ కండక్టర్ (చిప్‌సెట్) గా పనిచేయనున్నది. అమెరికాకు చెందిన మైక్రాన్ సంస్థతో కుదిరిన తాజా ఒప్పందంతో, గతంలో తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సంస్థతో వేదాంత సంస్థ కుదుర్చుకున్న ఒప్పందంతో.. భారత్ ఇప్పుడు సెమీ కండక్టర్‌ల డిజైన్, తయారీ, ప్యాకేజీకి, ఎకో సిస్టానికి హబ్‌గా మారబోతోంది. అలాగే ప్రపంచం ఇకపై శిలాజ ఇంధనంపైగాక సంప్రదాయేతర ఇంధనంపై ఆధారపడనున్నది. అందులో భాగంగానే పెద్దఎత్తున ఎలక్ట్రిక్ వాహనాల తయారీ అనూహ్యంగా పెరిగింది. ప్రజల ఆదరణ పొందుతోంది. ఎలక్ట్రిక్ కార్లు - వాహనాలు తయారు చేసే 'టెస్లా' త్వరలో భారత్‌లో తన ప్లాంట్‌ను ప్రారంభించనున్నదని అధికారికంగా సమాచారం వెలువడింది. అంతేగాక స్మార్ట్‌ఫోన్ల తయారీ, ముఖ్యంగా ఈ రంగంలో అగ్రగామిగా ఉన్న ఆపిల్ ఫోన్ల తయారీ - పంపిణీ, పరిశోధన కేంద్రాలు భారత్‌లో రాబోతున్నాయంటే ఏమిటి అర్థం?... ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు ఇది సకారాత్మక సంకేతంగానే చెప్పుకోవాలి. ఈ బ్యాటరీలకు అవసరమైన లిథియం, కోబాల్ట్ గనులు జమ్ము, మరికొన్ని చోట్ల బయల్పడటంతో ద్విగుణీకృత ఉత్సాహంతో ఈ పరిశ్రమ వర్గాలున్నాయి.

క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ), టెలికామ్ రంగాలతోపాటు ప్రతిష్ఠాత్మక జనరల్ ఎలక్ట్రికల్స్ సంస్థ మన హెచ్‌ఏఎల్‌తో యుద్ధ విమానాల ఇంజిన్ల తయారీకి, దాని టెక్నాలజీ బదలాయింపునకు ఒప్పందం కుదుర్చుకోవడంతో మన పొరుగు దేశాలైన పాక్ - చైనా గుండెల్లో అప్పుడే రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుతో ఇక ఆ దేశాల వెన్నులో యుద్ధం వణుకు మొదలయిందన్నా పొరపాటు కాదు.

ఇదిలా ఉంటే అమెజాన్, గూగుల్, మరికొన్ని అంతర్జాతీయ సంస్థలు మరిన్ని భారీ పెట్టుబడులు భారత్‌లో పెట్టనున్నట్లు చేసిన ప్రకటనలతో నిజంగానే 'వరల్డ్ ఆర్డర్' మారుతున్న దృశ్యం కళ్లకు కడుతోంది. ఏఐలో 60వేల మంది భారతీయ యువ ఇంజినీర్లకు అడ్వాన్స్‌డ్ శిక్షణ ఇచ్చేందుకు సైతం అంగీకారం కుదిరింది. వేల సంఖ్యలో కొత్తగా ప్రత్యక్ష-పరోక్ష ఉద్యోగాలు యువతకు అందబోతున్నాయి. స్టార్టప్‌ల సందడి పెరగనున్నది. ఇదో సంపూర్ణ విప్లవానికి మార్గమేయడమే. దీనికంతటికి రూపశిల్పిగా నిలిచిన, ప్రధాని మోడీని ఈజిప్టు ప్రభుత్వం తమ దేశపు అత్యున్నత 'నైల్ పురస్కారం'తో సత్కరించడం కొసమెరుపు. ఆరు ముస్లిం దేశాలు మోడీని అత్యున్నత అవార్డులతో ఆదరించడం అపురూపం.. అద్భుతం.

- వుప్పల నరసింహం
సీనియర్ జర్నలిస్టు
99857 81799

## నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో వివక్ష

భారత పార్లమెంట్ 2014 జూన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను విభజించి నూతన రాష్ట్రంగా ఏర్పాటు చేసింది. దీనితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విభజించబడింది. 2022 జూన్ నాటికి రెండు రాష్ట్రాలు విడిపోయి దాదాపు 8 సంవత్సరాలు కావస్తున్నా నేటికి విభజన చట్టంలో పేర్కొన్న అనేక అంశాలను కేంద్రం పట్టించుకోవడం లేదు. కేంద్రం పట్టించుకోని అంశాలలో నియోజక వర్గాల పునర్ వ్యవస్థీకరణ ఒకటి. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్తీకరణ చట్టం 2014లోని సెక్షన్ 17 ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 294 ఎమ్మెల్యే స్థానాలను విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు 175 స్థానాలను తెలంగాణకు 119 స్థానాలను కేటాయించారు. అలాగే సెక్షన్ 26 ప్రకారం ప్రస్తుతం



ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలను 225కు, తెలంగాణలో ఉన్న 119 ఎమ్మెల్యే స్థానాలను 153కి పెంచాలని పేర్కొన్నారు. అయితే అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ 2026 వరకు కుదరదని, ఒకవేళ తెలుగు రాష్ట్రాల శాసనసభ స్థానాలను పెంచాలంటే రాజ్యాంగ సవరణ చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోంది.

భారత పార్లమెంట్ 2019 ఆగస్ట్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ని రద్దు చేసి జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జమ్మూ-కాశ్మీర్‌ని అసెంబ్లీతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా, లడక్‌ను అసెంబ్లీ లేని కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేసింది. లడ్డక్ పాలనను కేంద్రమే చూసుకుంటుంది. అయితే జమ్మూ కాశ్మీర్‌లో నియోజక వర్గాల పునర్ విభజన కోసం 2020 మార్చిలో సుప్రీంకోర్ట్ రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ రంజన్ ప్రకాష్ దేశాయ్ అధ్యక్షతన త్రిసభ్య డీలిమిటేషన్ కమిషన్‌ని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ తన నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి ఇచ్చింది. ప్రస్తుతం జమ్మూ కాశ్మీర్‌లో 83 శాసనసభ స్థానాలు ఉన్నాయి. వీటిని 90కి పెంచాలని ఈ కమిషన్ పేర్కొంది. ఇప్పటి వరకు కాశ్మీర్ డివిజన్‌లో 46 స్థానాలు, జమ్మూ డివిజన్‌లో 37 స్థానాలు ఉండేవి. కొత్త ప్రతిపాదన ప్రకారం కాశ్మీర్ డివిజ న్‌లో 47 స్థానాలు, జమ్మూ డివిజన్‌లో 43 స్థానాలు వస్తాయి. మొత్తం 7 స్థానాల పెరు గుదలను ఈ కమిషన్ చూసించింది. వీటితో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 23 రిజర్వ్ స్థానాలు ఉన్నాయి. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ కోసం పెరిగే పార్లమెంట్ సభ్యుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని తాజా నూతన పార్లమెంట్ భవనాన్ని కూడా సిద్ధం చేశారు. 2014లో విభజించిన తెలుగు రాష్ట్రాలలో నియోజకవర్గాలను పునర్ వ్యవస్తీక రణ చెయ్యమంటే 2026 వరకు పెంచకూడదు అని కుంటి సాకులు చెప్పే కేంద్రం 2019లో విభజించిన జమ్మూ కాశ్మీర్ విషయంలో మాత్రం వేరేగా వ్యవహరిస్తోంది. అక్కడి ప్రజలు అడక్కపోయిన నియోజక వర్గాలను పునర్ వ్యవస్థీకరిస్తోంది. అలాగే కొన్ని లక్షల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను జమ్మూ కాశ్మీర్‌లో ప్రారంభించింది. తెలుగు రాష్ట్రాలకు హక్కుగా రావలసిన వాటిని కేంద్రం కాలరాస్తోంది.

- కోనేటి నరేష్
84998 47863

## ఓర్వకల్లులో సూక్ష్మ శిలాయుగపు చిత్ర లేఖనాలు

కృష్ణా తీరంలో విలసిల్లిన అతి విశిష్ట ప్రాచీన దేవాలయాలను గుర్తించి, వాటి చారిత్రక ప్రాముఖ్యతను వెలికి తీసే శాస్త్రీయ అన్వేషణ ఫలించింది. ఓర్వకల్లు గ్రామంలోని పెద్ద పర్వత సానువులవద్ద సహజసిద్ధంగా ఏర్పడిన సూక్ష్మ శిలాయుగం నాటి రాతి గుహల వాసాలు, వాటి లోపల గోడలపై ఆదిమానవుడు గీసిన చిత్రలేఖనాలు అబ్బురపరిచాయి. క్రీస్తు పూర్వం 5,000 సంవత్సరాల క్రితం వారు తమ కళాకౌశలంతో గీసిన అత్యంత మనోహర మైన వర్ణ చిత్రాలను కేంద్ర పురావస్తు శాఖ విశ్రాంతి అధికారిగా నేను అన్వేషించినపుడు ప్రత్యక్షమయ్యాయి. ఈ వర్ణ చిత్రాల్లో కొన్ని శిలాయుగపు ఆదిమానవుని జీవన యానంలో అబ్బుర పర్చే ఘటనలకు సంబంధించి ఇంతవరకూ వెలుగు చూడని అమూల్యమైన చారిత్రక ఆధారాలను వెలికి తీశాం. ఓర్వకల్లులోని పర్వత గుహలను శిలాయుగం నాటి మానవుడు తనకు ఆవాసాలుగా చేసుకున్నాడు. కాలక్రమంలో తాను నివసించిన ఆరుబయలు గుహలతో పది గోడలు, పైకప్పుల మీద అద్భుతమైన రీతిలో జేగురు - ఎరుపు,తెలుపు రంగులతో సుందరమైన బొమ్మలను చిత్రీకరించారు. తరతరాలుగా ఇవి ఎండలకు, వానలకు గురి కావడం వల్ల వీటిలో కొన్ని తమ సహజ సౌందర్యాన్ని కోల్పోయాయి. అయినా కొన్ని చెక్కుచెదరక నిలిచి ఉన్నాయి. ఓర్వకల్లు పర్వత గుహల్లో క్రీస్తు పూర్వం సుమారు ఐదువేల సంవత్సరాల క్రిందట ఆది మానవుడు గీసిన బొమ్మలు నాటి జీవన శైలికి ప్రతిబింబాలు. మొదటి చిత్రంలో నాటి మానవుడు ఎత్తయిన కొమ్ములు కలిగిన బలిష్టమైన గొర్రె, పొట్టేలును తన ఎడమ చేతితో బంధించి వశపర్చుకోవడం కన్పిస్తుంది.



రెండవ సన్నివేశం దంపతులు ఇద్దరు నిలబడి చేతులు పైకెత్తి ఎదుట నిలబడి ఉన్న పది చేతులు కలిగిన ఒక పురుషుని ఆహ్వానిస్తున్నట్టు కనిపిస్తోంది. బహుశా అతడు దేవ పురుషుడు అయి ఉండవచ్చు. ఈ మనోహర దృశ్యాలకింద భాగాన పులి, గుర్రము, మొదలైన జంతువుల ఆకృతులు జీవం ఉట్టిపడుతూ ఉన్నాయి. గంభీరమైన ఈ రాతి గుహలను పరిశీలించే క్రమంలో ఇంతవరకూ వెలుగు చూడని, బయటపడని అత్యంత అరుదైన హాలికుని చిత్రాన్ని కనుగొన్నాను. ఈ కమనీయ సన్నివేశంలో నాటి మానవుడు ఆరు కర్రలు కలిగిన పొడవైన నాగలితో భూమిని దున్నతున్న తొట్ట తొలి వ్యవసాయదారుని ఆకృతిని శిలాయుగపు చిత్రకారుడు రమ్యంగా చిత్రీకరించాడు. కెయోలిన్ అనే తెలుపు రంగు, బొమ్మకు అద్దడం ద్వారా ఆ కర్షకకుడు భూమిని దున్నే ప్రక్రియను, అతని శరీర సౌష్టవములను మరింత ప్రస్ఫుటముగా విన్యాస పరిచాడు. ఆ చిత్రకారుని చొరవ, దీక్ష వల్లనే ఇంతటి చారిత్రక ఆధారం భావితరాల మానవజాతికి బహుమానంగా దొరికింది. కళా పిపాసకులకు సూక్ష్మ శిలాయుగపు చిత్రకారులకు మనమెంతో రుణపడి ఉన్నాం. వారు సృష్టించిన కళాకృతులను కాపాడుకోవడమే మన ముందున్న భవ్య కర్తవ్యం.

- దిట్టకవి కన్నబాబు
94402 20763

## రవాణా వ్యవస్థల అనుసంధానంతో ప్రగతి పరుగులు



> దేశంలోనే తొలి "జల మెట్రో" మార్గం ప్రారంభించబడ టంతో పాటు బ్యాటరీతో పాటు ఇందనంతో నడిచే హైబ్రిడ్ పడవల ద్వారా దేవతలా స్వర్గంగా ప్రసిద్ధి చెందిన కేరళలోని కోచ్చికి చుట్టూగల 10 ద్వీపాలను అనుసంధానిస్తూ తొలి ప్రాజెక్టు ప్రారంభం అయింది కూడా. అలాగే ప్రపంచంలోనే అతి పొడవైన 3,200 కి.మీ దూరం వెళ్లే గంగా బ్రహ్మపుత్ర నదీ మార్గంలో ప్రయాణికుల నౌక పవిత్ర పుణ్యక్షేత్రం వారణాశి - దిబ్రూగడ్‌ల మధ్య బంగ్లాదేశ్ మీదుగా ప్రయాణించే అద్భుత జల రవాణాని ప్రవేశపెట్టటం గొప్ప విషయం.

ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం గడచిన తొమ్మిదేళ్లలో రవాణా వ్యవస్థ అనుసంధానం, విస్తరణ వేగవంతం చేసింది. రవాణా వ్యవస్థలను మెరుగు పరచటం, ఆధునీకరించడం, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోం 2023-2024 ఆర్థిక సంవత్సరానికి 10 లక్షల కోట్ల రూపాయలు కేటాయించిందంటే ప్రభుత్వ సంకల్పం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. వీటిలో రవాణా సదుపాయాలకు 5.17 లక్షల కోట్లు, జాతీయ రహదారులకు లక్షా 62 వేల కోట్లు కేటాయించారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రహదారుల నెట్‌వర్క్ భారత్ సొంతం. దాదాపు 63 లక్షల 73 వేల కిలోమీటర్ల రహదారులు కలిగిన దేశంగా భారత్ రికార్డు కెక్కింది. ''భారత్ మాల'' ప్రాజెక్టు క్రింద దేశరాజధాని ఢిల్లీ - ముంబైల మధ్య దేశంలోనే అత్యంత పొడవైన 1386 కి.మీ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో ఉంది. దీనిలో భాగమైన ఢిల్లీ-దౌసా-లాల్సోట్ విభాగం పనులు పూర్తవడంతో ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల జాతికి అంకితం చేశారు.

కేంద్రం ప్రభుత్వ లక్ష్యం పరిశీలిస్తే అత్యాధునిక రహదారులు, ఆధునిక రైల్వే స్టేషన్లు, మెట్రో, జల రవాణా, 2021 లో ''ప్రధాన మంత్రి గతిశక్తి'' పథకాన్ని ప్రారంభించి బహుళ ప్రయాణ సాధనాల ద్వారా రవాణా మార్గాలు సంధానం చెయ్యటం ద్వారా రవాణారంగ సామర్థ్యం మెరుగుపర్చాలని నిర్ణయించింది. రోడ్డు, రైలు, జల, వాయు మార్గాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలతో ప్రధాన రహదారులు అనుసంధానించడం ద్వారా వేగంగా రాకపోకలకు, రవాణా జరగాలన్నది లక్ష్యం.

2017లో ప్రారంభించిన ప్రాంతీయ అనుసంధాన పథకంలో భాగంగా 74 విమానాశ్రాయాలను అనుసంధానిస్తూ 469 విమాన మార్గాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫలితంగా ఇప్పటివరకు లక్షలాది సామాన్యులు చౌకగా విమానంలో ప్రయాణం చేయగలిగే అవకాశం కల్గినట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి.

ఇక ప్రపంచంలోనే అమెరికా, రష్యా, చైనాల తరువాత నాల్గవ అతిపెద్ద రైల్వే వ్యవస్థ కలిగిన భారతీయ రైల్వేలు లక్షా 26 వేల 366 కి.మీ పొడవుతో వున్నది. 2014 వరకు అనుసంధానతపై నిర్లక్ష్యం ఫలితంగా ఎనిమిది ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధిలో వెనకబడి వున్నాయి. తొమ్మిదేళ్ళల్లో ఈ ప్రాంతాలు అభివృద్ధికి ఇప్పటికే 7ఈశాన్య రాష్ట్రాల రాజధాని పట్టణాలకు రైలు మార్గం అనుసంధానించారు. ఇక సిక్కింలోనీ శివోక్- రంగ్పోల మధ్య 45 కి.మి రైల్వే మార్గం పనులు పూర్తి కావచ్చాయి. అలాగే రైల్వే విద్యుద్దీకరణ 2014 ముందు కేవలం ఈ రాష్ట్రాల్లో 600 కి.మీ ఉండగా కేంద్ర ప్రభుత్వ చొరవతో ఇప్పటివరకు 6000 కి.మీ వరకు విద్యుద్దీకరణ పూర్తి అయ్యాయి. ఇంకా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇక జల మార్గాలు కూడా జాతీయ స్థాయిలో 100 వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఇప్పటికే గంగా- బ్రహ్మపుత్ర నదుల అనుసంధానం, జలమార్గం పనులుకూడా పూర్తి అయ్యింది.

దేశంలోనే తొలి ''జల మెట్రో'' మార్గం ప్రారంభించబడటంతో పాటు బ్యాటరీతో పాటు ఇందనంతో నడిచే హైబ్రిడ్ పడవల ద్వారా దేవతలా స్వర్గంగా ప్రసిద్ధి చెందిన కేరళలోని కోచ్చికి చుట్టూగల 10 ద్వీపాలను అనుసంధానిస్తూ తొలి ప్రాజెక్టు ప్రారంభం అయింది కూడా. అలాగే ప్రపంచంలోనే అతి పొడవైన 3,200 కి.మీ దూరం వెళ్లే గంగా బ్రహ్మపుత్ర నదీ మార్గంలో ప్రయాణికుల నౌక పవిత్ర పుణ్యక్షేత్రం వారణాశి - దిబ్రూగడ్‌ల మధ్య బంగ్లాదేశ్ మీదుగా ప్రయాణించే అద్భుత జల రవాణాని ప్రవేశపెట్టటం గొప్ప విషయం. ఇక మెట్రో రైల్వే వ్యవస్థని దేశంలో తొలిసారిగా 1984లో కలకత్తా మహానగరంలో మొదలుపెట్టారు. అయితే వివిధ ప్రాంతాల్లో మెట్రో రైలు మార్గాలు 2014 నాటికి కేవలం దేశంలోని వివిధ నగరాల్లో 248 కి. మీ మాత్రమే కాగానే గడచిన తొమ్మిదేళ్లలో అంటే 2023 నాటికి 815 కి.మీకి విస్తరించటం జరిగింది. దీనితో పాటు మరో వెయ్యి కి.మీ విస్తీర్ణంలో లైట్ మెట్రో, నానో మెట్రో రైలు మార్గం పనులు శరవేగంగా జరుగుతున్నాయి కూడా.

వెరసి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం రవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక శక్తిగా రూపొందించే దిశలో కేంద్రప్రభుత్వం కృత నిర్ణయంతో ఉంది.

- చలాది పూర్ణచంద్ర రావు
94915 45699

# అమ్మగా.. వ్యాపారవేత్తగా...



**ఎంత పని చేస్తున్నా తరగదు. పిల్లలతో ఎంత గడిపినా తనివి తీరదు. అమ్మగా ఇంత బిజీగా ఉంటూనే అనేక రకాల ఉద్యోగాలు చేస్తూ విజయవంతమవుతున్నారు నేటి మహిళలు. అలాగే మరికొంతమంది వ్యాపారవేత్తలుగానూ రాణిస్తున్నారు. తాము పాటిస్తున్న కొన్ని సింపుల్ చిట్కాలే తమ విజయానికి కారణమంటున్నారు వీరు. అవే ఇంటినీ, వృత్తిని బ్యాలన్స్ చేసుకోవడానికి, తమకంటూ కాస్త సమయం కేటాయించుకోవడానికి దోహద పడుతున్నాయంటున్నారు. ఇంతకీ ఆ చిట్కాలేంటో మనమూ తెలుసుకుందాం...**

సాధారణంగా మహిళలు ఇంటి పనులు, పిల్లల బాధ్యతల్లో పడిపోయి తమను తాము నిర్లక్ష్యం చేస్తుంటారు. నిజానికి ఈ అశ్రద్ధే మానసిక ఒత్తిడికి కారణం. ఫలితంగా కెరీర్‌పై పూర్తి దృష్టి పెట్టలేక పోతున్నారని అంటున్నారు నిపుణులు. అందుకే రోజును ప్రారంభించే ముందే తమకు తాము కొంత సమయం కేటాయించుకోవాలంటున్నారు. అంటే తమ అభిరుచులపై దృష్టి పెట్టడం, మనసుకు నచ్చిన పనిచేయడంతో ప్రశాంతతను సొంతం చేసుకోవచ్చు. దాంతో శరీరంలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతుంది. ఇదే రోజంతా యాక్టివ్‌గా పనిచేసే శక్తినిస్తుంది. ఇలా సానుకూల దృక్పథంతో రోజు ప్రారంభిస్తే వ్యాపారంలో మనం తీసుకునే నిర్ణయాలూ పాజిటివ్‌గా ఉంటాయని, ఇవే మన ఉత్పాదకతను మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు.

### ప్రాధాన్యతలను బట్టి...

వ్యక్తిగతంగానైనా, కెరీర్ పరంగానైనా.. చేసే ప్రతి పని పర్‌ఫెక్ట్‌గా ఉండాలనుకుంటారు చాలామంది. ఉన్న సమయంలోనే అన్ని పనులు పూర్తి చేయాలనుకుంటారు. అయితే ఈ పర్‌ఫెక్షనిజం అన్ని సందర్భాల్లోనూ మేలు చేయకపోవచ్చు. ఎందుకంటే ఇంటి పనులు, పిల్లలు, వ్యాపార బాధ్యతలు పోను.. మనకు మిగిలేది అతి కొద్ది సమయం. ఆ సమయంలోనే మిగతా పనులు పెట్టుకొని ఒత్తిడికి గురయ్యే బదులు.. ప్రాధాన్యతల్ని బట్టి పనుల్ని విభజించుకుంటే మంచిది. అవసరమైన పనుల్నే ముందుగా పూర్తి చేసేయచ్చు.. మిగతావి తర్వాత వీలు చూసుకొని పూర్తిచేసుకోవచ్చు. ఇంటి పనులు, పిల్లల విషయాల్లోనే కాదు.. వ్యాపార నిర్వహణకూ ఇది వర్తిస్తుంది. అలాగే ఇంటి పనుల్లో కుటుంబ సభ్యులు, పిల్లల సహాయం తీసుకోవడం చాలా మంచిది. దీనివల్ల ఒత్తిడీ ఉండదు, పనులూ త్వరగా పూర్తవుతాయి.



### పని వేళలు నిర్దేశించుకోవాలి

వ్యాపార నిర్వహణలో ఓ నిర్ణీత పని వేళలంటూ ఉండవు. చాలాసార్లు పని రాక్షసుల్లా ఆఫీసుకే పరిమితవ్వాల్సి రావచ్చు. ఇలా అపరిమిత పనుల వల్ల మానసిక ఒత్తిడికి గురవడమే కాదు.. పనిలో నాణ్యత కూడా కొరవడుతుంది. అందుకే ఉద్యోగంలాగే వ్యాపారానికీ కచ్చితమైన పనివేళల్ని నిర్దేశించుకోవాలంటున్నారు నిపుణులు. అలాగే పనుల ప్రాధాన్యతల్ని బట్టి ఆ రోజు పూర్తి చేయాల్సిన పనులు, మీటింగ్స్, ఇతర పనుల కోసం ఓ ప్రణాళిక వేసుకుంటే.. మధ్యమధ్యలో తడబడాల్సిన అవసరం ఉండదు. అలాగే ఈ సమయంలోనే మనం అనుకున్న లక్ష్యాల్ని పూర్తి చేయగలిగితే సమయం ఆదా అవుతుంది. తద్వారా మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉత్సాహం.

### ఏకకాలంలో వివిధ పనులా...

కొంతమంది ఇంటి నుంచే వ్యాపారాన్ని నిర్వహిస్తుం టారు. ఇటు ఇంటి పనులు, అటు పిల్లల బాధ్యతను చూసుకుంటూనే మరోవైపు బిజినెస్‌పై దృష్టి పెడుతుంటారు. ఈ మల్టీ టాస్కింగే వద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే దీనివల్ల పనిలో ఉత్పాదకత 40 శాతానికి పైగా తగ్గచ్చని ఓ అధ్యయనం రుజువు చేసింది. ఏకకాలంలో వివిధ రకాల పనులు చేయడం వల్ల ఏ పని పైనా పూర్తి దృష్టి పెట్టలేకపోవడమే ఇందుకు కారణం అంటోంది. కాబట్టి వ్యాపారం, ఇంటి పనులు, పిల్లల బాధ్యతలు.. ఇలా దేనికోసం నిర్దేశించుకున్న సమయంలో ఆ పని పైనే దృష్టి పెట్టాలి. అప్పుడే ఆ పనిలో సక్సెస్ కాగలుగుతాం.



### కుటుంబంతో సరదాగా...

ఇంటి బాధ్యతలు, వ్యాపార నిర్వహణ.. ఈ రెండింటినీ బ్యాలన్స్ చేసుకోవాలంటే ముందు మనకు మనం సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఇందుకోసం రోజూ కాసేపు పనులన్నీ పక్కన పెట్టి కుటుంబంతో తగిన సమయం గడపాలంటున్నారు నిపుణులు. మీ కెరీర్ పనులు, పిల్లల స్కూల్ దృష్ట్యా.. మూడు పూటలా అందరూ కలిసి తినే అవకాశం ఉండకపోవచ్చు.. కానీ ఏదో ఒక పూట.. మీ పిల్లలతో పాటు తినే వెసులుబాటు చేసుకోవడం ముఖ్యం. అలాగే అప్పుడప్పుడూ వెకేషన్లకూ ప్లాన్ చేసుకోవాలి. ఇలా కుటుంబంతో సమయం గడుపు తున్నప్పుడు సోషల్ మీడియా, మొబైల్ వంటి వాటిని పూర్తిగా పక్కన పెట్టేయాలి. అప్పుడే మీరు మీ పిల్లల్ని, మీ పిల్లలు మిమ్మల్ని మిస్సవకుండా జాగ్రత్తపడచ్చు. తద్వారా మీ అనుబంధమూ పెరుగుతుంది. ఇలా కుటుంబం నుంచి దక్కిన ప్రేమ.. వ్యాపారాభివృద్ధి లోనూ కీలకపాత్ర పోషి స్తుంది. పనిలో ఉత్పాదకతను సైతం పెంచుతుంది.

❄❄

# కలుపు మొక్కల నివారణకు...

**గార్డెనింగ్ అంటే చాలా మందికి ఇష్టం. ఈ పెంపకంలో ఇబ్బంది పెట్టేవి కలుపు మొక్కలు.. మొక్కలు బాగా పెరగాలంటే వీటిని తీసేయాలి. వీటిని ఎప్పటికప్పుడు తీసెయ్యకపోతే అసలు మొక్కలు త్వరగా పెరగవు. ఆకుకూరల మడి, పూలమొక్కల పక్కన, కుండీల్లో, లాన్‌లో... కలుపు మొక్క కనపడని, పెరగని ప్రదేశం లేదు. మనం ఇష్టపడి పెంచుకుంటున్న మొక్కల కంటే ఇవి చాలా త్వరగా పెరుగుతాయి. దాంతో.. మట్టిలోని న్యూట్రియెంట్స్, నీరూ, సూర్యరశ్మి... అన్నీ ఇవే లాగేసుకుంటాయి. వాటిని గుర్తించి తొలగించడం తప్పనిసరి.. అందుకు చేయాల్సిందేంటంటే...**

మామూలు మొక్కలు, కలుపు మొక్కలకీ తేడా చెప్పడం చాలా కష్టం. ఇవి రెండూ చూడడానికి ఒకేలా ఉంటాయి. ఇవి ఎలాంటి పరిస్థితుల్లో అయినా బతకగలవు. మామూలు మొక్కల కంటే త్వరగా పెరుగుతాయి. విత్తనాలు ఎక్కువగా ఉంటాయి. కొన్ని కలుపు మొక్కలకి ముళ్ళూ, చిన్న రెక్కలూ వంటివి ఉంటాయి.

### నష్టాలు..

నేల నుండి మామూలు మొక్కలకి కావాల్సినవన్నీ ఖనిజాలు కలుపు మొక్కలు ముందే అందుకుంటాయి. మామూలు మొక్కల్ని పెరగనివ్వకుండా ఇవి వాటికి అడ్డంగా పెరుగుతాయి. కొన్ని మొక్కల్ని తింటాయి కూడా. ఇవి రకరకాల కీటకాలకి ఆధారమౌతాయి. సరైన గాలి తగలకుండా అడ్డుకుంటాయి. మొక్కలకి నీటి సరఫరా సరిగ్గా సాగకుండా చేస్తాయి.

### తీసేయడమెలా...?

రోజూ తోట అంతా తిరుగుతూ, జాగ్రత్తగా గమనిస్తూ కలుపు మొక్కల్ని చేత్తో తీసి పారేయడం మంచిది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా కలుపు మొక్కలు పెరిగిపోతాయి. వీటి కోసం కొన్ని రకాల మందులు వాడొచ్చు. కానీ వాటిల్లో ఉండే కెమికల్స్ వల్ల మనం ఇష్టంగా పెంచుకుంటున్న మొక్కలకి కూడా హాని కలుగుతుంది. భూసారం కూడా తగ్గుతుంది. వాటి బదులు ఇంట్లోనే తయారు చేసుకోగలిగే ద్రావణంతో కలుపు మొక్కల బెడదని తేలిగ్గా వదిలించుకోవచ్చు.

### ద్రావణం తయారీ...

మూడు రకాలుగా ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు.

- ఒక పెద్ద బకెట్‌లో ఒక గాలన్ వైట్ వెనిగర్ వేసి, అందులో రెండు టేబుల్ స్పూన్ల లిక్విడ్ డిష్ సోప్ కలపాలి. ఇందులో ఒక కప్పు ఎప్సమ్ సాల్ట్ కూడా కలపాలి. ఈ మూడింటిని బాగా కలిపి జాగ్రత్తగా గరాటుతో ఒక స్ప్రే బాటిల్‌లోకి తీసుకోవాలి.
- ఒక పెద్ద బౌల్‌లో అర కప్పు రాళ్ళ ఉప్పు వేసి, కప్పు గోరువెచ్చని నీటిని పోయాలి. ఉప్పు కరిగే వరకూ కలిపి గరాటు ద్వారా స్ప్రే బాటిల్‌లోకి తీసుకుని ఉపయోగించవచ్చు.
- ఒక స్ప్రే బాటిల్‌లో ఒక కప్పు నీటిని తీసుకోని అందులో ఒకటిన్నర టేబుల్ స్పూన్‌ల లిక్విడ్ డిష్ సోప్ కలపాలి. అందులోనే అర చెక్క నిమ్మ రసం పిండి, బాటిల్‌కి మూత పెట్టేసి బాగా కదిపితే లోపల ఉన్నవన్నీ బాగా కలుస్తాయి.



### ఉపయోగించడమెలా..?

ఈ మిశ్రమాలను బాగా ఎండగా ఉన్న రోజుల్లోనే వాడాలి. మబ్బు పట్టి ఉన్నా, వాన వచ్చేట్లున్నా వాడకపోవడమే మంచిది. ఇవి చల్లాక కూడా కనీసం రెండు రోజుల పాటు వాన లేకుండా ఉంటే బాగా పనిచేస్తాయి. ఈ ద్రావణాన్ని కలుపు మొక్కల ఆకుల మీదా, కొమ్మల మీదా మాత్రమే పిచికారీ చేయాలి. మంచి మొక్కల మీద కానీ, మట్టి మీద కానీ ఈ ద్రావణం పడకూడదు. ఇది పిచికారీ చేసిన తర్వాత ఒక వారంలో మొత్తం కలుపు మొక్కలన్నీ పోతాయి. ఇంకా ఏవైనా ఒకటీ రెండూ ఉంటే మళ్ళీ ఇంకొకసారి స్ప్రే చేయాలి. కలుపు మొక్క ఎండిపోయి వేరు కనబడుతుంటే వేరు మీద కూడా స్ప్రే చేయండి. లేదంటే అందులోంచి మళ్ళీ మొక్క వచ్చే అవకాశముంది. మిగిలిన ద్రావణాన్ని ఎండ తగలని చల్లని ప్రదేశంలో ఉంచి మళ్ళీ వాడుకోవచ్చు.

---

## ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాల్సిందే



(మొదటిపేజి తరువాయి)

చేశారు. ప్రతి ఒక్కరికీ 125 గజాల స్థలం పట్టా ఇవ్వాలని కోరారు. ఇల్లు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. గతంలో పట్టా పొందిన పేదవాళ్లకు ఇండ్ల జాగా సరిహద్దులను నిర్ణయించి భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.జంగారెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన పేద ప్రజలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో పరిగి నియోజకవర్గంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదని అన్నారు. పరిగి మండలం రంగాపూర్ గ్రామంలో సర్వేనెంబర్ 18లో తొమ్మిది ఎకరాల 39 గుంటల ప్రభుత్వ భూమిలో పేదలకు 125 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. పరిగి పట్టణంలో నిర్మించిన 180 డబుల్ బెడ్రూం ఇండ్లను వెంటనే పంపిణీ చేయకపోతే, ప్రజా సంఘాలు పంపిణీ చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు మల్లు లక్ష్మి, స్కైలాబ్‌బాబు, ఆశయ్య, జగదీష్, కోట రమేష్, యాత్ర కన్వీనర్ ఎ. వెంకటేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.మైపాల్, రామకృష్ణ, బుస చంద్రయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, శ్రీను, ఎండీ హబీబ్, సత్యయ్య, లక్ష్మి, అనంతమ్మ, సునీత, యాదయ్య, శేఖర్, శీను పాల్గొన్నారు. బస్సు యాత్ర పరిగి నుంచి మహబూబ్‌నగర్ పట్టణం మీదుగా అమరచింతకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర నిర్వహించిన బహిరంగ సభలో తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా పేదలు సొంత ఇల్లు లేక ఇరుకు గదుల్లో.. అద్దె ఇండ్లల్లో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారు ఇల్లు కట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న మూడు లక్షల సహాయాన్ని ఐదు లక్షలకు పెంచి పేదలందరికీ ఇవ్వాలని కోరారు.

## దేశ్‌కీ నేత కేసీఆర్..

(మొదటిపేజి తరువాయి)

అక్కడికి వెళ్లిన ఆయన వెంట రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు కూడా ఉన్నారు. 600 వాహనాలతో కూడిన కాన్వాయ్ (దాదాపు ఆరు కిలోమీటర్ల పొడవు) కేసీఆర్ వెంట ముంబయి రహదారి మీదుగా కొనసాగింది. మహారాష్ట్రలోని ధారాశివ్‌కు చేరుకున్న సీఎంకు స్థానిక నాయకులు, మహిళలు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'దేశ్ కీ నేత కేసీఆర్' 'దేశ్ కీ నేత కైసే హో-కేసీఆర్ జై సా హో' అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సంబంధిత ఫ్లెక్సీలను వారు ప్రదర్శించారు. అనంతరం అక్కడే మధ్యాహ్న భోజనం చేసిన కేసీఆర్... అక్కడి నుంచి జోరు వానలో సోలాపూర్‌కు చేరుకున్నారు. అక్కడి బీఆర్ఎస్ శ్రేణులు సైతం ఆయనకు ఘన స్వాగతం పలికాయి. స్థానిక సీనియర్ నేత, మాజీ ఎంపీ ధర్మన్న ముండయ్య సాదుల్ ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి కేసీఆర్ వెళ్లారు. సమకాలీన రాజకీయ పరిస్థితులపై వారిరువురూ చర్చించారు. ఆ ప్రాంతంలో స్థిరపడిన తెలంగాణ వాసులను సీఎం పలుకరించారు. అక్కడ ఎక్కువ సంఖ్యలో ఉన్న పద్మశాలీల బాగోగుల గురించి ఆయన వాకబు చేశారు. మరోవైపు సీఎం కేసీఆర్ సోమవారం రాత్రి సోలాపూర్‌లోనే బస చేయనున్నారు. మంగళవారం ఆయన పండరీపురంలోని విట్టల్ రుక్మిణీ దేవస్థానాన్ని సందర్శిస్తారు. అక్కడ పూజాధికాల అనంతరం సర్కోలిలో నిర్వహించే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి తుల్జా భవాని అమ్మవారి దేవస్థానానికి చేరుకుని పూజలు నిర్వహిస్తారు. అనంతరం నేరుగా హైదరాబాద్‌కు బయలుదేరుతారని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

## పాఠ్యపుస్తకాలు, టీచర్లు లేకుండా పాఠాలు ఎలా చదవాలి?

(మొదటిపేజి తరువాయి)

టి.నాగరాజు అన్నారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ల ముట్టడి చేపట్టారు. విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు లోపలికెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల తీవ్ర తోపులాట జరిగింది.

హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు మమత, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, రాష్ట్ర కమిటీ సభ్యులు రమ్య, ఇతర నాయకులను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ఆర్.ఎల్ మూర్తితోపాటు మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాథోడ్ సంతోష్, బి.వెంకటేష్, నాయకులను అరెస్టు చేసి శామీర్‌పేట పీఎస్‌కు తరలించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్ మూర్తి, టి.నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని ప్రకటించినా ఇప్పటికీ రాలేదన్నారు. ఇంటర్ కళాశాలలు, కేజీబీవీలు, గురుకులాలకు ఒక్క పుస్తకమూ పంపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాలు లేకుండా పేద పిల్లలు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. 24వేల టీచర్ పోస్టులు, 12వేల లెక్చరర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు.



ఇంజినీరింగ్, మెడికల్ సీట్లకు ఫీజుల రెగ్యులేషన్ ఉందని, పాఠశాల, ఇంటర్ కళాశాలల ఫీజులు నియంత్రణ లేదన్నారు. ఫీజు నియంత్రణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.5,177 కోట్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని, ఐదేండ్ల (2019-2023) ఫీజులు విడుదల చేయకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారన్నారు. బీసీ వసతి గృహాలకు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశాలు జరపడాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో ఇంటర్నేషనల్ పాఠశాలలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పేర్లతో లక్షల వ్యాపారం చేస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్, అధ్యక్షుడు బి.వెంకటేష్ మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కెఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన తీశారు. కలెక్టరేట్ వద్ద విద్యార్థులను పోలీసులు లోనికి అనుమతించకపోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. కలెక్టర్ బయటకు రావాలని, విద్యార్థులకు సమాధానం చెప్పాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎంతకూ రాకపోవడంతో గేట్లు దూకి లోపలికి వెళ్లారు. లోపల బైటాయించారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ పాటిల్‌హేమంత్ కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేశారు. జోగులంబ గద్వాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్, మంచిర్యాల కలెక్టరేట్లను ముట్టడించారు.

## మోడీ విదేశాల్లో గాంధీ స్వదేశంలో గాడ్సే

(మొదటిపేజి తరువాయి)

సమావేశం ఏర్పాటు చేశారని, కానీ ఎటువంటి ఫలితం ఇవ్వలేదని విమర్శించారు. హింసకు కారణమైన ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌ను తొలగించి, పరిస్థితులను చక్కదిద్దాలని సూచించారు. శాంతి, సాధారణ పరిస్థితులకు మోడీ ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్కడి పరిస్థితులను బీజేపీ మతోన్మాదంగా మార్చేందుకు ప్రయత్నిస్తుం దని విమర్శించారు. హిందూ మైతీలు, క్రిస్టియన్ కుకీల మధ్య ఘర్షణగా మార్చుతుందని దుయ్యబట్టారు. మణిపూర్‌లో బీజేపీ మతోన్మాద ఎత్తుగడలను ఆపాలని, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌కు అఖిలపక్షాన్ని పంపాలన్న ప్రతిపక్షాల ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని, అయితే ఇదే బీజేపీ గతంలో జమ్మూకాశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై అఖిలపక్షాన్ని పంపాలని డిమాండ్ చేసిందని తెలిపారు. ఇప్పటికే కార్పొరేట్లు రూ.11 లక్షల కోట్ల రుణాలు రద్దు చేశారని, ఇప్పుడు ఆర్‌బీఐ ఉత్తర్వులతో ప్రజల పొదుపులను దోపిడి చేసేందుకు చట్టబద్ధత కల్పిస్తున్నారని విమర్శించారు. రుణాలు చెల్లించే సామర్థ్యమున్నప్పటికీ, రుణాలు చెల్లించటం లేదని, వారికి అనుకూలంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రాలకు బియ్యం సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం ఐదు కేజీల బియ్యం ఉచితంగా ఇస్తుందని, కానీ అదే పథకాన్ని రాష్ట్రాలు అమలు చేస్తే అనుమతించటం లేదని విమర్శించారు. రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం పనికిరాదని హితవు పలికారు.

## మెరిట్ ప్రకారమే గురుకుల సీట్లు

- డాక్టర్ మల్లయ్య భట్టు

(అక్షర సవాల్ ) బ్యూరో-హైదరాబాద్

మెరిట్ ప్రకారమే మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సంస్థలో సీట్లు కేటాయిస్తున్నామనిసంస్థ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు ఒక ప్రకటనలో తెలిపారు. సీటు రానివారు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనీ, కార్యాలయాలు, పాఠశాలల చుట్టూ తిరగొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. 5, 6, 7, 8వ తరగతులతోపాటు, ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సుల్లో 2023- 24 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో వచ్చిన మార్కులు / మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. మొదటి , రెండో, విడత, మూడవ విడత ప్రవేశాలు ముగిసిన తరువాత ఇంకా ఏమైనా ఖాళీలు ఉంటే ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి సీటు కేటాయించనున్నట్టు తెలిపారు.

ప్రవేశ్ ్ర పరీక్ష రాసినా మెరిట్ రానివారు, ప్రవేశ పరీక్ష రాయలేకపోయిన వారు సీట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లో https://mjptbcwreishms.cgg.gov.in దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

సీటు రానివారు హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలోకానీ, ఆర్‌సీఓ కార్యాలయంలో కానీ.. పాఠశాలల్లో గానీ ఎలాంటి దరఖాస్తులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకున్నవారికే సీట్లు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎవరైనా సీట్లు ఇప్పిస్తామని చెప్పితే వారి మాట నమ్మొద్దనీ, అలా చెప్పిన వారి వివరాలు 040-23120496 ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు. సీట్లు ఇప్పిస్తామని తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేసేవారి పై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుంటామని హెచ్చరించారు.

## కోర్టులో పోరాటం కొనసాగిస్తాం

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. ఈ కేసులో తమకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని, అయితే అది వీధుల్లోకాదు.. కోర్టులో అని మహిళా రెజ్లర్లు తెలిపారు. రెజ్లింగ్ అసోసియేషన్‌లో సంస్కరణలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈ ప్రకటన చేసిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ కొన్ని రోజులు సోషల్ మీడియా నుంచి విరామం తీసుకున్నట్టు ట్వీట్ చేశారు. మరోవైపు రెజ్లర్లపై లైంగిక వేధింపులు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ డబ్ల్యుఎఫ్ఐ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. నేరం రుజువైతే బ్రిజ్ భూషణ్ సింగ్‌కు మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే అసోం హైకోర్టులో రెజ్లింగ్ ఫెడరేషన్ ఎన్నికలపై ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ), క్రీడా మంత్రిత్వ శాఖ, డబ్ల్యూఎఫ్ఐకి వ్యతిరేకంగా అస్సాం రెజ్లింగ్ అసోసియేషన్ (ఎడబ్ల్యుఎ) దాఖలు చేసిన పిటిషన్‌పై అస్సాం హైకోర్టు స్టే విధించింది.

## పాదచారుల కోసమే స్కై వాక్‌లు

(మొదటిపేజి తరువాయి)

నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2084 మందికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించామని, కొల్లూరులో 4 వేల మందికి అలాట్ చేసి ఆరుగురితో గృహప్రవేశం చేయించామని తెలిపారు. త్వరలో ఉప్పల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా డబుల్ బెడ్ రూం ఇండ్లను లబ్దిదారులకు అందజేస్తామన్నారు. రూ.88 కోట్లతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌ను రామంతపూర్ పెద్ద చెరువు నుంచి హబ్సిగూడ వరకు నిర్మించామని పేర్కొన్నారు. అలాగే నారపల్లి నుంచి ఉప్పల్ వరకు నిర్మించే ఫ్లైఓవర్ కోసం జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లతో భూసేకరణ పనులు చేపట్టిందని చెప్పారు. ఉప్పల్-అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పల్, రామంతపూర్‌లో పేదవారి కోసం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించామని, మిగతా 10 డివిజన్లలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దుబాయ్ నుంచి రూ.3,500 కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. ఫ్రెంచ్ కంపెనీలు ఉప్పల్, ఘట్కేసర్‌లో తమ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నాయని చెప్పారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను చూసి దేశం మొత్తం కేసీఆర్ లాంటి నాయకుడిని కోరుకుంటుందని అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ చౌరస్తాలో రూ.25 కోట్లతో స్కై వాక్, రూ.10 కోట్లతో నాగోల్ శిల్పారామంలో కన్వెన్షన్ హాల్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రామంతాపూర్ పెద్ద చెరువు నుంచి మూసి వరకు నాలా నిర్మాణం వల్ల 50 కాలనీలు వరద ముంపు నుంచి ఉపశమనం పొందాయని తెలిపారు. రూ.4 కోట్లతో మల్లాపూర్ గ్రేవ్ యార్డ్‌ను నిర్మించి, మల్లాపూర్ చౌరస్తాను ఎలిఫెంట్ చౌరస్తాగా సుందరీకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, దమ్మాయిగూడ చైర్మెన్ వసుపతి ప్రణీత గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బండారి లక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కారును నిలదీయాల్సిన సమయమిదే

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్

(అక్షర సవాల్ ) బ్యూరో-హైదరాబాద్

మహారాష్ట్ర పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెలంగాణ నేతన్నల పక్షాన నిలదీయాలని మహారాష్ట్ర నేత నాయకులకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ సోమవారం ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. తొమ్మిదేండ్లుగా తెలంగాణ నేతన్నలను, చేనేత వ్యవస్థను విచ్ఛిన్నం చేసి మరలా ఏ విధంగా మహారాష్ట్రలో అడుగుపెడుతున్నాడో అడగాలని సూచించారు. దశాబ్దాలుగా తెలంగాణ నుంచి దేశవ్యాప్తంగా నేతకార్మికులు వలసపోయిన విషయం కేసీఆర్‌కు తెలిసినా వారిని స్వరాష్ట్రానికి తీసుకురావడానికి స్పష్టమైన విధానాన్ని అవలంభించక పోవడం చారిత్రక తప్పిదమని పేర్కొన్నారు. 2017లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఫైలాన్ ప్రారంభించి వలసబోయిన తెలంగాణ నేతన్నలను తిరిగి రప్పిస్తామని చెప్పి ఇప్పటివరకు పదిమంది నేతన్నలకు కూడా పని కల్పించలేదని విమర్శించారు.



## ఈజిప్ట్‌తో సాన్నిహిత్యం

అమెరికా పర్యటనలో ఉన్నన్ని వెలుగుజిలుగులు లేక పోవచ్చుగానీ, ప్రధాని నరేంద్రమోదీ ఈజిప్ట్ పర్యటన ఎంతో ఉన్నతంగా, ప్రభావవంతంగా జరిగింది. పాతికేళ్ళ తరువాత తమదేశంలో కాలూనిన భారత ప్రధానిని ఆ దేశం చక్కగా ఆదరించింది, గౌరవించింది. తొలిసారిగా తమ దేశంలో పర్యటిస్తున్న మోదీని సైనికదళాల గౌరవవందనంతో ఆ దేశ ప్రధాని సాదరంగా స్వాగతించారు. అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్‌సిసితో అంతర్జాతీయ పరిణామాలనుంచి విభిన్నరంగాల్లో ఉభయదేశాల పరస్పర సహకారం వరకూ మోదీ చర్చలు జరిపిన నేపథ్యంలో పలు ఒప్పందాలు, అవగాహనలు కుదిరాయి. రెండుదేశాలూ తమ బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి హెచ్చించినందున రక్షణ, వాణిజ్యం, శాస్త్రసాంకేతికరంగాల్లో సహకారం మరింత విస్తరిస్తుంది.

జనవరిలో మన గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఈజిప్ట్ అధ్యక్షుడు రావడంతో ఉభయదేశాల సాన్నిహిత్యం జోరందుకుంది. ఆయన ఆహ్వానం మేరకు ఈజిప్టులో పర్యటించిన మోదీ పాలకులతోనే కాక, పెట్టుబడిదారులతోనూ, వివిధరంగాలకు చెందిన నిపుణులతోనూ చర్చలు జరిపారు. ఇటీవల మన దేశంలో పర్యటించిన పెద్ద ముఫ్తీ నుంచి మీ పాలన అద్భుతం అంటూ ప్రశంసలు స్వీకరించారు. ఈజిప్ట్, పాలస్తీనాల్లో ఉంటూ మొదటి ప్రపంచయుద్ధంలో పోరాడి కన్నుమూసిన భారతీయ సైనికుల కోసం కామన్‌వెల్త్ నిర్మించిన స్మారకం వద్ద నివాళులు అర్పించడం, ఏడువింతల్లో ఒకటైన గాజా పిరమిడ్లను సందర్శించడం వంటివి అటుంచితే, ఈజిప్ట్ తన అత్యున్నత పౌరపురస్కారం 'ఆర్డర్ ఆఫ్ నైల్' మోదీకి ప్రదానం చేయడం విశేషమైన ఘట్టం.

గుజరాత్‌కు చెందిన దావూదీ బోహ్రాలు పునరుద్ధరించిన 11వ శతాబ్దం నాటి అల్ హకీం మసీదును సందర్శించడం స్వరాష్ట్రంలో తన పార్టీ పునాదుల పటిష్ఠానికి ఉపకరిస్తుంది. బోహ్రాలు దేశభక్తులనీ, శాంతికాముకులనీ పలుమార్లు ప్రశంసించడమే కాక, ఇటీవల ముంబైలో బోహ్రాల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఒక అకాడమీని ఆరంభిస్తూ తాను ప్రధానిగా కాక ఓ కుటుంబసభ్యుడిగా ఈ కార్యక్రమానికి హాజరైనానని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటినుంచీ బోహ్రాలతో తన అనుబంధం కొనసాగిస్తున్న మోదీని, ఆయన ఏ దేశంలో కాలూనినా, అక్కడ ఎంత స్వల్పసంఖ్యలో ఉన్నా బోహ్రాలు ఘనంగా స్వాగతిస్తుంటారు. మైనారిటీల అణిచివేతకు సంబంధించి తమపై అంతర్జాతీయ స్థాయిలో వచ్చే విమర్శలు ఎదుర్కోవడానికి ఈ దృశ్యాలు ఉపకరిస్తాయని బీజేపీ నాయకుల నమ్మకం.

ప్రచ్ఛన్నయుద్ధకాలంలో ఏదో ఒక సూపర్ పవర్ పక్షాన నిలబడనిదే మనుగడ ఉండదని చాలాదేశాలు భయపడుతున్న దశలో, అలీనోద్యమ సృష్టికర్తలుగా భారత్, ఈజిప్టు వందకు పైగా దేశాలకు ఎవరి పంచనా చేరాల్సిన అవసరం లేదంటూ దిశానిర్దేశం చేశాయి, ధైర్యాన్ని అందించాయి. ఎన్ని ఒత్తిళ్ళు వచ్చినా, కష్టాలు ఎదురైనా ఈ రెండు దేశాలు ఎటూ మొగ్గకుండా తమ సార్వభౌమత్వాన్ని, స్వతంత్రతను నిలబెట్టుకున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన మూడురోజుల్లోనే భారతదేశం ఈజిప్టుతో తన దౌత్యసంబంధాలను నెలకొల్పుకోవడం ఉభయదేశాల సాన్నిహిత్యానికి నిదర్శనం. నెహ్రూ–నాసర్ కాలంలో పడిన ఈ బలమైన పునాది కొనసాగింపుగా, అనంతర దశాబ్దాల్లో ఉభయదేశాలు పలు అంతర్జాతీయ వేదికలపైన పరస్పరం సహకరించుకున్నాయి, కష్టకాలంలో సాయపడ్డాయి. అరబ్ ఇజ్రాయెలీ యుద్ధాల్లో నైతిక మద్దతు ఇవ్వడమే కాక, అనంతర పునర్నిర్మాణంలో ఈజిప్టుకు భారత్ తగిన సాయం అందించింది. ఆ తరువాత ఉభయదేశాల మధ్య వాణిజ్యం సహా పలురంగాల్లో సహకారానికి అనేక ఒప్పందాలు కుదిరాయి. 2008లో హోస్నీ ముబారక్ భారత పర్యటన అనంతరం ఉభయదేశాల సంబంధాలు గణనీయమైన స్థాయికి పెరుగుతాయని అంతా ఆశించారు. కానీ, 2011 అరబ్ తిరుగుబాట్లలో ఆయన పదవికోల్పోవడమే కాక, ఈజిప్టు తీవ్ర రాజకీయ అనిశ్చితికి గురైంది. ఇటీవలి కాలంలో ఆ దేశంతో మన వాణిజ్యం హెచ్చుతోంది.

అరబ్, ఆఫ్రికా వ్యవహారాల్లో ఈజిప్టు పాత్ర కీలకమైనది. ఆఫ్రికా, ఐరోపా మార్కెట్లకు ఇది రహదారి. పన్నెండు శాతం ప్రపంచవాణిజ్యం సాగుతున్న సూయిజ్ కాలువ తన అధీనంలో ఉన్న ఈ దేశంతో స్నేహం మన వాణిజ్యానికి అవసరం. గ్లోబల్ మార్కెట్లను అందుకోవడానికి తోడ్పడే ఈజిప్టు మోదీ పర్యటన అనంతరం మనకు మరింత చేరువవుతుందని ఆశిద్దాం.

---

**అమెరికాలో మోదీ, రాహుల్ పర్యటనలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కోసం తలపడుతున్న రెండు వేర్వేరు శక్తుల ధోరణుల్ని ప్రతిఫలిస్తున్నాయి. తాను వేసిన ప్రతి అడుగూ భారతదేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించే ప్రధాని మోదీ వంటి దేశభక్తుడు ఒకవైపు, దేశ ప్రతిష్ఠను దిగజారుస్తూ, దేశ ప్రయోజనాలను విస్మరించే రాహుల్ గాంధీ వంటి దేశ వ్యతిరేకి / అపరిణత నేత మరోవైపు మనకు కనపడుతున్నారు. ఎవరిని ఎంచుకోవాలో ప్రజలకు స్పష్టంగా తెలుసు.**

# ఏ దేశమేగినా, ఎందుకాలిడినా...

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అమెరికాలో అపూర్వ స్వాగత సత్కారాలు లభించాయి. ఇది, అమెరికాలోని భారతీయులకే కాదు, సమస్త భారతీయులకూ గర్వకారణం. అంతర్జాతీయ స్థాయిలో మోదీని మించిన ప్రజా నాయకుడు, అత్యంత ఆకర్షణ గల రాజనీతిజ్ఞుడు ఎవరూ లేనరనడంలో సందేహం లేదు. అమెరికాలో ఉన్న లక్షలాది భారతీయులు మోదీ రాకకోసం ఎదురు చూశారు. ఆ దేశమంతటా బ్యానర్లు కట్టి ఆయనకు స్వాగతం పలికారు, ఒక దేశాధినేత హోదాలో మోదీకి ఘన స్వాగతం లభించినప్పుడు వైట్ హౌజ్ వద్ద వేలాది భారతీయులు గుమిగూడారు. 'నేను ఎంతో మంది దేశాధినేతలు అమెరికా పర్యటించడాన్ని చూశాను కాని ఒక దేశాధినేతను చూడడానికి ఇంత పెద్ద ఎత్తున జనం రావాడన్ని ఏనాడూ చూడలేదు' అని ఒక అమెరికన్ మహిళ టీవీలకు తెలిపింది.

గతంలో కూడా భారతదేశ ప్రధానమంత్రులు అమెరికా పర్యటించారు కాని ఇంత పెద్ద ఎత్తున భారతీయులు అమెరికా నలుమూలలనుంచీ వచ్చి ఒక ప్రధానికి స్వాగతం చెప్పిన సందర్భాలు లేవు. విమానాశ్రయాల వద్దో, రాయబార కార్యాలయాల వద్దో లాంఛనంగా భారతీయ ప్రముఖులు ఒక ప్రధానికి స్వాగతం పలకడం పరిపాటి. కాని నరేంద్రమోదీ పట్ల ప్రదర్శించినంత ఆదరాభిమానాల ముందు అవి సాటి రావు. కారణం ఏమిటి? మోదీని చూడగానే ప్రతి భారతీయుడి మది పులకితం కావడమే అందుకు కారణం. భారతీయుడు, భారతీయత అన్న పదాలకు సార్థకత లభించింది మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాతే. ఆయన తీసుకున్న ప్రతి నిర్ణయంలోనూ, మాట్లాడే ప్రతి మాటలోనూ దేశభక్తి ఉప్పొంగుతుంది. 'ఇండియా ఫస్ట్' అన్న భావనను ప్రవేశపెట్టింది మోదీయే. అమెరికాలో ప్రతి చోటా ఆయన భారతదేశం గొప్పతనం గురించి మాట్లాడారు. భారతదేశం అత్యాధునిక దేశంగా అభివృద్ధి చెందేందుకు ప్రతి ప్రవాస భారతీయుడు చేసిన కృషి గురించి చెప్పారు. వాషింగ్టన్ డీసీలో రోనాల్డ్ రీగన్ బిల్డింగ్, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్‌లో వేలాది ప్రవాస భారతీయులు ఆయనను చూడగానే ఉప్పొంగిపోయారు. వందేమాతరమ్, భారత మాతాకీ జై అన్న నినాదాలు మారుమ్రోగాయి. అమెరికాలో భారతీయులను చూసినప్పుడు తాను ఒక మినీ భారత్‌ను చూస్తున్నానన్న భావన కలిగిందని, 'ఏక్ భారత్ –శ్రేష్ఠ భారత్' అన్న ఆలోచనకు ఆచరణ రూపం దాల్చారని ఆయన ప్రశంసించారు. వైట్ హౌజ్‌లో మోదీ తన గౌరవార్థం ఇచ్చిన విందుకు ప్రతిస్పందిస్తూ ఇచ్చిన ప్రసంగానికి అడుగడుగునా కరతాళ ధ్వనులు మారుమ్రోగాయి. ఆయన పర్యటన ఉభయ దేశాల సంబంధాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందనడానికి అదొక నిదర్శనం అనడంలో సందేహం లేదు. అమెరికా కాంగ్రెస్‌లో మోదీ ప్రసంగానికి 15సార్లు కాంగ్రెస్ సభ్యులు లేచి నిలబడి కరతాళ ధ్వనులు చేశారు. వందలాది ప్రజాప్రతినిధులు క్యూలో నిలబడి ఆయన ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీలు తీసుకున్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి కేంద్ర కార్యాలయంలో విశ్వ యోగా దినం సందర్భంగా మోదీతో పాటు 139 దేశాల ప్రతినిధులు యోగాలో పాల్గొన్నారు. గతంలో ఏ దేశ ప్రధానికైనా అమెరికాలో ఇంత పెద్ద ఎత్తున ప్రతిస్పందన లభించిందా?



అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాల విషయంలో కూడా ఆయన భారతదేశంలో తాను చేపట్టిన మేక్ ఇన్ ఇండియాను ప్రధానంగా దృష్టిలో పెట్టుకున్నారు. గతంలో అమెరికా ఏనాడూ ఇంత పెద్ద ఎత్తున టెక్నాలజీని బదిలీ చేయలేదు. హిందూస్తాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్ మన గడ్డపైనే తయారు చేసే తేజాస్ ఎంకె 2 యుద్ధ విమానాలకు అమెరికాకు చెందిన జనరల్ ఎలెక్ట్రానిక్స్ జెట్ ఇంజన్ టెక్నాలజీ బదిలీ చేసేందుకు అగీకరించింది. దీని వల్ల హెచ్ఏఎల్ అధునాతన యుద్ధ విమానాలకు స్వయంగా ఇంజన్లను మన దేశంలోనే అభివృద్ధి చేయగల సామర్థ్యం సమకూర్చుకుంటుంది. అంతరిక్ష రంగంలో కూడా భారతదేశం కొత్త పుంతలు తొక్కడానికి అమెరికాకు చెందిన నాసా భారత అంతరిక్ష సంస్థ ఇస్రోకు పూర్తి సహాయ సహకారాలను అందిస్తుంది. అంతర్జాతీయ అంతరిక్ష స్టేషన్‌లో భారతీయుడు ప్రవేశించేందుకు ఇది దోహదం చేస్తుంది. సెమికండక్టర్ ఉత్పాదక రంగంలో అమెరికాకు చెందిన సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. భారత అమెరికా దేశాల స్టార్టప్‌ల మధ్య రక్షణ రంగంలో సంయుక్త పరిశోధన, అత్యాంతాధునిక టెక్నాలజీ విషయంలో సహకారం కుదిరేందుకు మోదీ పర్యటన దోహదం చేసింది.

అమెరికా భారత్‌కు ఇంత ప్రాధాన్యత, గౌరవం ఇవ్వడం ప్రపంచ దేశాల్లో భారత్‌కున్న ప్రతిష్ఠను ఇనుమడింపచేస్తుందనడంలో సందేహం లేదు. ప్రపంచంలో దుందుడుకుగా విస్తరిస్తున్న చైనా ఆర్థికంగానూ, రక్షణ పరంగానూ సృష్టిస్తున్న కల్లోలం రీత్యా ఆ దేశానికి బలమైన పోటీ నివ్వగల శక్తి భారత్‌కు ఉన్నదని అమెరికాతో పాటు అనేక దేశాలు గుర్తించాయి. మానవ వనరులు, మేధా శక్తి ఉన్నభారత్‌కు టెక్నాలజీ లభిస్తే ఆ దేశానికి తిరుగుండదని, చైనా అధిపత్యానికి అడ్డుకట్ట పడుతుందని ఈ దేశాలు భావిస్తున్నాయి. అమెరికాతో స్నేహ సంబంధాలు, వ్యాపార సంబంధాలు పెరిగినప్పటికీ మన వ్యూహాత్మక స్వతంత్రత ఏ మాత్రం దెబ్బతినకుండా మోదీ పర్యటన దోహదం చేసింది. ఉక్రెయిన్ పట్ల మన వైఖరి గురించి కానీ, రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడాన్ని గానీ అమెరికా ఏ దశలోనూ ప్రశ్నించలేదు. ప్రపంచ రాజకీయాల్లో సమతుల్యత సాధించే శక్తి భారతదేశానికే ఉన్నదని అమెరికా గుర్తించేలా ఈ పర్యటన దోహదం చేసింది. అందుకే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత శాశ్వత సభ్యత్వాన్ని అమెరికా సమర్థించింది.

విషాదకరమేమంటే మోదీ తన పర్యటనలో భారతదేశ ఔన్నత్యం ప్రపంచం గుర్తుంచుకునే రీతిలో ప్రవర్తిస్తే ఆయనకు ముందు పదిరోజుల పాటు అమెరికాలో పర్యటించిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా దుర్భాషలాడారు. ఒక విదేశీ గడ్డపై మన దేశాన్ని, మన నేతలను కించపరిచే విదంగా మాట్లాడడం సంప్రదాయం, సంస్కారవంతం కాదని రాహుల్ గుర్తించలేకపోయారు. అమెరికాలో మోదీ, రాహుల్ పర్యటనలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కోసం తలపడుతున్న రెండు వేర్వేరు శక్తుల ధోరణుల్ని ప్రతిఫలిస్తున్నాయి. తాను వేసిన ప్రతి అడుగూ భారతదేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించే ప్రధాని మోదీ వంటి దేశభక్తుడు ఒకవైపు, దేశ ప్రతిష్ఠను దిగజారుస్తూ, దేశ ప్రయోజనాలను విస్మరించే రాహుల్‌గాంధీ వంటి దేశ వ్యతిరేకి / అపరిణత నేత మరో వైపు మనకు కనపడుతున్నారు. ఎవరిని ఎంచుకోవాలో ప్రజలకు స్పష్టంగా తెలుసు.

సత్యకాలమ్



■ వై. సత్యకుమార్

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

---

# అభద్రతా లోకం.. నియంతల రాజ్యం

మానవ జీవితంలో యుగాల ప్రాధాన్యం గురించి అందరికీ తెలిసిందే. సంప్రదాయం ప్రకారం మనకు నాలుగు యుగాలు ఉన్నాయి. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాల గురించి వినని వారు భారతదేశంలో ఉండరు. పురాణాల ప్రకారం కృత యుగంలో ధర్మం నాలుగు పాదాలతో నిండుగా నడిచేది. యుగం గడిచే కొద్దీ అది క్షీణించి కలియుగం నాటికి ఒంటి కాలుకు పరిమితమైంది. యుగయుగానికి సత్ప్రవర్తన దిగజారిపోవటం మన సంప్రదాయంలో విశిష్టత. అన్ని అవలక్షణాలకు నిలయమైన కలియుగం చివరికి అంతమవుతుంది. మళ్లీ కాలచక్రం కృత యుగంతో మొదలవుతుంది. పాపం పండిన కలియుగం కూడా దానంతటదే అంతం కాదు. ఒక యుగ పురుషుడు అవతరించి దాన్ని పూర్తి చేస్తాడు. మంచి వాళ్లు చెడ్డవారిపై పోరాడి దీన్ని అంతం చేయలేరు. మన సంప్రదాయంలో యుగాలను ప్రజలు మార్చలేరు. అసలు చరిత్రే ప్రజల చేతుల్లో ఉండదు. ప్రగతి అనేది నిరంతరం పైపైకి వెళ్లే ప్రక్రియగా మన సంప్రదాయంలో కనపడదు. చరిత్ర ఎక్కడ మొదలైందో చివరికి అక్కడికే చేరుతుంది. నికర ప్రగతి పూజ్యం! దీనికి భిన్నంగా లౌకిక చరిత్రలో ఎన్నో యుగాలు కనిపిస్తాయి. వీటి సంఖ్య సంప్రదాయ యుగాల్లా స్థిరమైనవి కావు. కొత్తవి చేరుతూ ఉంటాయి. సాంకేతికంగా. ఆర్థికంగా, రాజకీయంగా మనుషులు సాధించిన ప్రగతి ఆధారంగా యుగ విభజన చేసుకుంటూ వస్తాం. మానవ చరిత్రలో ఎక్కువ కాలం ఆహార సేకరణలోనే గడిచిపోయింది. అందుకే దీన్ని ఆహార సేకరణ యుగంగా పిలుస్తారు. వ్యవసాయాన్ని కనిపెట్టటంతో ఆహార ఉత్పత్తి యుగం మొదలైంది. రాజకీయ, ఆర్థిక రంగాలపై ఆధిపత్యం వహించే వర్గాలను బట్టి యుగ విభజన చేయటం గడచిన వందేళ్లలో బాగా పెరిగింది. జమిందారీ, పారిశ్రామిక, సామ్రాజ్యవాద, వలసవాద, సామ్యవాద, ప్రపంచీకరణ, ప్రజాస్వామ్య యుగాల్లాంటివి ఇట్లా వచ్చినవే.

ఇప్పుడు కొత్తగా మరో యుగం మొదలైందని చెప్పుకోవచ్చు. దాన్ని అభద్రతా యుగంగా అనుకోవచ్చు. అన్ని వైపుల నుంచి మనుషులను అభద్రత ఉక్కిరిబిక్కిరి చేయటం దీని ప్రధాన స్వభావం. కరోనా మహమ్మారితో అభద్రత పతాక స్థాయికి చేరింది. కానీ అభద్రతా యుగం కరోనాతో మొదలవ్వలేదు. కరోనా ఉధృతి తగ్గటంతో దాని తీవ్రత తగ్గిపోయిందని మనం అనుకుంటున్నాం. కానీ అది వాస్తవం కాదు. ఈ యుగం స్వభావం గురించి ఎన్నో విశ్లేషణలు వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. సుప్రసిద్ధ ఆర్థికవేత్త ప్రణబ్ బర్ధన్ ఇటీవలే 'ఏ వర్ల్డ్ ఆఫ్ ఇన్‌సెక్యూరిటీ' పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. పుస్తకం పేరే అభద్రతా ప్రపంచం అని పెట్టటంతో దాని ప్రధాన లక్షణాల గురించి లోతుగానే చర్చించారు. అభద్రతా యుగం లక్షణాలేమిటి? ఎప్పటి నుంచి అవి స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంటున్నాయి? భారతదేశంలో కూడా ఈ లక్షణాలు ప్రస్ఫుటంగా ఉన్నాయా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలను ఇవ్వటానికి ప్రయత్నించారు. ప్రధానంగా మూడు లక్షణాలను ఈ యుగ విశిష్టతలుగా చెప్పుకోవచ్చు. ఆర్థికంగా ప్రజలు తీవ్ర అనిశ్చితిలో కొట్టుమిట్టాడడం ఇందులో కీలకంగా భావించవచ్చు. సాంస్కృతికంగా సగటు మనిషి ప్రగాఢమైన అనిశ్చితిలో పడిపోవటం రెండో ప్రధాన లక్షణంగా చెప్పుకోవచ్చు. మూడోది... పర్యావరణంలో తీవ్ర మార్పుల కారణంగా కలిగే అనిశ్చితి. ఈ మూడు అనిశ్చితుల కారణంగా కలిగే అసంతృప్తి, నిరాశలతో రగిలిపోతున్న ప్రజలను లక్ష్యంగా చేసుకుని పలు దేశాల్లో నియంతృత్వ పోకడలున్న నేతలు రంగం మీదకొచ్చి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయటం ఈ యుగం ప్రధాన పర్యవసానంగా భావించొచ్చు.





**ఇది అభద్రతా యుగం. ఆర్థికంగా ప్రజలు తీవ్ర అనిశ్చితిలో కొట్టుమిట్టాడడం, సాంస్కృతికంగా సగటు మనిషి ప్రగాఢమైన అనిశ్చితిలో పడిపోవటం, పర్యావరణంలో తీవ్రమార్పుల కారణంగా కలిగే అనిశ్చితి ఈ యుగ లక్షణాలు. ఈ మూడు అనిశ్చితుల కారణంగా కలిగే అసంతృప్తి, నిరాశలతో రగిలిపోతున్న ప్రజలను లక్ష్యంగా చేసుకుని పలు దేశాల్లో నియంతృత్వ పోకడలున్న నేతలు రంగం మీదకొచ్చి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయటం ఈ యుగం ప్రధాన పర్యవసానంగా భావించొచ్చు.**

అమెరికాలో ట్రంప్ అధికారంలోకి రావటం దీనికి ప్రబల నిదర్శనం. అక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థలను తలకిందులు చేయటానికి ట్రంప్ చేసిన ప్రయత్నాలు అందరికీ తెలిసినవే. అధ్యక్ష ఎన్నికల ఫలితాలను సైతం అంగీకరించటానికి నిరాకరించారు. ఎన్నికలను డెమక్రాట్స్ రిగ్గింగు చేశారని ఆరోపిస్తూ ట్రంప్ అనుచరులు అమెరికా పార్లమెంటు భవనంపై దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత బ్రెజిల్‌లోనూ ఇదే తరహా దారుణం పునరావృతం అయింది. పెద్ద సంఖ్యలో ప్రజలు ఉద్యోగ, ఆదాయ భద్రతలను కోల్పోవటం ఆర్థిక అనిశ్చితికి ప్రధాన కారణం. ప్రపంచీకరణ ప్రభావంతో.. అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకనాడు ఒక వెలుగువెలిగిన ఫ్యాక్టరీలెన్నో మూతబడ్డాయి. దేశీయంగా ఉత్పత్తులు ఆగిపోయాయి. దిగుమతులు పెరిగిపోయాయి. సేవలు అవుట్ సోర్సింగ్ రూపంలో ఇతర దేశాలకు తరలిపోయాయి. ఎందరో ఉద్యోగాలను కోల్పోయారు. అమెరికాలో దీన్ని 'చైనా షాక్'గా వర్ణించారు. చైనా షాక్‌తో ప్రభావితమైన ప్రాంతాల్లోని ప్రజలు ట్రంప్ లాంటి నేతలకు మద్దతు పలికారు. ఈయూ (యూరోపియన్ యూనియన్) నుంచి బ్రిటన్ బయటకి రావటానికి అనుకూలతను వ్యక్తంచేసిన వారూ ఆ దేశంలో ఈ తరహా ప్రాంతాల ప్రజలే. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీల్లో అతివాద జాతీయ పార్టీల మద్దతుదారులు అలాంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా కనపడతారు. ఈయూ పార్లమెంటును వ్యతిరేకించే పార్టీలకు ఎక్కువ ఓట్లు అట్లాంటి చోట్ల నుంచే వచ్చాయి. ఉన్మాదాలతో ఊదరగొట్టే నేతలు ఆర్థిక అనిశ్చిత వాతావరణంలో చెలరేగిపోతారు. ఆ అనిశ్చితిని అంతం చేయగలిగే మహా శక్తిమంతులుగా తమని ప్రకటించుకుంటారు. అంతర్జాతీయ ఒప్పందాలను తిరస్కరిస్తారు. ఎంత అనుచితమైనప్పటికీ తమ దేశానికి పెద్దపీట వేయని ఏ ఒడంబడికనూ లెక్కచేయబోమని బీరాలు పలుకుతారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు ట్రంప్ చేసిన ప్రకటన అట్లా చేసిందే. ప్రపంచ వాణిజ్యసంస్థ నుంచి తప్పుకొంటామన్న హెచ్చరిక అలాంటిదే. నిరంతరం ద్వేషించటానికి ఇంటా బయటా శత్రువులు లేకుండా ఈ ఊదర ఉపన్యాస నేతలు మనుగడ సాగించలేరు. చైనాపై శత్రుత్వం అలాంటిదే. శ్వేతజాతీయులే అమెరికాలో ప్రథమ పౌరులని పైకి అనలేదు కానీ ఆ అర్థం వచ్చేటట్లుగానే ఎన్నో సందర్భాల్లో వ్యాఖ్యానాలు చేశారు. ప్రపంచంలో నియంతలందరూ ఆర్థిక అనిశ్చితి, అభద్రత నేపథ్యంలోనే అధికారంలోకి వచ్చారు. సైనిక తిరుగుబాట్లు, రాజకీయ కుట్రల ద్వారా గతంలో నియంతలు అధికార పీఠాలను ఎక్కారు. ఇక ఓట్ల ద్వారా అధికారాన్ని చేపట్టి.. నియంతృత్వ పాలన దిశగా అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను నడిపించటం అభద్రతా యుగంలో ముఖ్యపరిణామంగా భావించొచ్చు.

తాము పుట్టిపెరిగిన సంస్కృతికి ముప్పు ముంచుకొస్తోందని ప్రజలు భావించటం అభద్రతా యుగంలో పెరిగిపోతుంది. తమది కాని, తమకు సాంత్వన ఇవ్వని ప్రపంచంలోకి బలవంతంగా వెళ్లిపోతున్నామన్న భావన చాలా చోట్ల నెలకొంటుంది. ఉద్యోగులు, శరణార్థుల రూపంలో తమ దేశంలో ప్రవేశించిన వ్యక్తుల వల్ల సాంస్కృతికంగా ప్రాధాన్యాన్ని కోల్పోతున్నామని స్థానికుల్లో నెలకొంటున్న భయాన్ని ఊదర ఉపన్యాసకర్తలు మహాముప్పుగా చూపిస్తారు. మరోవైపు స్వేచ్ఛా వాణిజ్యాన్ని, గ్లోబలైజేషన్‌ని సమర్థించే ఉదారవాదులను లక్ష్యంగా చేసుకుని దాడులు మొదలుపెడతారు. ఉదారవాదుల వల్లే పరిశ్రమలు, ఉద్యోగాలు తరలిపోయాయనీ, విదేశీ ఉత్పత్తులు ముంచెత్తుతున్నాయనీ ఫలితంగా స్థానిక సంస్కృతులు విచ్ఛిన్నం అవుతున్నాయని విమర్శలు ఎక్కుపెడతారు. స్వంత సంస్కృతికి ప్రమాదం ఉందన్న ప్రచారం మనుషులను తేలికగా ఆకర్షిస్తుంది. ఇస్లాం, క్రైస్తవం, హిందూమతం ప్రమాదంలో పడిపోతున్నాయని చేసే హెచ్చరికలు కూడా ఈ కోవలోవే. ఒక్కసారి ఆ భయమంటూ కలిగితే దాన్ని రెచ్చగొట్టి పెంచటం చాలా తేలిక.





పర్యావరణంలో వస్తోన్న విపరీత మార్పులపై అందరిలో భయం నెలకొంది. కాలాలు గతితప్పటం, చలి దేశాల్లో విపరీత ఎండలు, అనూహ్య వర్షాలు, అడవుల దగ్ధం, సముద్ర తీరాల్లో అల్లకల్లోలం, వాయు కాలుష్యం లాంటి సమస్యలపై కాస్తోకూస్తో అవగాహన అందరిలో పెరుగుతోంది. కరోనా మహమ్మారితో మనిషి అస్తిత్వం, మనుగడపై తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. వైరస్‌లు సమాజ జీవనాన్ని ఇంతగా స్తంభింపచేస్తాయని మనం కలలో కూడా ఊహించలేదు. నియంత్రించటానికి వీల్లేని స్థాయికి పర్యావరణ విధ్వంసం చేరుకుంటోందన్న భావన ప్రజలందరిలో పాతుకుపోతోంది. ప్రకృతి వైపరీత్యాల పరంగా ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన వర్గాలకు అతీతంగా మొదలైంది. కరోనా కాలంలో బలవంతంగా ఆర్థిక వ్యవస్థను సడన్‌బ్రేక్ వేసినట్లు ఆపేయటం ప్రజల ఆలోచనలపై అసాధారణ ప్రభావాన్ని కలగచేసింది.

అభద్రతా ప్రపంచంలో నియంతృత్వ పోకడలు ఎంతగా పెరిగాయో చూస్తే ఆశ్చర్యపోతాం. గోతెన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన వి–డెమ్ ఇన్‌స్టిట్యూట్ 2021లో 200 దేశాల్లోని రాజకీయ పరిస్థితులను పరిశీలించింది. ఎన్నో చేదునిజాలు వెలుగులోకి వచ్చాయి. వి–డెమ్ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో 68 శాతం మంది ఏదో విధమైన నియంతృత్వ పాలన కిందే జీవిస్తున్నారు. ఉదార ప్రజాస్వామ్య దేశాల సంఖ్య 41 నుంచి 32కు పడిపోయింది. భారత్‌లోని పరిస్థితులను కూడా ఎలక్టోరల్ ఆటాక్రసీగా వర్ణించారు. మీడియాపై పరిమితులు, పౌరసమాజంపై ఆంక్షలు, ప్రతిపక్షాలపై వేధింపులు పెరగటాన్ని ఎలక్టోరల్ ఆటాక్రసీకి నిదర్శనంగా పేర్కొన్నారు. పరిస్థితి నిరాశజనకంగా అనిపించినా, అభద్రతా భయాలు కారుమేఘాల్లా కమ్ముకొస్తున్నా కొన్ని పరిష్కారాలను బర్ధన్ సూచించారు. కనీస ఆదాయ పథకం అందులో ప్రధానమైంది. భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన లెక్కలను చాలా విధాలుగా మదింపువేసి కనీస ఆదాయ పథకాన్ని ఎలా అమలుపరచవచ్చో వివరించారు. ఆర్థిక అనిశ్చితిని గణనీయంగా తగ్గించగలిగితే అభద్రతా ప్రపంచం కలగచేసే విపరిణామాలను కూడా నెమ్మదింపచేయగలమని ప్రతిపాదించారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే సామాజిక ప్రజాస్వామ్య రాజకీయాలు, పర్యావరణ అనుకూల సాంకేతికత పరిజ్ఞానం కోసం పెద్ద ఎత్తున చేపట్టాల్సిన పరిశోధనలు, స్థానిక ప్రజలకు విధానాల రూపకల్పనలో సముచిత పాత్ర, అసమానతలను తగ్గించటానికి పన్నులను పెంచటం లాంటివి కూడా సూచించారు. ఇంతగా ఇవన్నీ చెప్పినా ఒక వ్యవస్థగా తీవ్ర అనిశ్చితికి తరచూ దారితీసే క్యాపిటలిజాన్ని తోసిపుచ్చాలని మాత్రం చెప్పలేదు. క్యాపిటలిజాన్ని క్యాపిటలిస్టులను రక్షించటమే ఇప్పటి అవసరంగా చెప్పారు. విచిత్రం అదే!

---

# భావాలనే వేటాడుతున్నారు!

ములుగు జిల్లా తాడ్వాయి పోలీసులు 2022 ఆగస్టులో నమోదు చేసిన ఒక కేసు పది నెలల తర్వాత జూన్ రెండోవారంలో బైటపడి సంచలనం సృష్టించింది. దానిలో నిందితులుగా ప్రొ. జి. హరగోపాల్, ప్రొ.పద్మజా షా లతో సహా 152 మంది పేర్లు ఉన్నాయని బహిర్గతమై, పెద్ద ఎత్తున నిరసన చెలరేగింది. దానితో ప్రభుత్వం ఇబ్బందిలో పడి, ముందు కేసును వెనక్కి తీసుకుంటున్నానని ప్రకటించింది. తర్వాత 'ఇప్పటివరకు జరిగిన విచారణలో హరగోపాల్, పద్మజా షా, వి. రఘునాథ్, గడ్డం లక్ష్మణ్, గుంటి రవీందర్, సురేష్ కుమార్ ప్రమేయంపై తగిన ఆధారాలు లభించలేదు' గనుక వారిమీద కేసు ఉపసంహరించుకోబోతున్నామన్న ప్రకటన వచ్చింది. దీనితో తాత్కాలికంగా వివాదం సమసిపోయింది.

అయితే, ప్రభుత్వమూ పోలీసులూ ఈ వివాదాన్ని ముగించామని సంతృప్తి పడవచ్చు గాని, ప్రస్తుత వివాదం మరెన్నో వివాదాలకు దారి తీయనుంది. విచారణలో ఆరుగురి మీద 'అభియోగాలకు తగిన ఆధారాలు లభించలేదని' అన్నారు సరే, మరి బైటి విచారణ అలా ఉంచి అసలు ఆ ఎఫ్ఐఆర్ తయారీ మీద విచారణ జరిపారా? జరిపితే, ఆ ఎఫ్ఐఆర్ తయారు కావడానికి రెండు సంవత్సరాల ముందు మరణించిన బొంబాయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్ సురేష్ పేరు ఉండడానికి ఆధారాలు లభించాయా? ఆ ఎఫ్ఐఆర్ కన్న ఏడాది ముందు మరణించిన అమరుల బంధు మిత్రుల సంఘం నాయకుడు కొడకంచి నర్సన్న ప్రమేయంపై ఆధారాలు లభించాయా? ఈ ఎఫ్ఐఆర్ రాయడానికి నాలుగు సంవత్సరాల ముందు నుంచీ, భీమా కోరేగాం కేసులో నిందితులుగా జైలులో ఉంటున్న సుధా భరద్వాజ్, సురేంద్ర గాడ్లింగ్, అరుణ్ ఫరేరాల పేర్లు ఏ ఆధారాల మీద కొనసాగుతున్నాయి? ఈ ఎఫ్ఐఆర్‌లో ఎ44, ఎ119 అని రెండు చోట్ల ఒకే పేరు, ఎ112, ఎ144 అని రెండు చోట్ల ఒకే పేరు వంటి అవకతవకలకు పాల్పడిన వారి గురించి 'ఇప్పటివరకు జరిగిన విచారణ'లో ఏమైనా ఆలోచించారా?

అది ఒక తప్పుల తడక ప్రాథమిక సమాచార నివేదిక. అక్కడ ఒక ఘటన లేదు, చర్య లేదు, నేరం లేదు. ఎవరూ దొరకలేదని ఎఫ్ఐఆర్ స్వయంగా ఒప్పుకుంటున్నది. వాళ్లు వదిలివెళ్లిన పత్రాలలో కనబడిన పేర్లన్నీ రాశారట. అది నేర విచారణా పద్ధతేనా? ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా చూపినవారి గురించి ఎనిమిది అంశాలు (పేరు, తండ్రి పేరు, వయసు, వృత్తి, చిరునామా వగైరా) రాయాలని ప్రింటెడ్ ప్రొఫార్మా ఉండగా 152 పేర్లలో ఒక్కదానికి కూడ పేర్లు తప్ప మరేమీ లేవు. అవి కూడ సత్య, సంధ్య, ఆర్తి, సోమయ్య, వెంకటరాములు అని ఎవరికైనా వర్తించగల పేర్లు, నిర్దిష్టంగా ఎవరో చెప్పలేని పేర్లు ఎన్నో ఉన్నాయి. ఎత్తు, బరువు, పుట్టుమచ్చలు వంటి ఆనవాళ్లకు సంబంధించి పందొమ్మిది కాలమ్‌ల ప్రొఫార్మాలో స్త్రీ/పురుషుడు అని ఒక్క కాలమ్ తప్ప మిగిలినవన్నీ ఖాళీగా వదిలేశారు. ఈ అవకతవకల పేర్ల కేసు మీద ఏ దర్యాప్తు జరుపుతారో, న్యాయస్థానాలలో ఏ విచారణ జరుపుతారో గాని ముందు ఈ ఎఫ్ఐఆర్ రాసినవారి మీద దర్యాప్తు జరపవలసి ఉంది.

అయితే ఈ ఎఫ్ఐఆర్ రాసిన తాడ్వాయి సర్కిల్ ఇన్‌స్పెక్టరో, ఆమోదించిన స్టేషన్ హౌస్ ఆఫీసరో చేసిన పొరపాటు కాదిది. ప్రభుత్వమే, పోలీసు ఉన్నతాధికారులే ఇటువంటి అవకతవక అభియోగ పత్రాలను ఉద్దేశపూర్వకంగా తయారు చేయిస్తున్నారు. ఇటువంటి తప్పుడు ఎఫ్ఐఆర్‌ల మీద ఆధారపడి కేసులు నమోదు చేసుకునే కింది స్థాయి న్యాయవ్యవస్థ కూడా ఏ సాక్ష్యాధారాలు లేకుండా, ఏ నేరమూ జరగకుండా ప్రజాపక్ష మేధావుల మీద, సామాజిక కార్యకర్తల మీద అక్రమ కేసులు బనాయించే సంప్రదాయాన్ని సాగనిస్తున్నది. పోలీసులకు సులభంగా దొరికినది చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (అన్ లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్) అనే నిరంకుశ ఆయుధం. దాని ద్వారా ఎవరినైనా ఎంతకాలమైనా నిర్బంధించవచ్చు, వారి గొంతు వినబడకుండా చెయ్యవచ్చు.

ఇప్పుడు చర్చలోకి వచ్చిన తాడ్వాయి కేసు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక మొదటి కేసేమీ కాదు. ఇటువంటి కేసులు ఈ తొమ్మిదేళ్లలో కనీసం రెండు డజన్లు నమోదయ్యాయి. మరీ ముఖ్యంగా 2018 తర్వాత కనీసం పన్నెండు నమోదయ్యాయి. అన్నిటికీ ఒకేరకమైన ఫిర్యాదులు (పదాలు కూడా మారకుండా). అన్నిటిలోనూ ఒకేరకమైన 'నేరాలు'. అన్నిటిలోనూ ఒకేరకమైన సెక్షన్లు. అన్నిటిలోనూ నాలుగో, ఐదో, పదో అజ్ఞాత విప్లవకారుల పేర్లు. ప్రజాసంఘాలలో పనిచేస్తున్న, బహిరంగ ప్రజాజీవితంలో ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కవులు, కళాకారులు, రచయితలు, విద్యార్థి నాయకులు, మహిళా నాయకులు, న్యాయవాదులు వంటి వారి పేర్లు. వేరు వేరు జిల్లాల్లో, వేరు వేరు పోలీసు స్టేషన్లలో నమోదైనప్పటికీ, అన్ని కేసులూ ఇంతగా అక్షరం పొల్లుపోకుండా సమానంగా ఉన్నాయంటేనే అవన్నీ ఒక్కచోటనే, ఒకరి ఆదేశం ప్రకారమే తయారవుతున్నాయని అర్థం. అంటే అది రాజకీయ నిర్ణయమే తప్ప, ఎక్కడో ఒక 'నేరం' జరిగి, ఎవరో ఒక పోలీసు అధికారి కనిపెట్టి, దర్యాప్తు జరిపి, తయారు చేసిన ఎఫ్ఐఆర్ కాదని అర్థం. ఈ కేసులలో రెండు మూడు మినహా అన్నిటిలోనూ యుఎపిఎ నేరారోపణలు చేశారు. ఇవేవో కేంద్ర ప్రభుత్వ ఎన్ఐఎ పెట్టిన కేసులనీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ పాపమూ ఎరగదని కొందరు భ్రమపడుతున్నారు. కానీ ఇవన్నీ తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసులే. ఒక్క కేసును మాత్రం ఆ తర్వాత ఎన్ఐఎ తన అధీనంలోకి తీసుకుంది.

ఈ కేసుల్లో భారత శిక్షా స్మృతిలోని సెక్షన్లు 120–బి, 121ఎ, 124ఎ, 143, 147, 148, 302, 307, తెలంగాణ రాష్ట్ర ప్రజా భద్రతా చట్టం సెక్షన్ 8(1)(2), ఆయుధాల చట్టం సెక్షన్ 25(1)(ఎ)తో పాటు యుఎపిఎలోని సెక్షన్లు 10, 13, 17, 18, 20, 38, 40 చేర్చారు. సెక్షన్ 124ఎ ఉపయోగించి కేసులు పెట్టగూడదని, గతంలో పెట్టిన కేసుల మీద విచారణ ఆపాలని సుప్రీంకోర్టు 2022 మేలోనే ఆదేశాలు ఇచ్చినా తెలంగాణ పోలీసులు పాటించడం లేదు.

సాధారణంగా ఈ కేసులలో నిందితుల పేర్లు కొన్ని రాసి, 'అండ్ అదర్స్' అని ఎప్పుడైనా, ఎవరి పేరైనా చేర్చడానికి అవకాశాన్ని మిగుల్చుకుంటున్నారు. అంతే కాదు, ఇంకా ఘోరంగా, ఎవరో ఒకరు పోలీసు కస్టడీలో కన్ఫెషన్ స్టేట్‌మెంట్ (ఒప్పుదల ప్రకటన) ఇచ్చారని ఒక ఇష్టారాజ్యపు ప్రకటన రాసి, అందులో తాము రాయదలచుకున్న పేర్లన్నీ రాసి, ఎఫ్ఐఆర్‌లో లేకుండానే వారిని అరెస్టు చేస్తున్నారు.

ఈ అన్ని కేసులలోనూ సాధారణాంశం తెలంగాణలో పనిచేస్తున్న ప్రజాసంఘాల కార్యకర్తల, నాయకుల పేర్లను చేర్చడం. పౌరహక్కుల సంఘం, అమరుల బంధు మిత్రుల సంఘం, కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్, విప్లవ రచయితల సంఘం, చైతన్య మహిళా సంఘం, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ విద్యార్థి వేదిక, తెలంగాణ విద్యార్థి సంఘం, డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్, కుల నిర్మూలన పోరాట సమితి, తెలంగాణ రైతాంగ సమితి, ఫోరం అగెనెస్ట్ హిందుత్వ ఫాసిస్ట్ ఆన్ స్లాట్ వంటి సంఘాల నుంచి కొన్ని పేర్లుంటాయి, నిషిద్ధ మావోయిస్టు పార్టీ కార్యకర్తల పేర్లు కొన్ని ఉంటాయి. ఏ సంఘంలో లేకపోయినా ప్రజల పక్షాన మాట్లాడుతున్న, రాస్తున్న రచయితల, మేధావుల పేర్లు కూడా ఉంటాయి. ఏ ఒక్క కేసులోనూ ఘటనలు, చర్యలు, నేరాలు లేకపోవడం, ప్రజలలో బహిరంగ భావప్రకటన సాగిస్తున్న వారి పేర్లు మాత్రమే ఉండడం చూస్తే, ఈ కేసుల పరంపర భిన్నాభిప్రాయ ప్రకటనను అడ్డుకోదలచుకున్న, భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయదలచుకున్న రాజకీయ నిర్ణయం మాత్రమే అనిపిస్తుంది.

2016లో సిద్ధిపేట జిల్లా మెదక్ పోలీసు స్టేషనులో పది పేర్లతో నమోదైన కేసును 2019లో మొదట 54 పేర్లకూ, తర్వాత 59 పేర్లకూ విస్తరించారు. 2018లో చర్ల పోలీసు స్టేషనులో 24 పేర్లతో ఒక కేసు నమోదు చేశారు. లక్ష్మీదేవిపల్లిలో 2019లో 24 పేర్లతో నమోదు చేసిన కేసులో ఆ తర్వాత యుఎపిఎ చేర్చారు. 2019 అక్టోబరులో చర్ల పోలీసు స్టేషనులో 45 పేర్లతో నమోదైన ఎఫ్ఐఆర్‌ను 70 పేర్లకు విస్తరించారు. అదే నెల గద్వాలలో మొదట ఎనిమిది పేర్లతో నమోదైన ఎఫ్ఐఆర్‌ను తర్వాత 37 పేర్లకు విస్తరించారు. 2020 నవంబరులో ఎల్.బి.నగర్ పోలీసు స్టేషనులో 10 పేర్లతో తయారైన ఎఫ్ఐఆర్‌ను ఇప్పుడు 94 పేర్లకు విస్తరించారు. నల్లకుంట పోలీసు స్టేషన్‌లో 2019 నవంబరులో నలుగురితో మొదలైన కేసులో ఇప్పటికి ఎంత మంది ఉన్నారో, ఇంకా ఎంతమందిని చేర్చనున్నారో తెలియదు. 2020 ఫిబ్రవరిలో వెంకటాపురం పోలీస్ స్టేషనులో 21 పేర్లతో ఎఫ్ఐఆర్ తయారు చేశారు. ఇప్పుడు తాజాగా బైటపడిన 2022 ఆగస్ట్ కేసులో తాడ్వాయి పోలీస్ స్టేషన్ ఎఫ్ఐఆర్‌లో 152 పేర్లు ఉన్నాయని అందరికీ తెలుసు. అంతకు ముందే తాడ్వాయిలోనే 2020లో నమోదైన కేసులో కన్ఫెషన్ స్టేట్‌మెంటుల మీద ఆధారపడి వందకు పైగా పేర్లను ఇరికించారు. ఇలా ప్రస్తుతానికి లెక్క తేలుతున్న 10 యుఎపిఎ కేసులలో దాదాపు 500 పేర్లు (కొందరి పేర్లు నాలుగైదు ఎఫ్ఐఆర్‌లలో రాశారు గనుక బహుశా 250–300 మంది) ఈ జాబితాల్లో ఉన్నాయి. ఇక యుఎపిఎ లేని కేసులు మరొక డజను అయినా ఉన్నాయి. వాటిలో మరికొన్ని పేర్లున్నాయి.

మొత్తం మీద ఇవాళ రెండు మూడు వందల మంది తెలంగాణ బిడ్డల మెడమీద కత్తి వేలాడుతున్నది. ఏదో నేరం చేసినందుకు కాదు, కనీసం ఏదైనా ఒక ఘటనలో, చర్యలో పాల్గొన్నందుకు కాదు. కేవలం కొన్ని భావాలు కలిగి ఉన్నందుకు, వాటిని రాతలోనో, మాటలోనో వ్యక్తం చేసినందుకు. ఆ వ్యక్తీకరణ కూడ లేకపోయినా తమకు నచ్చిన ఏదో ఒక సంస్థలో ఉన్నందుకు. ఇలా వాక్సభా స్వాతంత్ర్యాలను, సంఘంలో ఉండే స్వేచ్ఛను, అంటే భారత రాజ్యాంగ అధికరణం 19ని పాటించినందుకు మెడమీద కత్తి వేలాడదీయడం తెలంగాణ దశాబ్ది సాధించిన విజయం.

**ఇవాళ రెండు మూడు వందల మంది తెలంగాణ బిడ్డల మెడమీద కత్తి వేలాడుతున్నది. ఏదో నేరం చేసినందుకు కాదు, కనీసం ఏదైనా ఒక ఘటనలో, చర్యలో పాల్గొన్నందుకు కాదు. కేవలం కొన్ని భావాలు కలిగి ఉన్నందుకు, వాటిని రాతలోనో, మాటలోనో వ్యక్తం చేసినందుకు. ఆ వ్యక్తీకరణ కూడ లేకపోయినా తమకు నచ్చిన ఏదో ఒక సంస్థలో ఉన్నందుకు.**





• ఎన్ వేణుగోపాల్

---

## ఉచిత సీట్లు కేటాయించాలి

ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో ఎటువంటి రుసుము తీసుకోకుండా 20 శాతం సీట్లు విద్యార్థులకు కేటాయించాలని విద్యాహక్కు చట్టం–––2009 చెబుతోంది. ఇందులో పేద, మధ్య తరగతి, బడుగు బలహీనవర్గాలనే తారతమ్యం లేకుండా ఈ సీట్లను కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అయితే ఈ సీట్ల కేటాయింపును తెలుగు రాష్ట్రాల్లోని ఆయా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల ఏ మాత్రం అమలు చేసిన దాఖలాలు లేవు. చట్టంలోని అంశాలు, నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకునే అధికారం విద్యాశాఖకు ఉంది.

**– తలారి గణేష్**

## అశ్లీలతను అరికట్టాలి

నేడు జనాలు ఓటీటీలు వచ్చాక సినిమాలని థియేటర్‌కి వెళ్లి చూడడం తగ్గించేసి, కుటుంబ సమేతంగా ఇంట్లోనే చూస్తున్నారు. ఓటీటీలకి సెన్సార్ కట్‌లు లేకపోవడం వల్ల తమ వ్యూస్ కోసం కొన్ని సినిమాలని, వెబ్ సిరీస్‌లను అశ్లీలతతో కూడిన కంటెంట్‌తో డైరెక్ట్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఇలాంటి వాటిని కుటుంబ సమేతంగా చూసేటప్పుడు చాలా ఇబ్బందిగా ఉంటుంది. పైగా ఇప్పుడు చిన్న పిల్లలు, పెద్దవారు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంది. వీటిని చూడడం వల్ల పిల్లలు పెడదారి పట్టే అవకాశం ఉంది. కాబట్టి ఓటీటీలని సెన్సార్‌షిప్ పరిధిలోకి తెచ్చి అశ్లీలతను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**–బోయ భీమేష్**




# టెలిగ్రామ్‌లో ఫేస్‌బుక్ తరహా సేవలు




**న్యూఢిల్లీ:** టెలిగ్రామ్ యాప్‌లో మెసేజింగ్‌తో పాటు ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను ఇతరులతో షేరు చేసుకోవచ్చు. యూజర్ల గోప్యత కోసం సీక్రెట్ చాట్ ఫీచర్ కూడా ఉంది. తాజాగా మరో కొత్త ఫీచర్‌ను యూజర్లకు పరిచయం చేయనున్నట్లు టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ తెలిపారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తరహాలో టెలిగ్రామ్‌లో కూడా స్టోరీస్ ఫీచర్‌ను తీసుకు వస్తున్నట్లు ప్రకటించారు. టెలిగ్రామ్‌లో స్టోరీస్ ఫీచర్‌ను పరిచం చేయాలని చాలా కాలంగా యూజర్లు కోరుతున్నారని, ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. చాలా సోషల్ మీడియా యాప్‌లలో స్టోరీస్‌ను పరిచయం చేసినందున టెలిగ్రామ్‌లో ఈ ఫీచర్ వద్దని ముందు అనుకున్నట్లు తెలిపారు. యూజర్లు ఎక్కువ మంది ఈ ఫీచర్ కావాలని కోరుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జులై నుంచి టెలిగ్రామ్‌లో స్టోరీస్ ఫీచర్ అందుబాటులో ఉంటుందని పావెల్ దురోవ్ తెలిపారు. యూజర్లు టెలిగ్రామ్ యాప్‌లో స్టోరీస్‌ను పోస్ట్ చేసిన తరువాత వాటిని ఎవరెవరు చూడాలనేది నిర్ణయించుకోవచ్చు. ఇందుకోసం యూజర్లు స్టోరీస్ సెట్టింగ్స్‌లో ఎవ్రీవన్, ఓన్లీ యువర్ కాంట్రాక్ట్స్, వ్యూ సెలెక్టెడ్ కాంటాక్ట్స్, లిస్ట్ ఆఫ్ క్లోజ్ ఫ్రెండ్స్ ఈ నాలుగు ఆప్షన్లలో తమను నచ్చిన దాన్ని ఎంపిక చేసుకోవచ్చు.




## హెచ్‌డీఎఫ్‌సీ-హెచ్‌డీఎఫ్‌సీ
# బ్యాంక్ విలీనం

- జులై 1 నుంచి అమల్లోకి
- డీల్ విలువ 40 బిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీలో మార్టిగేజ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ విలీనం కానుంది. ఈ రెండు సంస్థల విలీనం కోసం అన్ని అనుమతులు పూర్తి చేసుకోవడంతో జులై 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. జూన్ 30న ఇరు సంస్థల బోర్డులు సమావేశమై విలీనానికి ఆమోదం తెలియచేస్తాయని హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్ తెలిపారు. విలీనం తరువాత హెచ్‌డీఎఫ్‌సీ స్టాక్ డీలిస్టింగ్ ప్రక్రియ జులై 13 నుంచి ప్రారంభం కానుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో విలీనానికి గత సంవత్సరం ఏప్రిల్ 4న అంగీకారం కుదిరింది. ఈ రెండు సంస్థల విలీనానికి సెబీ, సీసీఐ, ఆర్బీఐ సహా పలు ఇతర నియంత్రణ సంస్థలు ఆమోదం తెలిపాయి. కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతి పెద్ద విలీనం. దీని విలువ 40 బిలియన్ డాలర్లు.

విలీనం తరువాత రెండు సంస్థల ఆస్తుల విలువ 18 లక్షల కోట్లకు చేరనుంది. విలీనం తరువాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీకి 41 శాతం వాటా ఉంటుంది. విలీనం తరువాత హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్‌గా ఇది కొనసాగనుంది. విలీనం తరువాత హెచ్‌డీఎఫ్‌సీకి చెంది 60 సం వత్సరాలలోపు ప్రతి ఉద్యోగిని కొనసాగిస్తామని ఛైర్మన్ దీపక్ పరేఖ్ స్పష్టం చేశారు. వీరు ప్రస్తుతం పొందుతున్న వేతనాలను కూడా తగ్గించబోమన్నారు. విలీనం తరు వాత ప్రపంచంలోనే 10వ అతి పెద్ద బ్యాంక్‌గా హెచ్‌డీఎఫ్‌సీ అవతరించనుంది. 25 షేర్లు కలిగి ఉన్న ప్రతి హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన షేర్లు హోల్డర్లకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన 42 షేర్లు లభిస్తాయి. ఈ రెండు సంస్థల విలీనం అమల్లోకి వస్తుందన్న వార్తలతో స్టాక్ మార్కెట్లు ఈ రెండు సంస్థల షేర్లు భారీగా లాభపడ్డాయి.

## హిండెన్‌బర్గ్ నివేదిక అంతా
# తప్పులమయం



### గతంలో కంటే మా గ్రూపు ఆర్థికంగా పటిష్టంగా ఉంది

- రుణభారాన్ని తగ్గించుకుంటున్నాం
- సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేందుకు తప్పుడు సమాచారం ఇచ్చారు
- అవకతవకలు జరగలేదని సుప్రీంకోర్టు కూడా చెప్పింది
- మేం చెప్పినా వినకుండా అవకాశవాదులు రెచ్చిపోయారు
- తప్పుడు కథనాలతో ప్రచారం చేశారు
- వార్షిక నివేదికలో గౌతమ్ అదానీ

**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్ సంస్థలపై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ వెలువరించిన నివేదికపై ఐదు నెలల తరువాత సంస్థ అధినేత గౌతమ్ అదానీ స్పందించారు. ఈ నివేదికలో చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని, తప్పుడు ఆరోపణలని ఆయన తోసిపుచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి తప్పుడు సమాచారాన్ని హిండెన్‌బర్గ్ నివేదికలో పొందుపరిచారని ఆరోపించారు. సంస్థ నిర్వాహణ, డిస్‌క్లోజర్ ప్రవమాణాలు పటిష్టంగా ఉన్నాయని గౌతమ్ అదానీ వార్షిక నివేదిక విడుదల సందర్భంగా షేర్ హోల్డర్లకు తెలిపారు. హిండెన్‌బర్గ్ నివేదిక గ్రూప్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు వెల్లడించారని విమర్శించారు. ప్రస్తుతం అదానీ గ్రూప్ గతం కంటే ఆర్థికంగా బలంగా ఉందని, రుణ భారాన్ని తగ్గించుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశం లోనే అతి పెద్ద ఫాలోఆన్ పబ్లిక్ ఇష్యూ (ఎఫ్‌పీఓ) ప్రకటించిన సమయంలో హిండెన్‌బర్గ్ జనవరి 24న నివేదిక వెలువరించిందని, దీంతో దీన్ని వెనక్కి తీసుకుని ఇన్వెస్టర్లకు డబ్బులు వాపసు చెల్లించామని అదానీ తెలిపారు. హిండెన్‌బర్గ్ నివేదికతో అదానీ గ్రూప్ సంస్థల షేర్లన్నీ భారీగా పతనం అయ్యాయి. గ్రూప్ మార్కెట్ విలువ ప్రస్తుతం 10 లక్షల కోట్లకుదిగువకు పడిపోయింది. అదానీ గ్రూప్ మోసపూరిత లావాదేవీలు నిర్వహిస్తోందని, స్టాక్ ధరలను తారుమారు చేయడం వంటి అవకతవకలకు పాల్పడిందని, షెల్ కంపెనీల ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నదని తీవ్రమైన ఆరోపణలు చేసింది.

ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండిచినప్పటికీ స్టాక్ మార్కెట్‌లో గ్రూప్ కంపెనీల షేర్ల పతనం కొనసాగింది. ఇన్వెస్టర్లలో విశ్వాసం నెలకొల్పేందుకు రుణాలను ముందుగానే చెల్లించడం ప్రారంభించింది. అమెరికా, బ్రిటన్, సింగాపూర్ వంటి దేశాల్లో రోడ్‌షోలను నిర్వహించింది. ఎఫ్‌పీఓను కూడా ఉపసంహరించుకుంది. అమెరికా షర్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ నివేదికతో కంపెనీ అనేక ప్రతికూల పరిణామాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని అదానీ గ్రూప్ తన వార్షిక నివేదికలో షేరు హోల్డర్లకు తెలిపింది. అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టిన అమెరికా ఇన్వెస్టర్ల నుంచి ఆ దేశ నియంత్రణ సంస్థలు సమాచారం కోరినట్లు వచ్చిన వార్తలతో గత వారం అదానీ గ్రూప్ సంస్థల షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ కూడా గ్రూప్ ఎలాంటి అవకతవకలకు పాల్పడినట్లు ఆధారాలు లభించలేదని తెలిపిందని గౌతమ్ అదానీ పేర్కొన్నారు. మన దేశ స్టాక్ మార్కెట్లను అస్థిరపరిచేందుకే ఇలాంటి నివేదికను వెలువరించారని ఆయన ఆరోపించారు. అదానీ గ్రూప్‌పై విచారణ జరుపుతున్న సెబీ ఇంకా తన నివేదికను సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఈ నివేదికతో అనేక ప్రతికూల పరిణామాలకు దారితీసిందని చెప్పారు. దీనిపై వెంటనే ఖండన జారీ చేసినప్పటికీ దీన్ని అవకాశంగా తీసుకున్న అవకాశవాదులు తమ స్వార్థప్రయోజనాలకు ఉపయోగించుకునేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. వివిధ వార్తలు, సోషల్ మీడియాలోనూ తప్పుడు కథనాలు ప్రచారం చేశారని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి పునాది వేయాలంటే స్థిరమైన ప్రభుత్వం చాలా కీలకమని ఆదానీ అభిప్రాయపడ్డారు. దేశంలో కీలకమైన, బలమైన, స్థిరమైన సమతుల్య వృద్ధికి అవసరమైన అనేక సంస్కరణలను అమలు ప్రభావాన్ని చూసినట్లు తెలిపారు. ఈ సుస్థిర దేశ వృద్ధికి, దేశీయంగా డిమాండ్ పెరగడానికి దోహదం చేస్తుందన్నారు.



## వేగంగా వృద్ధి చెందుతున్న
## దేశీయ ఈవీ టూ వీలర్ పరిశ్రమ

**న్యూఢిల్లీ:** ఫేమ్ 2 సబ్సిడీలో కేంద్ర ప్రభుత్వం కోత విధించినప్పటికీ కేంద్ర, రాష్ట్రా ల సానుకూల విధానాలతో దేశంలో విద్యుత్ టూ వీలర్ల పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్నదని టీవీఎస్ మోటార్ కంపెనీ అభిప్రాయపడింది. మన దేశం ఎలక్ట్రిక్ టూ వీలర్ ఎగుమతుల హబ్‌గా మారుతుందని తెలిపింది. ప్రస్తుతం టీవీఎస్ ఐక్యూబ్ పేరుతో విద్యుత్ స్కూటర్‌ను విక్రయిస్తోంది. వివిధ కేటగిరి కస్టమర్ల కోసం కంపెనీ పలు మోడల్స్‌లో విద్యుత్ వాహనాలను తీసుకు రానుంది.

దేశంలో ఈవీ పరిశ్రమ గణనీయంగా వృద్ధి చెందుతున్నట్లు టీవీఎస్ తన వార్షిక నివేదికలో పేర్కొంది. కేంద్రం ఉత్పత్తి ఆదారిత స్కీమ్ (పీఎల్‌ఐ) ఫేమ్ 2 సబ్సిడీ స్కీమ్‌తో పాటు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సానుకూల విధానాలను అనుసరిస్తున్నాయని, దీని వల్ల దేశంలో విద్యుత్ వాహనాల పరిశ్రమ మంచి వృద్ధిని నమోదు చేస్తుందని తెలిపింది. ఇలాంటి విధానాల మూలంగా దేశీయ మార్కెట్‌లో అమ్మకాలు పెరగడంతో పాటు, ఎగుమతులు పెరుగుతాయని అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం పేమ్ 2 సబ్సీడిని ఒక కిలోవాట్‌కు ఇచ్చే సబ్సిడీని ప్రస్తుతం 10వేలకు పరిమితం చేసింది. అంతుకు ముందు ఇది 15 వేలు నుంచి 40 వేల వరకు ఉంది. టీవీఎస్ త్వరలోనే ఐక్యూట్‌లనే కొత్త వేరియంట్స్‌ను తీసుకురానుందని, దీనితో పాటు కొత్త విద్యుత్ టూ వీలర్ వాహనాలను మార్కెట్‌లోకి తీసుకు వస్తున్నట్లు ప్రకటించింది. టీవీఎస్ ఐక్యూబ్ ప్రస్తుతం 130 నగరాలు, పట్టణాల్లో అందుబాటులో ఉందని, ఈ సంఖ్యను రానున్న కాలంలో మరింత పెంచనున్నట్లు తెలిపింది. ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య ప్రస్తుతం 2వేల వరకు ఉన్నాయని వీటిని కూడా గణనీయంగా పెంచనున్నట్లు తెలిపింది. టీవీఎస్ మోటార్స్ బీఎండబ్ల్యూతో చేసుకున్న ఒప్పందం మూలంగా త్వరలోనే ప్రపంచ మార్కెట్ల కోసం ప్రత్యేక డిజైన్‌తో ఎలక్ట్రిక్ టూ వీలర్స్‌ను తీసుకురానున్నట్లు తెలిపింది. దేశంలో మొత్తం టూవీల ర్స్‌లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ టూ వీలర్ల వాటా 4.7 శాతంగా ఉందని కంపెనీ తెలిపింది. టీవీఎస్ 91 వేల విద్యుత్ టూ వీలర్స్‌ను విక్రయించినట్లు తెలిపింది.

## టాటా టెక్నాలజీస్ ఐపీఓకు
# సెబీ అనుమతి

**ముంబై:** టాటా టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఇది పూర్తి ఆఫర్ ఫర్ సేల్ ప్రక్రియ ద్వారా జరగనుంది. ఐపీఓలో భాగంగా 23.6 శాతం వాటాకు సమానమైన 9.57 లక్షల షేర్లను విక్రయించనున్నారు. ఇందులో భాగంగా టాటా టెక్నాలజీస్ మాతృ సంస్థ టాటా మోటార్స్ 8.11 కోట్ల షేర్లను అంటే 20 శాతం వాటాను వదులుకోనుంది. దీంతో పాటు టాటా మోటార్స్ అనుబంధ సంస్థలైన ఆల్ఫా టీసీ హోల్డింగ్స్, టాటా క్యాపిటల్ గ్రోత్ ఫండ్‌కు చెందిన షేర్లను కూడా విక్రయించనున్నారు. టాటా గ్రూప్ నుంచి చివరిసారిగా 2004లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. టాటా గ్రూప్ నుంచి 19 సంవత్సరాల తరువాత మరో ఐపీఓ వస్తోంది. పబ్లిక్ ఇష్యూ కోసం అవసరమైన పత్రాలను టాటా టెక్నాలజీస్ ఈ సంవత్సరం మార్చిలో సెబీకి సమర్పించింది. ఈ పబ్లిక్ ఆఫర్ ద్వారా ఎంత మొత్తం సమీకరిస్తున్నార్న విషయాన్ని కంపెనీ వెల్లడించలేదు. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఐపీఓ ద్వారా 4000 కోట్లు సమీకరించనున్నట్లు తెలుస్తోంది.

# మార్కెట్‌లో బుల్ రన్

### కొనుగోళ్ల మద్దతులో లాభాల్లో సూచీలు

**ముంబై:** మంగళవారం నాడు దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సూచీలు దూసుకుపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనం మార్కెట్లకు కలిసి వచ్చింది. సెనెక్స్ 446.03 పాయింట్ల లాభంతో 63416.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.20 పాయింట్ల లాభంతో 18817.40 వద్ద ముగిసింది. బంగారం 10 గ్రాముల ధర 39 రూపాయలు తగ్గి 58373 వద్ద ట్రేడయ్యింది. వెండి కిలో ధర 312 రూపాయలు పెరిగి 69497 వద్ద ట్రేడయ్యింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 81.95 రూపాయలుగా ఉంది.



### లాభపడిన షేర్లు

ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, టాటా స్టీల్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, విప్రో, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎం అండ్ ఎం, టీసీఎస్, టైటాన్ కంపెనీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అపోలో ఆస్పటల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దివిస్ ల్యాబ్, ఓఎన్‌జీసీ, బీపీసీఎల్, కోల్ ఇండియా, బజాజ్ ఆటో షేర్లు లాభపడ్డాయి.

### నష్టపోయిన షేర్లు

మారుతీ సుజుకీ, ఐటీసీ, హిందూస్థాన్‌యూనిలీవర్, నెస్లే ఇండియా, హీరోమోటోకార్ప్, ఐచర్ మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, బ్రిటానియా ఇండస్ట్రీస్, సిప్లా షేర్లు నష్టపోయాయి.

## తగ్గిన కరెంట్ ఖాతా లోటు




**ముంబై:** మన దేశ కరెంట్ ఖాతా లోటు 2022-23 ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికంలో తగ్గినట్లు ఆర్బీఐ ప్రకటించింది. సర్వీసెస్ ఎగుమతులు పెరగడంతో ఇది తగ్గినట్లు తెలిపింది. ఈ త్రైమాసికంలో ఈ లోటు 1.3 బిలియన్ డాలర్లు తగ్గి 13.4 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రధానంగా వాణిజ్యలోటు తగ్గడంతో కరెంట్ ఖాతా లోటు తగ్గినట్లు తెలిపింది. వాణిజ్యలోటు అంతకు ముందు 71.3 బిలియన డాలర్లగా ఉన్నది, 4వ త్రైవమాసికంలో 52.6 బిలియన్ డాలర్లకు తగ్గింది. సంవత్సరం క్రితం కంటే నికర ఆదాయం ఎక్కువగా బయటకు వెళ్లినప్పటికీ, సేవల నికర ఎగుమతులు, నికర ప్రైవేట్ బదిలీ రసీదుల కారణంగా నెట్ రిసీట్స్ ఎక్కువగా ఉన్నట్లు ఆర్బీఐ తెలిపింది.

4వ త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)లు 6.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో వచ్చిన 13.8 బిలియన్ డాలర్ల కంటే ఇది తక్కువగా ఉంది. మొత్తం ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 28.0 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2021-22లో ఇవి 38.6 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని ఆర్బీఐ తెలిపింది. నికర విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్ట్‌మెంట్స్ (ఎఫ్‌పీఐ) నాలుగవ త్రైమాసికంలో 1.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌పీఐలు 5.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని తెలిపింది. ఇవి అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో 16.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని ఆర్బీఐ తెలిపింది. విదేశాల్లో ఉన్న ఇండియన్స్ దేశానికి పంపిస్తున్న నిధులు20.8 శాతం పెరిగి 28.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కరెంట్ ఖాతా లోటు జీడీపీలో 1.5 శాతం వరకు ఉంటుందని ఆర్బీఐ అంచనా వేసింది. ముడి చమురు ధరలు తగ్గుతున్నందున కరెంట్ ఖాతా లోటు తగ్గుతుందని భావిస్తున్నట్లు ఆర్బీఐ పేర్కొంది.



## ఖరీదైన ఇంటిని కొనుగోలు చేసిన
# భారతీయ ఫ్యామిలీ

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదై విల్లాను భారత సంతతికి చెందిన పంకజ్ ఓస్వాల్, ఆయన భార్య రాధిక ఓస్వాల్ స్విట్జర్లాండ్‌లో కొనుగోలు చేశారు. విల్లా వారీగా పిలుస్తున్న ఈ ఇంటికి వీరు 1,649 కోట్లకు కొనుగోలు చేశారు. అత్యంత ప్రశాంతమైన గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ విల్లా మంచుత కప్పబడే మౌంట్ బ్లాంక్ శిఖరాలను వీక్షించడానికి అనువుగా ఉంది. మొత్తం 4.3 లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో దీన్ని నిర్మంచారు. అత్యంత విలాసవంతమైన ఈ భవనం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా ఉంది. ఈ భవనాన్ని ఎంతో ఇష్టపడి కొనుగోలు చేసినట్లు పంకజ్ ఓస్వాల్, రాధిక ఓస్వాల్ చెప్పారు. ఈ విల్లాను ప్రముఖ గ్రీక్ షిప్పింగ్ బిజినెస్ టైకూన్ అరిస్టాటిల్ ఒనాసిస్ కుమార్తె క్రిస్టినా ఒనాసిస్ నుంచి వీరు కొనుగోలు చేశారు. ఈ ఇంటిని పూర్తిగా తమ అభిరుచికి అనుగుణంగా రెన్నోవేట్ చేయనున్నట్లు వారు తెలిపారు. ఓస్వాల్ ఆగ్రో మిల్స్‌ను స్థాపించిన అభయ్ కుమార్ ఒస్వాల్ కుమారుడు పంకజ్ ఓస్వాల్, ప్రస్తుతం ఈ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా పెట్రోకెమికల్స్, రియల్ ఎస్టేట్, ఫెర్టిలైజర్స్, మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2016 నుంచి పంజక్ ఓస్వాల్ కంపెనీ బాధ్యతలు చూస్తున్నారు.

## తిరిగి మార్కెట్‌లోకి వస్తున్న
## మైక్రోమ్యాక్స్, కార్బన్ మొబైల్ బ్రాండ్స్

**కోల్‌కతా:** దేశీయ బ్రాండ్లుగా ఉన్న మైక్రోమ్యాక్స్, కార్బన్, లావా మొబైల్ ఫోన్లు మళ్లీ మార్కెట్‌లో భారీ స్థాయిలో రానున్నాయి. చైనా ఫోన్ల ప్రవేశంతో ఈ కంపెనీల ఫోన్ల అమ్మకాలు పడిపోవడంతో ఇవి ఉత్పత్తిని నిలిపివేశాయి. ప్రస్తుతం అన్ని చైనా మొబైల్ కంపెనీలు ప్రభుత్వం నిఘాలో ఉండటంతో పాటు, 8వేల లోపు స్మార్ట్ సెగ్మెంట్‌లో ఈ కంపెనీలు పెద్దగా మోడల్స్‌ను మార్కెట్‌లోకి తీసుకు రావడంలేదు. ఈ కంపెనీలు ప్రస్తుం ప్రీమియం ఫోన్లపై దృష్టి కేంద్రీకరించాయి.

ప్రస్తుతం స్మార్ట్ మార్కెట్‌లో పెద్ద కంపెనీల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. దీన్ని తట్టుకోవాలంటే ఈ కంపెనీలు టెక్నాలజీపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నారు. చైనా కంపెనీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో ప్రస్తుతం చైనా కంపెనీలైన షావోమీ, రియల్‌మీ, ఒప్పో, వివో, వన్ ప్లస్ కంపెనీలదే అగ్రస్థానం. మరో విదేశీ కంపెనీ శామ్‌సంగ్ మొబైల్స్ కూడా మంచి మార్కెట్ వాటా కలిగి ఉంది. చైనా మొబైల్ కంపెనీలు రానున్న రోజుల్లో 10వేలలోపు ధరలో 5జీ స్మార్ట్ ఫోన్లను మార్కెట్‌లో లాంచ్ చేయనున్నాయి. ప్రస్తుతం చైనా మొబైల్స్ కంపెనీల మార్కెట్ వాటా 81 శాతంగా ఉంది. లోకల్ బ్రాండ్‌ఫోన్ల మార్కెట్ 1 శాతంగా మాత్రమే ఉంది. తిరిగి మార్కెట్‌లోకి ప్రవేశించాలని భావిస్తున్న మైక్రోమ్యాక్స్, కార్బన్, లావా కంపెనీలు ఆర్ అండ్ డీపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉందని పరిశ్రమ నిపుణులు సూచిస్తున్నారు. ఎంట్రీ లెవల్ ఫోన్లలో ఎక్కువ ఫీచర్లు అందించగలిగితే వీటికి మార్కెట్‌లో ఆదరణ ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



## విశాఖ ఉక్కుకు
# జాతీయస్థాయి అవార్డు

**ఉక్కునగరం,(విశాఖపట్నం) (అక్షర సవాల్ ):** ఖర్చు నిర్వహణలో అవలంబించిన అత్యుత్తమ చర్యలకు గాను ప్రతిష్టాత్మక 18వ జాతీయ అవార్డులు-2022లో ఆర్ ఐ ఎన్ ఎల్(విశాఖ ఉక్కు)మొదటి స్థానాన్ని (నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్) కైవసం చేసుకుంది. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నుండి 18వ జాతీయ కాస్ట్ మేనేజ్‌మెంట్-2022 ఎక్సలెన్స్ అవార్డులలో తయారీ - పబ్లిక్ - మెగా విభాగంలో ఆర్ ఐ ఎన్ ఎల్ ప్రతిష్టాత్మకమైన మొదటి స్థానాన్ని గెలుచుకుంది.నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా సమర్థవంతమైన , వినూత్న వ్యయ నిర్వహణ పద్ధతులను అమలు చేసిన సంస్థలను గుర్తించి, గౌరవించటానికి గాను 2003లో ఈ అవార్డ్ జాతీయ స్థాయిలో స్థాపించబడింది. ఇంతకూ ముందు కూడా ఆర్ఐ ఎన్ఎల్ ఖర్చు నిర్వహణలో అత్యుత్తమ ప్రతిష్టాత్మకమైన 17వ జాతీయ అవార్డులు-2019లో కూడా తయారీ - పబ్లిక్ - మెగా కేటగిరీ లో మొదటి స్థానాన్ని గెలుచుకుంది. భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్ బహ్లా నుండి ఆర్ఐ ఎన్ఎల్ తరపున ఉక్కు సిజిఎం(ఎఫ్ అండ్ ఏ) వి .శాంత కుమార్, డిజిఎమ్(ఎఫ్ అండ్ ఏ) డి చిన్నారావు లు ఈ ప్రత్యేక బహుమతిని న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అందుకున్నారు. కాగా, ప్రతిష్టాత్మకమైన 18వ జాతీయ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్-2022లో జాతీయ స్థాయిలో మొదటి బహుమతిని గెలుచుకున్నందుకు మొత్తం సిబ్బందిని ఆర్ ఐ ఎన్ ఎల్ సీఎండీ అతుల్ భట్ ప్రత్యేకంగా అభినందించారు.

## బంగ్లాదేశ్‌లో
## అమర్‌రాజాకు సోలార్ ప్రాజెక్ట్




### విలువ 130 మిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ:** అమర్‌రాజా గ్రూప్‌కు చెందిన అమర్‌రాజా ఇన్‌ఫ్రా సంస్థ బంగ్లా దేశ్‌లో 130మ మిలియన్ డాలర్ల విలువైన సోలార్ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ దక్కించుకుంది. ఈ కాంట్రాక్ట్‌తో సంస్థ అంతర్జాతీయ సోలార్ మార్కెట్‌లోకి ప్రవేశించిందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. కాంట్రాక్ట్‌లో భాంగా 100 మెగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పీవీ పవర్ ప్లాంట్‌ను సంస్థ నిర్మించనుంది. ఇందులో ప్రాజెక్ట్ ఇంజినీరింగ్, డిజైన్, సప్లయ్, ఇన్‌స్టాలేషన్, కమిషనింగ్ వంటికి ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా దీనికి నిధులు సమకూర్చుతున్నది. అమర్‌రాజా ఇన్‌ఫ్రా హైదరాబాద్‌కు చెందిన ప్రిమియర్ సోలార్‌తో జత కటింది. బంగ్లాదేశ్‌కు చెందిన రూరల్ పవర్ కంపెనీ (ఆర్‌పీసీఎల్) నుంచి ఈ కాంట్రాక్ట్ సాధించింది. ఈ సోలార్ పవర్ ప్లాంట్‌ను 326 ఎకరాల విస్తీర్ణంలో 18 నెలల కాలంలో నిర్మించనున్నారు. ఈ ప్లాంట్ పూర్తయిన తరువాత అమర్‌రాజా ఇన్‌ఫ్రా సంస్థ రెండు సంవత్సరాల పాటు ఆపరేషన్ అండ్ మెంటెనెన్స్ సేవలు అందించనుంది.



## మూడు కోట్ల
## మైలురాయిని దాటిన యాక్టివా

**న్యూఢిల్లీ:** హోండా మోటార్ సైకిల్స్ అండ్ స్కూటర్ ఇండియాకు చెందిన యాక్టివా స్కూటర్ అమ్మకాల్లో సరికొత్తరికార్డ్ నెలకొల్పింది. దేశంలో అమ్మకాల్లో అగ్రస్థానంలోఉన్న యాక్టివా 3 కోట్ల కస్టమర్ల మార్క్‌ను అధిగమించిందని కంపెనీ ప్రకటించింది. 2001లో మార్కెట్‌లోకి వచ్చిన యాక్టివా దేశంలో ద్విచక్ర వాహన మార్కెట్‌లో పూర్తి విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిందని కంపెనీ తెలిపింది. ఆధునిక సాంకేతికత, అత్యుత్తమ పనితీరు, సాటిలేని విశ్వసనీయతతో యాక్టివా వాహనదారుల మన్నన పొందినట్లు తెపింది. 5 సంవత్సరాల్లో 10 లక్షల కస్టమర్ల మైలురాయిని అధిగమించింది. 15 సంవత్సరాల్లో కోటి అమ్మకాలు జరిపింది. గడిచిన 7సంవత్సారాల్లో 2 కోట్ల మంది కస్టమర్లు వచ్చారని కంపెనీ తెలిపింది. మొత్తం 22 సంవత్సరాల్లో 3 కోట్ల యాక్టివా కస్టమర్లకు చేరుకుందని తెలిపింది.

## డీసీబీ బ్యాంక్‌లో ఆదాయపన్ను కలెక్షన్




**ముంబై:** కేంద్ర ప్రభుత్వంలో కలిసి న్యూడైరెక్ట్ ట్యాక్స్ కలెక్షన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. పన్ను చెల్లి ంపుదారులకు, ఆదాయపన్ను రిటర్న్స్ దాఖలు చేసేందుకు బ్యాంక్ సింగిల్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. బ్యాంక్ కస్టమర్లు పన్నులను క్యాష్ రూపంలో, చెక్, డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించ వచ్చని తెలిపింది. ఆదాయపన్ను శాఖ ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో అకౌంట్ ఓపెన్ చేయడం ద్వారా ఫైలింగ్ పూర్తి చేయవచ్చని తెలిపింది.

## ఎంఎస్ఎంఈల కోసం వాల్‌మార్ట్ వారధి

**న్యూఢిల్లీ:** ఎంఎస్ఎంఈ సంస్థలు, కంపెనీల వ్యాపార వృద్ధి కోసం వాల్‌మార్ట్ వారధి పేరతో శిక్షణా కార్యక్రమాలు చేపట్టింది. ఇప్పటి వరకు 32 వేల ఎంఎస్ఎంఈలకు ఈ శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. వాల్‌మార్ట్ వారధి సప్లయర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను 2019లో ప్రారంభించినట్లు తెలిపింది. ఈ శిక్షణ తరువాత ఫ్లిప్‌కార్ట్‌లో 6వేలకు పైగా ఎంఎస్ఎంతీలు తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నట్లు తెలిపింది. 2028 నాటికి భారత జీడీపీ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా వేశారని, అందులో ఎంఎస్ఎంఈల వాటా లక్ష కోట్ల డాలర్లుగా ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపింది. ఈ శిక్షణ మూలంగా స్థానిక వ్యాపారులు తమ ఉత్ప త్తులను విక్రయించుకునేందుకు అవకాశం లభించిందని పేర్కొంది. మార్కెటింగ్, ఫైనాన్స్, సప్లయ్ వంటి వివిధ అంశాలపై ఇచ్చిన శిక్షణ వారికి ఉపయోగపడిందని తెలిపింది.



## ఉమేశ్‌ను తప్పించలేదు..

**న్యూఢిల్లీ:** పేసర్ ఉమేశ్ యాదవ్ గాయంతో బాధపడుతున్నందుకే వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక చేయలేదని బీసీసీఐ వర్గాల సమాచారం. అతను ప్రస్తుతం బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో కోలుకుంటున్నాడు. ఆసీస్‌తో జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఉమేశ్ రెండు వికెట్లు మాత్రమే తీసి నిరాశపరిచాడు. అలాగే విండీస్‌తో జరిగే ఐదు టీ20ల సిరీస్‌కు కేకేఆర్ స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ ఎంపికయ్యే అవకాశం ఉంది.

## ఎంసీసీ కమిటీలో జులన్

**న్యూఢిల్లీ:** భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ పేసర్ జులన్ గోస్వామికి అరుదైన గౌరవం దక్కింది. ప్రస్తుత, మాజీ అంతర్జాతీయ క్రికెటర్లతో కూడిన ఎంసీసీ వరల్డ్ క్రికెట్ కమిటీ (డబ్ల్యూసీసీ)లో ఆమెకు సభ్యత్వం దక్కింది. జులన్‌తో పాటు ఇంగ్లండ్‌కు చెందిన హీథర్ నైట్, ఇయాన్ మోర్గాన్‌లకు కమిటీలోకి స్వాగతం పలుకుతున్నట్టు డబ్ల్యూసీసీ చైర్మన్ మైక్ గ్యాటింగ్ తెలిపాడు.

## 'సర్ఫరాజ్ అలాంటోడు కాదు'

**న్యూఢిల్లీ:** ముంబై క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు భారత జట్టులో చోటు దక్కకపోవడానికి అతడి ఫిట్‌నెస్, నడత కారణమని బోర్డు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కానీ, సర్ఫరాజ్ సన్నిహితులు మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. అతడు ఎప్పుడూ ఎవరితోనూ అమర్యాదగా ప్రవర్తించలేదని చెప్పారు. గత సీజన్‌లో ఢిల్లీతో మ్యాచ్‌లో సెంచరీ స్కోరు చేసినప్పుడు.. సెలెక్టర్‌నుద్దేశించి డ్రెస్సింగ్ రూమ్ వైపు అతడు వేలు చూపించాడనే విమర్శలు వినిపించాయి. కానీ, సహచరులు, కోచ్‌ను ఉద్దేశించి అతడలా చేశాడని సర్ఫరాజ్ సన్నిహితులు తెలిపారు. మ్యాచ్‌ను వీక్షించింది కూడా చీఫ్ సెలెక్టర్ చేతన్ శర్మ కాదని సలీల్ అంకోలా అని వివరించారు.

## బాక్సింగ్ చీఫ్ కోచ్ రాజీనామా



**న్యూఢిల్లీ:** భారత మహిళా బాక్సింగ్ చీఫ్ కోచ్ భాస్కర్ భట్ తన పదవినుంచి తప్పుకొన్నాడు. 'సాయ్' హై పెర్ఫామెన్స్ డైరెక్టర్‌గా భట్ ఇటీవలే నియమితుడయ్యాడు. కొత్త ఉద్యోగంపై ఎక్కువగా దృష్టి సారించేందుకే కోచ్‌గా వైదొలుగుతున్నట్టు భాస్కర్ తెలిపాడు.

## గ్యాంజెస్ మళ్లీ గెలుపు బాట

**దుబాయ్:** గ్లోబల్ చెస్ లీగ్‌లో విశ్వనాథన్ ఆనంద్ ఐకాన్ ప్లేయర్‌గా ఉన్న గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్టు మళ్లీ గెలుపు బాట పట్టింది. సోమవారం జరిగిన ఐదోరౌండ్‌లో గ్యాంజెస్ 14-2తో త్రివేణి కింగ్స్‌ను చిత్తు చేసింది. ఆనంద్ 78 ఎత్తుల్లో అరోనియన్‌పై గెలిచాడు. గ్యాంజెస్ ఆటగాళ్లు మరో ముగ్గురు ప్రత్యర్థులపై నెగ్గగా..ఇద్దరు తమ గేములను డ్రా చేశారు. ఇక ఆరో రౌండ్‌లో బాలన్ అలాస్కన్ నైట్స్ 10-9తో ఎస్‌జీ ఆల్పైన్ వారియర్స్‌పై నెగ్గింది. ఎస్‌జీ ఆల్పైన్ స్టార్, కార్ల్‌సన్ 82 ఎత్తుల సుదీర్ఘ పోరులో నెపోమ్నియాచిపై విజయం సాధించాడు. ఆల్పైన్‌కు చెంది న అర్జున్ ఇరిగేసి...రజబోవ్‌తో గేములో 37 ఎత్తులలోనే డ్రాకు అంగీకరించాడు.

## డబుల్ సెంచరీ దాటించారు

స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ గేమ్స్‌లో భారత అథ్లెట్ల విజృంభణ

**బెర్లిన్:** స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ గేమ్స్‌లో భారత్ పతకాల్లో డబుల్ సెంచరీ కొట్టింది. 76 స్వర్ణ, 75 రజత, 51 కాంస్యాలతో మొత్తం 202 పతకాలతో గేమ్స్‌ను ముగించింది. చివరి రోజు ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో రెండు పసిడి, మూడు రజత, ఒక కాంస్యం లభించాయి. 400 మీ. లెవెల్-బిలో ఆంచల్, 400 మీ. లెవెల్-సిలో రవిమతి ఆర్ముగం బంగారు పతకాలు నెగ్గారు. జావెలిన్ త్రో లెవెల్-బిలో సాకేత్ రజతం దక్కించుకొన్నాడు.

## 1.20 లక్షల అడుగుల ఎత్తులో..

### వరల్డ్‌కప్ ట్రోఫీ ఆవిష్కరణ



మొతేరాలో అద్భుతమైన ల్యాండింగ్

నేటి నుంచి 'విశ్వకప్' వరల్డ్ టూర్

**దుబాయ్:** ప్రతిష్ఠాత్మక ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీని వినూత్న రీతిలో ఆవిష్కరించారు. ప్రత్యేక బెలూన్‌కు కట్టి భూమికి 1.20 లక్షల అడుగుల ఎత్తులో.. అంతరిక్షంలో అందరూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యే విధంగా సోమవారం ట్రోఫీని లాంచ్ చేశారు. అనంతరం ఈ ట్రోఫీని ఫైనల్ వేదిక అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ల్యాండ్ చేశారు. భూ వాతావరణానికి వెలుపల ధగధగా వెలిగిపోతున్న ట్రోఫీకి సంబంధించిన అద్భుతమైన ఫొటోలను ప్రత్యేక కెమెరా సాయంతో షూట్ చేశారు. ఈ ఏడాది అక్టోబరు 5 నుంచి నవంబరు 19 వరకు భారత్‌లో విశ్వకప్ జరగనుంది. మంగళవారం నుంచి మొత్తం 18 దేశాల్లో పర్యటించనున్న వరల్డ్‌కప్ ట్రోఫీ సెప్టెంబరు 4న మళ్లీ భారత్‌కు చేరుకుంటుంది. ట్రోఫీని దేశంలోని అనేక ప్రముఖ ప్రాంతాల్లో పర్యటించేలా ఏర్పాట్లు చేశామని బీసీసీఐ కార్యదర్శి జై షా చెప్పాడు. అంతరిక్షానికి పంపిన తొలి అధికారిక ట్రోఫీ ఇదేనని షా ట్వీట్ చేశాడు.

# పేస్ బలమెంత?



సిరాజ్



సైనీ

వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టును పరిశీలిస్తే ఓ విషయమైతే స్పష్టమవుతోంది. సంధి దశను అధిగమించేందుకు వెటరన్ ఆటగాళ్లను మెల్లగా పక్కనబెట్టి.. యువ రక్తాన్ని ఎక్కించాలనే ఆలోచనలో సెలెక్టర్లు ఉన్నట్టు అర్థమవుతోంది. ఎందుకంటే కొన్నేళ్లుగా టెస్టు జట్టుకు మూలస్తంభంలా నిలిచి.. నయా వాల్‌గా పిలిపించుకున్న చటేశ్వర్ పుజార, సీనియర్ పేసర్ ఉమేశ్ యాదవ్‌లను పక్కకు తప్పించి యువ ఆటగాళ్లు యశస్వీ జైస్వాల్, రుతురాజ్‌లకు కొత్తగా చోటు కల్పించారు. అలాగే పేసర్ నవ్‌దీప్ సైనీకి చాలా రోజుల తర్వాత పిలుపు అందింది. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. విండీస్‌తో సిరీస్‌కు పేస్ దళాన్ని పరిశీలిస్తే కాస్త బలహీనంగానే కనిపిస్తోంది. మహ్మద్ షమికి విశ్రాంతినివ్వడంతో మరో పేసర్ మహ్మద్ సిరాజ్‌పైనే అధిక భారం పడనుంది. అదే 2021-23 డబ్ల్యూటీసీని పరిశీలిస్తే.. బుమ్రా, షమి, సిరాజ్‌లతో పాటు ఇతర బౌలర్లు కూడా సిద్ధంగా ఉండేవారు. బుమ్రా గాయంతో దూరమైనప్పుడు శార్దూల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్ బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఉనాద్కట్, సైనీ, ముకేశ్ కుమార్‌లాంటి పేసర్లు తమ చాన్స్ కోసం ఎదురుచూస్తున్నా వీరికి అనుభవం లేదు. వీరంతా కూడా చివరి డబ్ల్యూటీసీ సైకిల్ లోనూ తమ వంతు కోసం వేచి చూసినవారే. ఈసారి వీరికి తగిన అవకాశం సెలెక్టర్లు కల్పించవచ్చు.

### దులీప్ ట్రోఫీ చక్కటి చాన్స్

ఈనెల 28న బెంగళూరులో ఆరంభమయ్యే దులీప్ ట్రోఫీ పేసర్ల సమస్యకు పరిష్కారం చూపే అవకాశం ఉంది. భవిష్యత్‌లో జట్టుకు ఉపయోగపడేలా ఎవరిని తీర్చిదిద్దాలనే విషయమై సెలెక్టర్లు ఓ అంచనాకు రావచ్చు. ఈ జోనల్ టోర్నీలో పాల్గొనే ఆయా జట్లలో కవేరప్ప, వైషాక్, యష్ ఠాకూర్, వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, అర్జాన్, చేతన్ సకారియా, ఇషాన్ పోరెల్ రూపంలో నాణ్యమైన బౌలర్లు ఉన్నారు. ఇందులో రాణించి భారత్ 'ఏ' జట్లకు ఎంపిక కావాలని వారంతా చూస్తున్నారు. మరోవైపు అర్ష్‌దీప్ సింగ్‌ను పరిమిత ఓవర్ల బౌలర్‌గా చూస్తున్నారు కానీ అతను కూడా సుదీర్ఘ ఫార్మాట్‌కు పనికివచ్చే పేసర్ అని విశ్లేషకుల అంచనా. ప్రస్తుతం అతను కౌంటీ మ్యాచ్‌లలో ఆడుతుండడం విశేషం.

### తగిన బ్యాకప్ ఉందా?



ఉనాద్కట్

ఒకవేళ ప్రస్తుత పేసర్లు గాయాలతో అందుబాటులో లేకపోతే పరిస్థితి ఏమిటనేది ఆందోళనకరంగానే ఉంది. ఎంతమంది దేశవాళీ పేసర్లకు జాతీయ జట్టులోకి రాగలిగే సత్తా ఉందంటే చెప్పడం కష్టం. ఇందులో అవేశ్ ఖాన్ ఒక్కడే రాబోయే డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఆడగలిగే పేసర్‌గా ఆశలు కల్పిస్తున్నాడు. ఇక చివరి రెండు రంజీ సీజన్లలో బౌలింగ్ తీరును పరిశీలిస్తే ఎక్కువగా స్పిన్నర్ల ఆధిపత్యమే కనిపించింది. టాప్-10లో ముగ్గురు పేసర్లు మాత్రమే ఉన్నారు. వీరిలో అవేశ్ (8 మ్యాచ్‌ల్లో 38 వికెట్లు, మధ్యప్రదేశ్)తోపాటు బల్తేజ్ సింగ్ (8 మ్యాచ్‌ల్లో 37, పంజాబ్), ఆకాశ్‌దీప్ (10 మ్యాచ్‌ల్లో 41, బెంగాల్) మెరుగ్గానే రాణించారు. కానీ వీరిని నేరుగా టీమిండియాలోకి తీసుకునే అవకాశం లేదు. భారత 'ఏ' జట్టుకు ఎంపిక చేసి పరీక్షిస్తేనే ఓ నిర్ధారణకు రావచ్చు. అలాగే బంతిని ఇరువైపులా స్వింగ్ చేయగల 32 ఏళ్ల బల్తేజ్ ముందు తన ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాల్సి ఉంటుంది.

### భారత్ 'ఏ' టూర్లు అవసరం

బీసీసీఐ కూడా వర్ధమాన బౌలర్లను టెస్టు ఫార్మాట్ కోసం తీర్చిదిద్దేలా ఓ రోడ్‌మ్యాప్‌ను రూపొందించాల్సి ఉంటుంది. ఇందులో భారత 'ఏ' జట్లు కీలక పాత్ర పోషిస్తుంటాయి. ఈ జట్లకు ఎంపికైతే తమ సత్తా నిరూపించుకునేందుకు తగిన అవకాశం లభించినట్టవుతుందని యువ పేసర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే ప్రత్యర్థి విదేశీ జట్లలో టాప్ ఆటగాళ్లు బరిలో ఉంటారని, వారితో తలపడినప్పుడు తమలోని అత్యుత్తమ ఆటతీరు బయటికి వస్తుందని గుర్తుచేస్తున్నారు. అంతకంటే ముందు తాము టెక్నికల్‌గా రాటుదేలడమే కాకుండా మానసికంగానూ దృఢంగా మారే వీలుంటుందని చెప్పారు. అటు బీసీసీఐ కూడా వీలైనంత ఎక్కువగా భారత్ 'ఏ' జట్లను పర్యటనలకు పంపించడం ద్వారా.. అత్యవసర సమయంలో టీమిండియాకు సేవలందించేందుకు పేస్ బలగాన్ని సిద్ధం చేసినట్టవుతుంది.

## ప్రపంచ పవర్‌లిఫ్టింగ్‌లో భారత టీనేజర్ల సంచలనం



**న్యూఢిల్లీ:** భారత యువ పవర్‌లిఫ్టర్లు కషా నియా సచ్‌దేవ్, నోవా సారా ఎప్పెన్ ప్రపంచ వేదికపై సంచలన ప్రదర్శన నమోదు చేశారు. ఈ ఇద్దరు ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డులతో స్వర్ణ పతకాలు కొల్లగొట్టారు. కిర్గిస్థాన్‌లో జరిగిన ఈ టోర్నీలో 15 ఏళ్ల కషా మహిళల 75 కిలోల విభాగంలో ఓవరాల్‌గా 198.5 కిలోలు ఎత్తి స్వర్ణం సాధించగా.. 60 కిలోల విభాగంలో 13 ఏళ్ల నోవా 210 కిలోలు ఎత్తి పసిడి దక్కించుకుంది.

## 304 పరుగుల విజయం

వరల్డ్ కప్ క్వాలిఫయర్స్

- పురుషుల వన్డేల్లో రెండో భారీ గెలుపు
- జింబాబ్వే రికార్డు
- యూఎస్ఏ చిత్తు

**హరారే:** పురుషుల వన్డే చరిత్రలో జింబాబ్వే జట్టు రికార్డు నెలకొల్పింది. 304 పరుగులతో ప్రత్యర్థి యూఎస్ఏను చిత్తు చేసిన ఆ జట్టు రెండో అది పెద్ద విజయాన్ని తన పేరిట లిఖించుకుంది. వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా సోమవారం జరిగిన గ్రూప్ 'ఏ' మ్యాచ్ ఈ ఘనతకు వేదికైంది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 50 ఓవర్లలో 408/6తో భారీస్కోరు సాధించింది. వన్డేలలో ఆ జట్టుకిది అత్యధిక స్కోరు కూడా. గతంలో కెన్యాపై చేసిన 351 రన్స్ స్కోరును జింబాబ్వే తిరగరాసింది. కెప్టెన్ సీన్ విలియమ్స్ (101 బంతుల్లో 174) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. జాయ్‌లార్డ్ (78) హాఫ్ సెంచరీ చేశాడు. ఇక స్వల్ప ఛేదనలో పసికూన యూఎస్ఏ 25.1 ఓవర్లలో 104 పరుగులకే ఆలౌటైంది. ఇక వన్డేలలో అతి పెద్ద గెలుపు భారత్ పేరిట ఉంది. ఈ జనవరిలో తిరువనంతపురంలో శ్రీలంకతో మ్యాచ్‌లో టీమిండియా 317 రన్స్‌తో నెగ్గింది.

## విండీస్‌కు నెదర్లాండ్స్ సూపర్ షాక్



తేజ (111)

వన్డేల ప్రభ తగ్గుతున్న వేళ..వెస్టిండీస్-నెదర్లాండ్స్ మధ్య సోమవారం జరిగిన వరల్డ్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. రెండు జట్లలో ఇద్దరు ఆటగాళ్లు సెంచరీలతో కదం తొక్కడంతో పరుగుల వరద పారింది. పూరన్ (104) సూపర్ శతకానికి కింగ్ (76), చార్లెస్ (54) హాఫ్ సెంచరీలతోపాటు హోప్ (47) కీమో పాల్ (46 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ తోడవడంతో వెస్టిండీస్ 374/6 స్కోరుతో సవాలు విసిరింది. తేజ నిడమానూరు (111) సెంచరీతో దుమ్మురేపగా.. స్కాట్ ఎడ్వర్డ్స్ (67), చివర్లో వాన్ బీక్ (28) ధాటిగా ఆడారు. దీంతో గెలుపు అంచుల దాకా వచ్చిన నెదర్లాండ్స్ 374/9 స్కోరు కొట్టి మ్యాచ్‌ను టై చేసింది. ఇక, సూపర్ ఓవర్లో నెదర్లాండ్స్ మొదట 30/0 స్కోరు సాధించింది. వాన్ బీక్ 4, 6, 4, 6, 6, 4తో మొత్తం 30 పరుగులు చేసి ఒక ఓవర్ ఎలిమినేటర్‌లో అత్యధిక రన్స్ చేసిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. అనంతరం విండీస్ ఐదు బంతుల్లో ఎనిమిది పరుగులకు రెండు వికెట్లు కోల్పోయి ఓడింది.

# బిజినెస్

## స్టాక్ బ్రోకర్ల నిధుల దుర్వినియోగానికి చెక్





సెకండరీ మార్కెట్ ఇన్వెస్టర్లూ తమ ఖాతాలోనే ఫండ్స్ బ్లాక్ చేసుకోవచ్చు..

2024 జనవరి 1 నుంచి అందుబాటులోకి..

**న్యూఢిల్లీ:** ప్రైమరీ మార్కెట్ తరహాలో సెకండరీ మార్కెట్ ఇన్వెస్టర్లకూ తమ ఖాతాలో ఫండ్స్ బ్లాక్ చేసుకునే సదుపాయాన్ని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సోమవారం ప్రవేశపెట్టింది. స్టాక్ బ్రోకర్లు మదుపర్ల సొమ్మును దుర్వినియోగం చేయడం, డిఫాల్ట్ కావడం వంటి సంఘటనలకు అడ్డుకట్ట వేసేందుకు సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైమరీ మార్కెట్ ద్వారా పబ్లిక్ ఇష్యూ లేదా ఇతర పథకాల్లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లకు ఫండ్స్ బ్లాక్ చేసుకునే వసతి 'అప్లికేషన్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్' (ఏఎస్‌బీఏ) ఇప్పటికే అందుబాటులో ఉంది. తద్వారా మదుపరికి కేటాయింపులు జరిగాకే తన ఖాతా నుంచి సొమ్ము బదిలీ జరుగుతుంది. సెకండరీ మార్కెట్లోనూ 2024 జనవరి 1 నుంచి ఇది అందుబాటులోకి రానుంది. తద్వారా ఇన్వెస్టర్లు షేర్ల ట్రేడింగ్ కోసం సొమ్మును స్టాక్ బ్రోకర్ ఖాతాకు బదిలీ చేయాల్సిన అవసరం ఉండదు. క్లియరింగ్ కార్పొరేషన్ (సీసీ) పేరిట సొమ్మును తన బ్యాంక్ ఖాతాలోనే బ్లాక్ చేసుకునే అవకాశం ఉంటుంది. మదుపరి తన పొదుపు ఖాతాలోనే బ్లాక్ చేసి ఉంచిన సొమ్ము బదిలీ అయ్యేంతవరకు వడ్డీ కూడా పొందగలుగుతారు.

### రీట్స్, ఇన్విఐటీలకు కొత్త రూల్స్

పాలన, వార్షిక సెక్రెటేరియల్ రిపోర్టులు సమర్పించేందుకు వీలుగా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విఐటీ) కోసం సెబీ ప్రత్యేక ఫార్మాట్‌లను విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) రిపోర్టులకు ఇవి వర్తిస్తాయని సెబీ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

## సెప్టెంబరుకల్లా 2021-22 ఆడిట్ పూర్తి

బైజూస్

**న్యూఢిల్లీ:** 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ పద్దుల ఆడిటింగ్ వచ్చే సెప్టెంబరు నాటికి పూర్తవుతుందని ఎడ్‌టెక్ దిగ్గజం బైజూస్ ప్రకటించింది. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరం ఆడిట్ కూడా డిసెంబరు నాటికి పూర్తి చేయిస్తామని తెలిపింది. కంపెనీ సీఈఓ బైజూ రవీంద్రన్.. తమ షేర్‌హోల్డర్లతో మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లను అంగీకరిస్తూనే అయితే ఆ పొరపాట్లను అధిగమించేలా తాను చాలా నేర్చుకున్నానని చెప్పారు. బోర్డు సభ్యులు రాజీనామా చేసిన మాట వాస్తవమేనని, కాని వాటిని ఇంకా ఆమోదించలేదని వెల్లడించారు. పలు సవాళ్ల ఎదురైన మాట వాస్తవమే అయినప్పటికీ అధిక వ్యాపార విభాగాలు మెరుగ్గా పని చేస్తున్నాయని తెలిపారు.

## మిశ్రమంగా ముగిసిన సూచీలు

**ముంబై:** అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాల నేపథ్యంలో భారత ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 9.37 పాయింట్ల నష్టంతో 62,970 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 25.70 పాయింట్ల లాభంతో 18,691.20 వద్ద క్లోజైంది. కొనుగోళ్ల మద్దతుతో ఆటో, ఐటీ, ఫార్మా రంగ షేర్లు లాభాల్లో పయనించగా.. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, టీసీఎస్ షేర్లలో అమ్మకాలు సెన్సెక్స్, నిఫ్టీకి అడ్డుకట్టవేశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ మాత్రం 1.04 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.71 శాతం ఎగబాకాయి. కాగా, ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు తగ్గి 82.05 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 0.45 శాతం పెరిగి 74.18 డాలర్లకు చేరుకుంది.

**ఐపీఓ అప్‌డేట్స్:** నిర్మాణం, ఆతిథ్య సేవల సంస్థ పీకేహెచ్ వెంచర్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై వచ్చే నెల 4న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.140-148గా నిర్ణయించింది. ఐపీఓ ద్వారా గరిష్ఠంగా రూ.379 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

- ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్ట్ కానున్న సినోప్టిక్స్ టెక్నాలజీస్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 30న ప్రారంభమై జూలై 5న ముగియనుంది. ఇష్యూ ధరను రూ.237గా నిర్ణయించింది. మొత్తం 22.80 షేర్ల విక్రయం ద్వారా రూ.54 కోట్ల వరకు సమీకరించాలనకుంటోంది.
- డ్రోన్ల తయారీ స్టార్టప్ ఐడియాఫోర్జ్ టెక్నాలజీస్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుతో పోలిస్తే తొలిరోజే 3.69 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

## బంగారం మైనింగ్‌లో ఎన్ఎండీసీ రూ.500 కోట్ల పెట్టుబడి

### చురుగ్గా చిత్తూరు జిల్లాలోని చిగరగుంట-బిసంతాం క్షేత్రం లీజు ప్రక్రియ





**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగంలోని ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థ నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ).. తొలిసారిగా బంగారం మైనింగ్‌లోకి అడుగుపెట్టేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా రూ.500 కోట్ల (6.1 కోట్ల డాలర్లు) పెట్టుబడితో బంగారాన్ని వెలికితీసేందుకు ఎన్ఎండీసీ సన్నాహాలు చేస్తోందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. కాగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో ఉన్న చిగరగుంట-బిసంతాం బంగారం క్షేత్రానికి సంబంధించిన లీజు ప్రక్రియ చురుగ్గా సాగుతోందని ఆ వర్గాలు తెలిపినట్లు పేర్కొంది. గత ఏడాది ఈ బంగారం గనుల ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రభుత్వంతో లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)పై ఎన్ఎండీసీ సంతకాలు చేసుకుంది. స్థానిక నిబంధనలకు లోబడి ఎల్ఓఐపై సంతకాలు చేసుకున్న మూడేళ్లలోపే ఈ క్షేత్రానికి సంబంధించి మైనింగ్ లీజును కంపెనీ పొందాల్సి ఉంటుంది. మరోవైపు ఈ బంగారం బ్లాక్‌కు సంబంధించి పర్యావరణ అనుమతులు సహా ప్రభుత్వం నుంచి ఇతరత్రా క్లియరెన్సులను పొందటానికి కన్సల్టెంట్‌ను నియమించుకోవాలని ఎన్ఎండీసీ చూస్తోందని ఆ వర్గాలు తెలిపాయి.

### 18.3 లక్షల టన్నుల బంగారం రిజర్వులు

ఆంధ్రప్రదేశ్‌లోని ఈ బ్లాక్‌లో 18.3 లక్షల టన్నుల బంగారం నిక్షేపాలున్నట్లు అంచనా వేస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయని రాయిటర్స్ పేర్కొంది. ప్రపంచంలో భారీ ఎత్తున బంగారాన్ని వినియోగిస్తున్న దేశాల్లో చైనా అగ్రస్థానంలో ఉండగా భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం భారత్ 90 శాతం బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది. 2022లో విదేశాల నుంచి బంగారాన్ని కొనుగోలు చేసేందుకు భారత్ 3,660 కోట్ల డాలర్ల (సుమారు రూ. 3 లక్షల కోట్లు)కు పైగా వెచ్చించింది.

2021లో ఇది రికార్డు స్థాయిలో 5,580 కోట్ల డాలర్లుగా ఉంది. కాగా ప్రస్తుతం కర్ణాటకలో ప్రభుత్వ రంగంలోని హట్టి గోల్డ్ మైన్స్ కంపెనీ లిమిటెడ్ ఒక్కటే దేశంలో బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్న కంపెనీగా ఉంది.

## అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ సొంత స్టోర్లు

**హైదరాబాద్ ( అక్షర సవాల్ బిజినెస్):** బిల్డింగ్ మెటీరియల్స్ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ బీ2సీ వ్యాపారంలోకి అడుగు పెట్టింది. కంపెనీ సొంత అవుట్‌లెట్‌ను చెన్నైలో ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5 రాష్ట్రాల్లో 20 సొంత అవుట్‌లెట్లను ప్రారంభించనున్నట్లు అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ అశ్విన్ రెడ్డి తెలిపారు. ఈ స్టోర్లలో యూపీవీసీ, అల్యూమినియం డోర్లు, విండోలు ఇతర బిల్డింగ్ మెటీరియల్స్‌ను విక్రయిస్తారు.

## అసోచామ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్‌గా రవి కుమార్

**హైదరాబాద్ ( అక్షర సవాల్ బిజినెస్):** అసోచామ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అభివృద్ధి మండళ్ల చైర్మన్‌గా కాటూరు రవి కుమార్ రెడ్డి ఎన్నికయ్యారు. యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రవి కుమార్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ బాధ్యతలను నిర్వహిస్తారు. పునురుత్పాదక ఇంధన రంగంలో ఆయనకు విశేష అనుభవం ఉంది. తెలంగాణ, ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలని రవి కుమార్ సేవలు ఈ రెండు రాష్ట్రాలకు ఉపయోగపడతాయని అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) తెలుగు రాష్ట్రాల హెడ్ దినేశ్ బాబు అన్నారు.

## భారత వృద్ధి రేటు 6% యథాతథం

S&P Global Ratings

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో భారత వృద్ధిరేటును ఎస్ అండ్ పీ గ్లోబల్ 6 శాతంగా యథాతథంగా కొనసాగించింది. ఆ రకంగా ఆసియా పసిఫిక్ దేశాల్లోనే అమిత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని చెప్పారు. మధ్యకాలిక వృద్ధి పటిష్ఠంగానే ఉంటుందని కూడా తెల్చిచెప్పింది. రుతుపవనాలు పుంజుకున్నట్టయితే ఈ ఏడాది రిటైల్ ద్రవ్యోల్బణం కూడా 5 శాతం వద్ద స్థిరపడవచ్చని పేర్కొంది. క్రూడ్ ధరలు తగ్గుముఖం పట్టడం, డిమాండులో అస్థిరతలు కూడా ఇంధన వ్యయాలు, కీలక ద్రవ్యోల్బణం తగ్గడానికి అనుకూలించే అంశాలని తెలిపింది. ఏది ఏమైనా 2024 మొదటి త్రైమాసికంలో మాత్రమే ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** ( నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 26వ తేదీ | | విజయవాడ | 530 |
| హైదరాబాద్ | 540 | విశాఖపట్నం | 550 |
| 27వ తేదీ | | వరంగల్ | 542 |
| చిత్తూరు | 603 | డజను గుడ్లు రూ.72 | |
| గోదావరి | 530 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 138 | విజయవాడ | 138 |
| వరంగల్ | 138 | గుంటూరు | 138 |
| కరీంనగర్ | 138 | ఒంగోలు | 138 |
| మహబూబ్‌నగర్ | 138 | చిత్తూరు | 130 |
| కర్నూలు | 138 | నెల్లూరు | 130 |
| విశాఖపట్నం | 130 | అనంతపురం | 129 |
| గోదావరి | 138 | | |

## 32 ఏళ్లలో 20 కంపెనీల కొనుగోలు: సైయెంట్

**హైదరాబాద్ (అక్షర సవాల్ బిజినెస్):** సైయెంట్ 32 ఏళ్ల ప్రస్థానంలో 20 కంపెనీలను కొనుగోలు చేసిందని సైయెంట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి అన్నారు. ఫిన్లాండ్ కంపెనీ సిటెక్ విలీన ప్రక్రియను పూర్తి చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సిటెక్ బ్రాండ్ ఇంటిగ్రేషన్ పూర్తయినట్లు చెప్పారు. ఆదాయం, ఉద్యోగులు, వివిధ ప్రాంతాల్లో కార్యకలాపాల విస్తరణ పరంగా సైయెంట్ ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన కంపెనీల్లో సిటెక్ అతిపెద్దదని చెప్పారు. నార్డిక్ ప్రాంతంలో మొదటి కంపెనీ అన్నారు.

## ఐబీఎం చేతికి ఆప్టియో

### డీల్ విలువ రూ.37,720 కోట్లు

**న్యూయార్క్:** క్లౌడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆప్టియోను 460 కోట్ల డాలర్ల (సుమారు రూ.37,720 కోట్లు)కు కొనుగోలు చేయునున్నట్లు అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం ఐబీఎం సోమవారం ప్రకటించింది. విస్టా ఈక్విటీ పార్ట్‌నర్స్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకోనుంది. ఈ కొనుగోలు లావాదేవీ పూర్తిగా నగదు రూపంలో జరగనుందని, ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రక్రియ పూర్తి కావచ్చని సంస్థ పేర్కొంది. ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో కంపెనీలు సాంకేతిక బడ్జెట్‌ను కుదించుకుంటున్న తరుణంలో ఐబీఎం ఇంతటి భారీ కొనుగోలు చేపట్టడం గమనార్హం. పైగా ఐటీ రంగ పనితీరు కూడా మందగించింది. మాంద్యం భయాలతో ముందు జాగ్రత్త పడుతున్న టెక్ దిగ్గజాలు వ్యయాలు తగ్గించుకోవడంపై దృష్టిసారించాయి. అందులో భాగంగా వేల సంఖ్యలో ఉద్యోగులకు ఇప్పటికే ఉద్వాసన పలికాయి. ఐబీఎం కూడా ఈ ఏడాదిలో 3,900 మందిని బయటికి సాగనంపింది. అంతేకాదు, ఈ మార్చి త్రైమాసిక ఆదాయంలో కేవలం ఒక శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. ఆప్టియో విషయానికొస్తే, క్లౌడ్ కంపెనీలైన అమెజాన్ ఏడబ్ల్యూఎస్ నుంచి సేల్స్‌ఫోర్స్ వరకు 1,500కు పైగా కస్టమర్లు, భాగస్వాములను కలిగి ఉంది. ఆప్టియో కొనుగోలు తమ రెడ్‌హ్యాట్ వ్యాపారంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) పోర్ట్‌ఫోలియో, కన్సల్టింగ్ వ్యాపారాలకు ప్రయోజనం కలగనుందని ఐబీఎం పేర్కొంది. 2019లో ఐబీఎం రెడ్‌హ్యాట్ వ్యాపారాన్ని 3,400 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. ఇప్పటివరకు కంపెనీ చరిత్రలో అదే అతిపెద్ద కొనుగోలు.

## డెన్మార్క్ బ్యాంక్ నుంచి ఇన్ఫీకి భారీ డీల్

**న్యూఢిల్లీ:** ఇన్ఫోసిస్‌కు డెన్మార్క్‌కు చెందిన డాన్స్కే బ్యాంక్ నుంచి భారీ డీల్ లభించింది. ఈ బ్యాంక్‌కు ఇన్ఫీ డిజిటల్ పరివర్తన సేవలందించనుంది. ఐదేళ్ల కాలపరిమితితో కూడిన ఈ ఒప్పందం విలువ 45.4 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో సుమారు రూ.3,723 కోట్లు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా బ్యాంక్‌కు భారత్‌లో ఉన్న ఐటీ సెంటర్‌ను రూ.16 కోట్లకు ఇన్ఫోసిస్ కొనుగోలు చేయనుంది. ప్రస్తుతం ఈ కేంద్రంలో 1,400 మంది పనిచేస్తున్నారు.

## చిన్న వ్యాపారాలకు ఎదురీత తప్పదు

**ముంబై:** అమెరికా, యూరోజోన్ల మాంద్యం వల్ల ఏర్పడిన ప్రతికూల వాతావరణంలో మొత్తం ఎగుమతుల్లో 40 శాతం వాటా ఉన్న చిన్న వ్యాపార సంస్థలు ఎదురీదక తప్పదని క్రిసిల్ అనాలిసిస్ హెచ్చరించింది. ప్రతి ఐదు ఎంఎస్ఎంఈల్లో కనీసం ఒకటి వర్కింగ్ క్యాపిటల్‌పరంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. మహమ్మారి ముందు కాలం నాటితో పోల్చితే ఇప్పుడు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు మరింతగా పెరగవచ్చని పేర్కొంది.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 59,280 ▲ | 54,350 ▲ | 75,200 ▲ |
| ముంబై | 58,726 ▲ | 53,793 ▲ | 69,392 ▲ |

Tolly Wood

# 'ఓజీ'... సగం పని పూర్తి!



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకొంటోంది. 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్ స్టర్) అనేది వర్కింగ్ టైటిల్. డి.వి.వి.దానయ్య నిర్మాత. ప్రియాంకా మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించారు. దాంతో 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్టు చిత్ర బృందం ప్రకటించింది. "యాక్షన్, ఎపిక్‌నెస్, డ్రామా.... వీటికి సంబంధించిన మూడు అద్భుతమైన షెడ్యూల్స్ పూర్తయ్యాయి. దుమ్మురేపాయి. రాబోయే షెడ్యూల్స్ మరింత ఆసక్తికరంగా ఉండబోతున్నాయి" అని చిత్ర బృందం తెలిపింది. ఆగస్టుతో చిత్రీకరణ పూర్తవుతుంది. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. కెమెరా: రవి.కె.చంద్రన్, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాశ్.

# కళ్లు చెదిరే బడ్జెట్‌తో ప్రాజెక్ట్ కె



ఓవైపు ప్రభాస్, మరోవైపు అమితాబ్ బచ్చన్. మధ్యలో కమల్‌హాసన్. వీళ్లందరికీ తోడు... దీపికా పదుకొణె. 'ప్రాజెక్ట్ కె' తారాగణం ఇది. ఈ చిత్రంలో కమల్‌హాసన్ నటించనున్నారని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించేసింది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. కమల్ రాకతో అవి మరింత పెరిగిపోయాయి. అయితే ఈ స్టార్ పరంపర ఇక్కడితో ఆగడం లేదట. కన్నడ, మలయాళ చిత్రసీమల నుంచి కూడా పేరున్న నటీనటుల్ని రంగంలోకి దింపేందుకు దర్శకుడు నాగ అశ్విన్, నిర్మాత అశ్వనీదత్ ప్రయత్నిస్తున్నారని టాక్. వాళ్లందరినీ ఒకే తెరపై చూస్తే కళ్లు మిరుమిట్లు గొలపడం ఖాయం. దేశంలోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించే చిత్రమిదేనని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. చిత్ర బృందం బడ్జెట్ ఎంతన్నది అధికారికంగా చెప్పలేదు కానీ, కనీసం రూ.650 నుంచి రూ.700 కోట్ల వరకూ ఖర్చు కానుందని టాక్. ప్రభాస్ 'ఆదిపురుష్' రూ.600 కోట్లతో తెరకెక్కించారు. 'ఆర్.ఆర్.ఆర్' కోసం దాదాపుగా రూ.550 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ తరువాతి స్థానంలో '2.ఓ' (రూ.400) కోట్లు ఉంది. ప్రభాస్ నటించిన 'రాధేశ్యామ్', 'సాహో' చిత్రాల ఖర్చు కూడా మూడొందల కోట్లకు పైమాటే. ఇప్పుడు ఆ రికార్డులన్నింటినీ 'ప్రాజెక్ట్ కె' దాటేసింది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్, దీపికా.. ఇలా నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలకే సగానికిపైగా బడ్జెట్ కేటాయించాల్సి వస్తోంది. ఇక నిర్మాణ విలువలు కూడా హాలీవుడ్ స్థాయిలో ఉండబోతున్నాయి. అందుకే ఈస్థాయిలో ఖర్చు పెట్టాల్సివస్తోంది. 2024 సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్న సంగతి తెలిసిందే.

# సముద్ర గర్భంలో దేవర పోరాటం



'జనతా గ్యారేజ్'లాంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన ఎన్టీఆర్ - కొరటాల శివ మరోసారి జట్టు కట్టారు. వీరిద్దరి కలయికలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ కథానాయిక. ప్రస్తుతం 'దేవర' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవల హైదరాబాద్ శివార్లలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్లో ఓ భారీ పోరాట దృశ్యాన్ని తెరకెక్కించారు. అండర్ వాటర్ సీక్వెన్స్‌లో చేసిన ఫైట్ ఇది. సముద్ర తీరం నేపథ్యంలో సాగే కథ ఇది. సముద్రంలో హీరోకీ, విలన్ గ్యాంగ్‌కీ మధ్య జరగే భీకరమైన పోరాటాన్ని వందల మంది ఫైటర్లతో తెరకెక్కించారని సమాచారం. దాదాపు 15 రోజుల పాటు ఈ పోరాట ఘట్టాన్ని చిత్రీకరించారు. ఈ ఫైట్ సీక్వెన్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ అవుతుందని తెలుస్తోంది. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని 2024 వేసవిలో విడుదల చేస్తారు.

# ఈ యువ హీరోల టైటిల్స్ ఇవేనా?!







ఓ సినిమాకి టైటిల్ పెట్టడం కూడా ఓ కళే. అది కూడా కమర్షియల్ ఎలిమెంటే. చూడగానే ఆకట్టుకొనే టైటిల్ సినిమాకి చాలా ముఖ్యం. అందుకే మంచి పేరు పెట్టడానికి దర్శక నిర్మాతలు పది రకాలుగా ఆలోచిస్తుంటారు. అలాంటి టైటిళ్ల కోసం టాలీవుడ్‌లో అన్వేషణ సాగుతోంది. వాటిలో రామ్ సినిమా ఒకటి. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా ఓ చిత్రం రూపుదిద్దుకొంటున్న సంగతి తెలిసిందే. సెప్టెంబరు 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. టీజర్ ఇది వరకే వచ్చింది. అయితే టైటిల్ మాత్రం ప్రకటించలేదు. బోయపాటి శ్రీను టైటిల్స్ అన్నీ పవర్‌ఫుల్‌గా ఉంటాయి. 'సింహా', 'లెజెండ్', 'అఖండ..' ఇలా సౌండింగ్‌తోనే ఆకట్టుకొంటారు. అలాంటి శక్తిమంతమైన టైటిల్ కోసం ఆయన అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది. 'స్కంద' అనే ఓ పేరు ఈ సినిమా కోసం ఆయన పరిశీలిస్తున్నారట. కుమారస్వామి అవతారానికి మరో పేరు 'స్కంద'. హీరో క్యారెక్టరైజేషన్‌కి ఈ పేరు అతికినట్టు సరిపోతుందని బోయపాటి భావిస్తున్నారు. మరి ఇదే ఖరారు చేస్తారా, లేదంటే మరో పేరు ఏమైనా పెడతారా? అనేది చూడాలి. జులైలో.. టైటిల్ అధికారికంగా ప్రకటిస్తారు. మరోవైపు నితిన్ - వక్కంతం వంశీ కాంబినేషన్‌లో ఓ చిత్రం షూటింగ్ జరుపుకొంటోంది. దాదాపుగా సగం సినిమా పూర్తయిపోయింది. అయితే టైటిల్ ప్రకటించలేదు. 'జూనియర్', 'సైతాన్'లాంటి పేర్లు బయటకు వచ్చాయి. అయితే చిత్రబృందం వీటిపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడు 'ఎగస్ట్రా ఆర్డనరీ మెన్' అనే పేరు పెట్టారని వార్తలొస్తున్నాయి. ఈ చిత్రంలో నితిన్ జూనియర్ ఆర్టిస్టుగా నటిస్తున్నాడని తెలుస్తోంది. ఓ ఎగస్ట్రా ఆర్టిస్టు.. ఎలా ఎక్స్ట్రాడనరీ మెన్‌గా మారాడన్నదే సినిమా కథ. అందుకే ఈ పేరు పెట్టారని చెప్పుకొంటున్నారు. వీటిపై కూడా దర్శక నిర్మాతలు క్లారిటీ ఇవ్వాల్సివుంది. ఇటీవలే 'విరూపాక్ష' చిత్రంలో ఓ సూపర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకొన్నారు సాయిధరమ్ తేజ్. ఇప్పుడు సంపత్‌నంది దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'గాంజా శంకర్' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. శంకర్ అనే కుర్రాడి కథ ఇది. తను గాంజా అమ్ముతుంటాడట. అందుకే ఈ పేరు పెట్టారట. ఇది వరకు పవన్ కల్యాణ్ 'గుడుంబా శంకర్' అవతారం ఎత్తిన సంగతి తెలిసిందే. ఆ టైటిల్ ప్రభావం.. 'గాంజా శంకర్'పై బాగా కనిపిస్తోంది. ఈ చిత్రంలో కథానాయికగా పూజా హెగ్డే పేరు దాదాపుగా ఖరారైపోయింది. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుంది.

# ఎవరు చేసిన 'మిస్టేక్' ఇది?

అభినవ్ సర్దార్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిస్టేక్'. ఆయనే నిర్మాత. భరత్ కొమ్మలపాటి దర్శకుడు. ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కథానాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ "సర్దార్ నాకెప్పటి నుంచో తెలుసు. నాకు తమ్ముడిలాంటోడు. తను చాలా రంగాల్లో విజయం సాధించాడు. నిర్మాతగా కూడా నిలదొక్కుకోవాలని కోరుకొంటున్నా" అన్నారు. "దర్శకుడు ఈ కథ చెప్పగానే నచ్చింది. ఎంత కష్టమైనా నేనే తీయాలి అనుకొన్నా. షూటింగ్ సమయంలో భుజానికి గాయమైంది. అయినా సరే, కష్టపడి నటించా. నా మెగాస్టార్ శ్రీకాంతే. ఆయన నాకిచ్చిన సహకారం ఎప్పటికీ మర్చిపోలేను" అన్నారు అభినవ్. "2021 లాక్ డౌన్ తరవాత ఈ సినిమా మొదలెట్టాం. అందరూ చాలా ఇష్టపడి చేసిన సినిమా ఇది. తగిన ఫలితం వస్తుందన్న నమ్మకం ఉంద"న్నారు దర్శకుడు.



# ఆ పుస్తకంలో ఏముంది?



అందాల భామలు కాజల్, రెజీనా, జననీ అయ్యర్ ప్రధాన పాత్రలు పోషించిన 'కార్తీక' చిత్రం వచ్చే నెల ఏడున విడుదల కానుంది. తమిళంలో విజయవంతమైన 'కరుంగాపియం' చిత్రాన్ని శ్రీ వెంకటసాయి ఫిల్మ్స్ పతాకంపై 'కార్తీక' పేరుతో తెలుగులోకి అనువదించారు ముత్యాల రామదాసు, టి.జనార్ధన్. హారర్ చిత్రాలు తీయడంలో స్పెషలిస్టు అయిన దర్శకుడు డి.కార్తికేయన్ (డీకే) ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. చిత్రం విడుదల తేదీని వెల్లడించిన అనంతరం చిత్ర సమర్పకుడు ముత్యాల రామదాసు మాట్లాడుతూ 'రెజీనా ఒకసారి లైబ్రరీకి వెళ్లి వందేళ్ల నాటి 'కాటుక బొట్టు' అనే పుస్తకం చదువుతుంది. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చెప్పే పుస్తకం అది. రెజీనా ఆ పుస్తకం చదువుతుంటే అందులోని పాత్రలు అన్న దెయ్యాలుగా మారి ఆమె ముందుకు వస్తాయి. తనకు హాని కలిగించిన వ్యక్తులపై పగ తీర్చుకునే దెయ్యం పాత్రను కాజల్ పోషించారు. అలాగే రెజీనా, జననీ అయ్యర్ పాత్రలు కూడా ప్రేక్షకులను అలరిస్తాయి. ఇటీవల విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. తెలుగులో కూడా ఈ సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

# పెళ్లి పీటలెక్కనున్న అర్జున్ కుమార్తె



ప్రముఖ నటుడు అర్జున్ సర్జా పెద్ద కుమార్తె ఐశ్వర్య వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. వరుడు మరెవరో కాదు.. తమిళ నటుడు ఉమాపతి రామయ్య. ప్రముఖ తమిళ నటుడు తంబి రామయ్య తనయుడు .ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తంబి రామయ్య ఈ విషయం వెల్లడించారు. 'మా అబ్బాయి పెళ్లి వార్త నిజమే. అర్జున్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఓ రియాల్టీ షోలో మా వాడు కంటెస్టెంట్‌గా పాల్గొన్నాడు. అప్పటినుంచి మా ఇద్దరి కుటుంబాల మధ్య పరిచయాలు ఏర్పడ్డాయి. ఐశ్వర్య అంటే ఇష్టమని ఉమాపతి మాతో చెప్పాడు. ఇరు కుటుంబాల పెద్దలు ఇటీవల కలసి మాట్లాడుకున్నాం. పెళ్లి ముహూర్తం ఎప్పుడన్నది ఉమాపతి పుట్టిన రోజైన నవంబర్ 8న వెల్లడిస్తాం. వచ్చే ఏడాది వీరి పెళ్లి ఉండవచ్చు' అన ఆయన తెలిపారు.

# టక్కరి దొంగకు ఉంగరం దొరికితే..?



శ్రీసింహా కోడూరి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'భాగ్ సాలే'. నేహా సోలంకి కథానాయిక. ప్రణీత్ బ్రహ్మండపల్లి దర్శకుడు. అర్జున్ దాస్యన్, యశ్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మాతలు. జులై 7న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో యువ కథానాయకుడు కార్తికేయ ట్రైలర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ "టైటిల్ బాగుంది. ట్రైలర్ ఇంకా బాగుంది. ఈ కథకు టైటిల్ బాగా సెట్టయ్యింది. 'భాగ్ సాలే' అంటే ఇప్పటి వరకూ మహేశ్‌బాబు డైలాగ్ గుర్తొచ్చేది. ఇప్పుడు ఈ సినిమా గుర్తుకు రావాల"న్నారు. "ఓ టక్కరి దొంగ కథ ఇది. వాడికి విలువైన ఉంగరం దొరికితే ఎలా ఉంటుందన్న పాయింట్‌తో రూపొందించారు. పూర్తి వినోదాత్మకంగా సాగుతుంద"న్నారు కథానాయకుడు. "భాగ్ సాలే అనేది క్రేజీ సౌండింగ్. ఆ పేరులోనే వినోదం ఉంది. ఇది పూర్తిగా హైదరాబాద్ నేపథ్యంలో సాగే సినిమా. చిత్రీకరణ కూడా ఇక్కడే జరిపామ"ని దర్శకుడు తెలిపారు.

# మా సర్కిల్ సర్‌ప్రైజ్ చేస్తుంది



'షో' సినిమాతో జాతీయ అవార్డు పొందిన దర్శకుడు నీలకంఠ. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సర్కిల్'. సాయి రోనక్ కథానాయకుడు. బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రలు పోషించారు. జులై 7న విడుదల అవుతోంది. సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలకంఠ మాట్లాడుతూ "నా సినిమాలో కథానాయికలకు ఎప్పుడూ మంచి పాత్రలే దక్కుతాయి. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు. వాళ్ల పాత్రలు ఆకట్టుకొంటాయి. బాబా భాస్కర్ పాత్ర కొత్తగా ఉంటుంది. చాలా అంశాల్లో 'సర్కిల్' ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుంద"న్నారు. సాయి రోనక్ మాట్లాడుతూ "నీలకంఠ లాంటి అనుభవజ్ఞులతో పని చేయడం ఓ గౌరవం లాంటిది. ఆయన నుంచి ఎన్నో విషయాల్ని నేర్చుకొన్నా. ఈ సినిమాలో ప్రతీ పాత్ర కీలకమే. బాబా భాస్కర్ పాత్ర కూడా హీరో స్థాయిలోనే ఉంటుంద"న్నారు. "నాలో నీలకంఠ గారు ఓ వైల్డ్ యాంగిల్ చూశారు. నాతో తొలిసారి కత్తి పట్టించారు. ఈ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంద"న్నారు బాబా భాస్కర్.

# ఇంటి కోసం దాచిన డబ్బుతో సినిమా తీశా

సుభాష్



'నేను ఇల్లు కొనుక్కుందామని దాచుకున్న డబ్బుతో ఈ సినిమా తీశా. కరోనా సమయంలో అన్ని రంగాలు ఆగిపోయినా ఎంటర్‌టైన్‌మెంట్ పెరిగింది. అందుకే ఆలోచించి నిర్మాతగా మారాను. హీరో ఆర్యన్ ముందుండి నడిపించాడు. మా సినిమాను రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చిన యూఎఫ్ఓ సంస్థకు కృతజ్ఞతలు. వచ్చే నెల ఏడున సినిమా విడుదల చేస్తున్నాం' అన్నారు నిర్మాత సుభాష్ కట్టా. ఆయన నిర్మించిన 'ఓ సాథియా' చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ప్రతి నిర్మాతకు ఒక స్ట్రగుల్ ఉంటుంది. స్టోరీ ఉంటుంది. అలాగే సక్సెస్ కూడా ఉంటుంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాత సుభాష్ ఈ సినిమాతో ఒక ఇంటితో పాటు మరో ఇంటిని కూడా కొనుక్కోవాలని దర్శకుడు నక్కిన త్రినాధరావు అన్నారు. ఈ చిత్రానికి నిర్మాత, దర్శకుడు ఇద్దరూ మహిళలే కావడం ఆనందంగా ఉందన్నారు. చిత్రంలో హీరోగా నటించిన ఆర్యన్ మాట్లాడుతూ 'నేను పరిశ్రమకు వచ్చి తొమ్మిదేళ్లు అయింది. అవకాశాల కోసం తిరిగి తిరిగి నేనే హీరోగా, దర్శకుడిగా లాక్‌డౌన్‌లో 'జీ జాంబీ' సినిమా తీశా. అది హిట్టు. దాని బడ్జెట్ రూ 40 లక్షలు. 'ఓ సాథియా' బడ్జెట్ రూ. ఆరు కోట్లు. నిర్మాత నన్ను నమ్మి అంత డబ్బు ఖర్చు పెట్టారు. ఆయన కోసం ఈ సినిమా హిట్ కావాలి' అన్నారు. ఈ సినిమాలో నటించినందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ మిస్టీ చక్రవర్తి చెప్పారు. ఫస్ట్ లవ్ గురించి తీసిన సినిమా ఇదని దర్శకురాలు దివ్య భావన చెప్పారు. 'ఇది మంచి లవ్ స్టొరీ. థియేటర్స్‌లోనే చూడాల్సిన సినిమా. అందుకే మేం విడుదల చేస్తున్నాం' అని యుఎఫ్ఓ లక్ష్మణ్ చెప్పారు.

# పృథ్వీరాజ్‌కు సర్జరీ!



మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కు సోమవారం కీ హోల్ సర్జరీ జరిగింది. ఆదివారం ఇడుక్కీలో 'విలయత్ బుద్ధ' షూటింగ్‌లో ఓ ఫైట్ సన్నివేశంలో పృథ్వీరాజ్ పాల్గొన్నప్పుడు ఆయన కాలికి గాయం అయింది. ఫస్ట్ ఎయిడ్ చేసిన అనంతరం ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు ఆయన గాయాలను పరిశీలించి కీ హోల్ సర్జరీ చేయాలనే నిర్ణయానికి వచ్చి సోమవారం నిర్వహించారు. రెండు నెలలు విశ్రాంతి తీసుకున్న తర్వాత పృథ్వీరాజ్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్' చిత్రంలో పృథ్వీరాజ్ విలన్‌గా నటిస్తున్నారు. అలాగే అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా నటిస్తున్న 'బడే మియా చోటే మియా' చిత్రంలో కూడా ఆయన విలన్‌గా నటిస్తున్నారు.

# అలా ఎలా జరిగింది?



శక్తి వాసుదేవన్, రాజా శేఖర్, పూర్ణ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'అలా ఇలా ఎలా?'. రాఘవ దర్శకత్వం వహించారు. కొల్లకుంట నాగరాజు నిర్మాత. జులై 21న విడుదల అవుతోంది. ఇటీవల హిందూపూర్‌లో పాటలు విడుదలయ్యాయి. ఈ శక్తి వాసుదేవన్ మాట్లాడుతూ "83 రోజుల పాటు వివిధ లోకేషన్లలో చిత్రీకరణ జరిపాం. కథ, కథనాలే ఈ చిత్రానికి ప్రధాన బలం" అన్నారు. "నాది హిందూపూర్. అన్ని రంగాల్లోనూ హిందూపూర్ ముందుండాలని అనుకొనేవాడ్ని. అందుకే ఇక్కడ నా సినిమా పాటల్ని విడుదల చేశా. మణిశర్మ అందించిన పాటలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ" అన్నారు నిర్మాత.

# ఎంత సంపాదించినా ఇంతేగా!



మనిషి జీవితంలో సంతృప్తి చాలా ముఖ్యం. ఎక్కడో ఓ చోట 'ఇక చాల్లే..' అనుకోకపోతే, ఆ ప్రయాణానికి అంతం ఉండదు. డబ్బు విషయంలోనూ ఇంతే. ఎన్ని కోట్లు సంపాదించామన్నది కాదు.. ప్రశాంతంగా నిద్ర పోతున్నామా, లేదా? అనేదే ముఖ్యమంటోంది సమంత. కథానాయికగా ఒక్కో మెట్టు ఎక్కుతూ స్టార్‌గా మారింది. అటు సినిమాలు, ఇటు వెబ్ సిరీస్ అంటూ రెండు పడవల ప్రయాణం చేస్తోంది. కమర్షియల్ యాడ్స్‌లోనూ మెరుస్తోంది. దక్షిణాదిన అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కథానాయికల్లో సమంత పేరు కూడా ఉంది. మనీ మేనేజ్‌మెంట్ గురించి సమంత మాట్లాడుతూ "నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. డబ్బు విలువ అందరికంటే నాకే బాగా తెలుసు. అలాగని నేనేం మనీ మిషన్‌ని కాదు. సంపాదనపై నాకెప్పుడూ ధ్యాస ఉండదు. ఖర్చు పెట్టడంలోనూ నాకు ఆనందం కనిపించదు. ఎన్ని కోట్లు సంపాదించినా ఇంతకంటే విలాసవంతమైన జీవితం రాదు కదా? నా శక్తికీ, ప్రతిభకీ మించిన గుర్తింపు నాకు లభించింది. ఇది.. చాలు. ఇంతకంటే ఏం కోరుకోవడం లేదు. ఓ నటిగా నాకు ఆత్మ సంతృప్తి చాలా ముఖ్యం. పారితోషికం ఇచ్చే ఆనందం కంటే.. ఓ మంచి సన్నివేశంలో నటించిన కిక్ ఎక్కువ కాలం నాతో ఉంటుంద"న్నారామె.




# అక్షర సవాల్

బుధవారం 28-06-2023

గ్లోబలైజేషన్ ప్రక్రియ ఊపందుకున్న తరవాత ముఖ్యంగా రెండు వేల సంవత్సరం నుంచి ఐటీ రంగం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మధ్యలో రెండుసార్లు తలెత్తిన మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగమే కాకుండా హైపెయిడ్‌గా ఉండడంతో సంబంధిత చదువులకు డిమాండ్ అధికంగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) కొంతకాలంగా ఎదురులేని కోర్సుగా మారింది. ఈ నేపథ్యంలో సదరు కోర్సుకు తోడు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న ఐటీ రంగంపై **ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు** చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.



కంప్యూటర్లు, అల్గోరిథమ్స్ నుంచి ప్రోగ్రామ్స్, సర్క్యూట్స్ అలాగే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌కుతోడు అప్లికేషన్స్(అన్వయం) సహా యావత్తు అధ్యయనం కంప్యూటర్ సైన్స్‌లో ఉంటుంది. ప్రాథమికంగా కంప్యూటర్లు, సంబంధిత అప్లికేషన్స్ అధ్యయనమే కంప్యూటర్ సైన్స్. సాఫ్ట్‌వేర్, అప్లికేషన్స్‌తోనే మొత్తం ప్రపంచాన్ని తెలుసుకునే స్వేచ్ఛను విద్యార్థికి అది కలుగజేస్తోంది. కంప్యూటర్ అల్గోరిథమ్స్, లాంగ్వేజ్‌లు సదరు మెషీన్లకు ప్రోగ్రామ్‌ను సమకూరుస్తాయి. డేటా స్ట్రక్చర్స్, నెట్‌వర్కింగ్ అదేవిధంగా కంప్యూటర్లలో నెట్‌వర్క్స్ అధ్యయనం కూడా ఉంటుంది. కేవలం సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్ స్టడీకే పరిమితం కాదు. సదరు రంగాలు అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తదితరాలూ ఉన్నాయి.

## ఇంజనీరింగ్ బ్రాంచీల్లో ఎవరెస్ట్ సీఎస్ఈ

### అభ్యంతరాలు

యువతను ఆకట్టుకునే వృత్తుల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)కే అగ్రస్థానం దక్కుతుంది. లేటెస్ట్ సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి తోడు మంచి కెరీర్, ప్రమోషన్స్, వేతనం, ఉత్కంఠభరితమైన వాతావరణం, విదేశీ అవకాశాలు తదితరాలు ఇందులో ఉంటున్నాయి. అయితే ఐటీ పరిశ్రమలో చీకటి కోణం కూడా ఉంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఎదుగుతూ ఉండాలి. ఇదో నిరంతర ప్రక్రియ. చదువుకున్నది లేదంటే నేర్చుకున్న సాంకేతికత ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. మానవ జీవితంతో సాంకేతికత పెనవేసుకున్న నేపథ్యంలో ఉపయోగ ధోరణిలో ఎలాంటి మార్పు ఉండదు. పాత తరం మాదిరిగా పనిచేసేందుకు కొత్త తరం అంగీకరించటం లేదు. ఇప్పటి తరానికి ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు ఎక్కువ. అలాంటివారిని ఆకట్టుకుంటన్నది ఇప్పటికి ఐటీ మాత్రమే. అయితే సుదీర్ఘకాలికంగా చూసుకున్నప్పుడు ఐటీ రంగం ఏమంత భేషైనది కాదన్నది కొందరు నిపుణుల అభిప్రాయం. అందుకు సహేతుక కారణాలు ఉన్నాయి.

- టెక్నాలజీ ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. అది వేగంగా, నిరంతరంగా జరుగుతూ ఉంటుంది. కొత్త టెక్నాలజీ పుట్టడం అదే సమయంలో పాతది వాడుకలో లేని పరిస్థితికి చేరడం జరుగుతుంది. అంటే అప్పటికి ఉన్న పరిజ్ఞానం ఇక పనికిరాదు. కొత్తది నేర్చుకోని పక్షంలో అక్కడికి కెరీర్ ముగుస్తుంది. ఉదాహరణకు సాఫ్ట్‌వేర్‌ను శాసించిన మెయిన్‌ఫ్రేమ్ ఇప్పుడు అనామకంగా ఉంది. అలాగే పైథాన్‌లో 2, 3 అని రెండు వెర్షన్స్ ఉన్నాయి. మూడోది రెండోదానిపై పనిచేయదు. ఇలాంటి ఇబ్బందులు ఉంటాయి.
- కొత్త టెక్నాలజీ రాగానే దానిపై పట్టు లేదంటే అవగాహన ఉన్న వ్యక్తులను కంపెనీలు రిక్రూట్ చేసుకుంటాయి. దాంతో ఎప్పటినుంచో పనిచేస్తున్న వ్యక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయి.
- హ్యాకథాన్, స్టాక్‌ఓవర్‌ఫ్లో మనం అనుకుంటున్న విధంగా ఉండవు. హ్యాకథాన్ చిన్నపాటి కోడింగ్ కంటెస్ట్. సాధారణంగా అది రెండు వారాలకు మించదు. ముగ్గురు నలుగురు ప్రోగ్రామర్లు బృందంగా ఏర్పడి పోటీలో పాల్గొంటారు. యంగ్ మైండ్స్ ఒకదగ్గరకు చేరుతారు. నాలెడ్జ్ షేర్ చేసుకుంటారు. ఫన్, ఇంటరాక్షన్ బాగుంటాయి. దీనికే చీకటి పార్శ్వం కూడా ఉంది. దీన్ని అసలు గుర్తించరు. కాపీరైట్ చట్టం వర్తింపు అరుదుగా ఉంటుంది. ఏతావతా సాధించింది ఏమీ ఉండదు.
- ఇండియా, వియత్నాం - రెండు దేశాల్లో చాలా ఔట్‌సోర్సింగ్ కంపెనీలు మెజారిటీ జాబ్ ప్రోగ్రామర్స్ ఉద్యోగాలను కల్పిస్తాయి. డబ్బు ఆదా ఇందులో కీలకం. అంతర్జాతీయ ప్రోగ్రామర్లతో పోల్చుకుంటే ఈ రెండు దేశాల్లోని కంపెనీలు తక్కువ మొత్తం చెల్లిస్తూ ఉంటాయి. అంటే దోపిడికి ఇది రాచమార్గం వేస్తుంది. నిర్ణీత సమయానికి మించి లేబర్ పనిచేయాల్సి ఉంటుంది. ఇదంతా వ్యక్తి ఆరోగ్యం, కుటుంబంపై వ్యతిరేక ప్రభావం చూపుతుంది.
- 'సకలకళావల్లబన్'లను ఇప్పుడు మార్కెట్ డిమాండ్ చేస్తోంది. ఐటీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. కోడింగ్ సామర్థ్యానికి తోడు గ్రూపుల్లో పనిచేసే వ్యక్తిగా, ఇచ్చిపుచ్చుకునే విధంగా, బృంద నాయకుడిగా పనిచేసే సామర్థ్యాలు ఉండాలి. పనిని విభజించడం, ఇతరులను కన్విన్స్ చేయడం, ఒప్పించడం, చెప్పడం తదితరాలన్నీ తెలిసి ఉండాలి. ఐటీ ఇండస్ట్రీలో ఎదుగుదలకు ఇవన్నీ చాలా అవసరం. ఏదో ఇచ్చిన పని చేయగలను అంటే కుదరదు. లీడర్‌గా, ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయగలిగే నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సి ఉంటుంది.
- ఉద్యోగం చేసే చోట సీనియర్లకు అనుకున్నంత సామర్థ్యం లేకపోవచ్చు. ఉన్నా ఒక టెక్నాలజీలో ఎంతో సీనియర్ అయినా కొత్త టెక్నాలజీలో జూనియర్‌గా పనిచేయాల్సి ఉంటుంది. దీనికి ఉద్యోగి సిద్ధమైనా పే ప్యాకేజీలు ఎక్కువగా ఉండడంతో కంపెనీలు పెద్దగా ప్రిఫర్ చేయవు.
- కొన్ని సందర్భాల్లో ముందు అనుకున్నట్టు కొత్త సాంకేతికతపై పట్టు లేకపోవచ్చు. సాంకేతికతపై ఒకవేళ పట్టు ఉంటే ఇంకా మంచి పొజిషన్లకు ఎదిగి ఉండవచ్చు. వాళ్ళంతా ఇంతకుమునుపు తెలియని పనుల్లో అంటే పని విభజన తదితరాల్లో ఉండవచ్చు. కోడ్ నేర్చుకున్నట్టు అవన్నింటిపై పట్టు సాధించే యత్నాల్లో ఉండవచ్చు. సుదీర్ఘకాలంలో అదే పరిస్థితి మీకూ ఎదురుకావచ్చు.
- మోడ్రన్ టెక్నాలజీ ప్రోగ్రామింగ్‌కు అనువుగా ఉంది. దాంతో ప్రోగ్రామర్లకు డిమాండ్ గణనీయంగా తగ్గుతోంది. ప్రోగ్రామింగ్ వైపు కంపెనీలు అతి తక్కువ వేతనాలను ఆఫర్ చేస్తున్నాయి. వేతనంలో తగ్గుదల, పని ఎక్కువగా ఉండటంగా పరిణమిస్తోంది. ఏతావతా 45 ఏళ్ళకే రిటైర్ కావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.
- ఒక్కమాటలో చెప్పాలంటే మారుతున్న టెక్నాలజీ, తదనుగుణ్యమైన వేగాన్ని అందుకుంటేనే ఈ రంగంలో నిలదొక్కుకోగలమని గ్రహించాల్సి ఉంటుంది.



**కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్స్‌కు సంబంధించి బేసిక్స్ నుంచి ఈ కోర్సులో నేర్చుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. సైన్స్ అఫ్ కంప్యూటర్స్ అంటే అందులోని ఆర్కిటెక్చర్ సహా కంప్యూటర్ సైన్స్. మెయిన్ ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, కంప్యూటర్ సర్క్యూట్స్ పరిచయం, యావత్తు ప్రక్రియను రన్ చేసే అల్గోరిథమ్స్ ఈ కోర్సు అధ్యయనంలో భాగం. మేథమెటిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఈ సబ్జెక్టు మూలాలు ఉన్నాయి. దాంతో అటు సాఫ్ట్‌వేర్, ఇటు హార్డ్‌వేర్ తెలుసుకోవాల్సి ఉంటుంది.

**కంప్యూటర్ ఇంజనీరింగ్:** సీఎస్ఈ మాదిరిగానే ఉన్నప్పటికీ చిన్నపాటి తేడాతో ఈ కోర్సు ఉంటుంది. కొన్ని టాపిక్స్ విషయంలో ఈ రెంటి మధ్య తేడా కనిపిస్తుంది. హార్డ్‌వేర్ల డిజైనింగ్, అసెంబ్లింగ్‌కు తోడు మైక్రో ప్రాసెసర్ల సర్క్యూట్ డిజైనింగ్, సూపర్ కంప్యూటర్స్ ఈ కోర్సులో ఉంటాయి. అంతిమంగా దేశాన్ని సాంకేతికంగా నడిపేందుకు అవసరమైన విద్య ఉంటుంది.

**ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ:** కంప్యూటర్స్ డేటా మేనేజ్‌మెంట్‌కు తోడు నెట్‌వర్క్స్, నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ ఈ కోర్సులో ఉంటాయి. డేటా స్టోరేజీ, మానిప్యులేషన్ అధ్యయనంగా ఉంటుంది. డేటా అంటే ఇక్కడ మెషిన్లలో ఉన్నదని అర్థం.

**ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి):** మెషిన్ కోడ్స్, కంప్యూటర్ లేదంటే ఎలక్ట్రానిక్ డివైజ్‌ను డ్రైవ్ చేసే డేటా ఈ కోర్సులో చదవాలి. నెట్‌వర్కింగ్ స్టడీ అంటే ఒకే పని చేస్తున్న డివైజ్‌ల మధ్య నెట్‌వర్క్‌ను ఎస్టాబ్లిష్ చేయాలి. వాణిజ్యపరంగా బిజినెస్ ప్రపంచంలో ఇది కీలకం.

### కొత్త బ్రాంచీలు

ఇటీవల కాలంలో ఐటి, సీఎస్ఇ సంబంధ బ్రాంచీలు చాలా అందుబాటులోకి వచ్చాయి. ఇవి అన్ని కాలేజీల్లో ఉండకపోవచ్చు. వారి డిమాండ్, ఇన్ఫ్రా ఆధారంగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఐటీ, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ మెయింట్‌నెన్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, కంప్యూటర్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సైన్స్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్ అండ్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, సైబర్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, వర్చువల్ అండ్ ఆగ్‌మెంటెడ్ రియాల్టీ, కంప్యూటర్ ఇంజనీరింగ్(సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్), కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లయిడ్ మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ బయోసైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అండ్ సైబర్ సైక్యూరిటీ ఇన్‌క్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(నెట్‌వర్క్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ సోషల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ టెక్నాలజీ కంప్యూటింగ్ ఇన్ మల్టీమీడియా, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితరాలు ఇందులో ఉన్నాయి.

### కెరీర్ అవకాశాలు

- కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ లేదా సంబంధిత ఏరియాలో డిగ్రీ ఉన్న వ్యక్తులుగా సిస్టమ్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ప్రొడక్ట్ మేనేజర్, ఇంజనీరింగ్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఉదాహరణకు కంప్యూటర్ సైన్స్‌లో నిపుణుడు సీనియర్ ప్రోగ్రామర్, సిస్టమ్ అనలిస్ట్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, డేటాబేస్ మేనేజర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా చేరవచ్చు.
- కంప్యూటర్ ప్రోగ్రామ్‌లో ఎక్స్‌పర్ట్ - కంప్యూటర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్ / అడ్మినిస్ట్రేటర్, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, హెల్ప్‌డెస్క్ ఆపరేటర్, పీసీ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేయవచ్చు.
- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిపుణుడు ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, టెక్ సపోర్ట్ మేనేజర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, వెబ్‌డెవలపర్, వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, అప్లికేషన్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేయవచ్చు.
- ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నిపణుడు సిస్టమ్ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజర్, అప్లికేషన్ ప్రోగ్రామర్‌గా చేరవచ్చు.
- కంప్యూటర్ ఫోరెన్సిక్స్ నిపుణుడు డిజిటల్ ఫోరెన్సిక్ అనలిస్ట్, ఎగ్జామినర్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్ టెక్నాలజిస్ట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, సిస్టమ్ ఇంజనీర్, డేటాబేస్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్ అసోసియేట్‌గా పనిచేయవచ్చు.
- గేమ్స్ డిజైన్ ఎక్స్‌పర్ట్ గేమ్ డిజైనర్, గేమ్ ఆర్టిస్ట్, గేమ్ ప్రొడ్యూసర్, గేమ్ టెస్టర్, గేమ్ సౌండ్ ఇంజనీర్‌గా చేరవచ్చు.

### 'సీఎస్ఈ'నే సర్వస్వం కాదు!

ఐటీ రంగంలో కాలుపెట్టడానికి బ్యాచిలర్ డిగ్రీ సరిపోతుంది. తదుపరి ఉద్యోగంలో నిలదొక్కుకునేందుకు లేదంటే పైపైకి ఎదిగేందుకు అవసరమైన సాంకేతికతను నేర్చుకోవచ్చు. అందుకోసమని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)లలో ఒక్కటే ఇంజనీరింగ్ స్థాయిలో చదవాలనుకోవడంలో అర్థం లేదు. నిజానికి కంప్యూటర్ పరిజ్ఞానం ఇప్పుడు ప్రతి ఇంజనీరింగ్ డిసిప్లిన్‌లో ఉంటోంది. అంతగా కావాలంటే పీజీ స్థాయిలో దాన్ని ఎంపిక చేసుకోవచ్చు కూడా. సాంకేతికతలో త్వరిత గతిన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సీఎస్ఈ చదవకపోతే ఏమవుతుందో అన్న భయం చెందాల్సిన అవసరం అస్సలు లేదు.

## టీఎస్ - ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సీశాట్ శిక్షణ

**హైదరాబాద్-బంజారాహిల్స్‌లోని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్-యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సీశాట్) 2024 నకు ఉచిత శిక్షణ అందిస్తోంది. ఇది ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీని వ్యవధి పది నెలలు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లా కేంద్రాల్లో 2023 ఆగస్టు నుంచి 2024 మే వరకు తరగతులు నిర్వహిస్తారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 100 మంది అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు.**

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని గ్రాడ్యుయేషన్/ ప్రొఫెషనల్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షలు మించకూడదు. సీశాట్ 2024కు నిర్దేశించిన అర్హతలన్నీ ఉండాలి. అభ్యర్థులు నిరుద్యోగులై ఉండాలి. టీఎస్ స్టడీ సర్కిల్ జిల్లా కేంద్రాల్లో అయిదు నెలల ఫౌండేషన్ కోర్సు శిక్షణ పొందినవారు, ఎస్సై&పోలీస్ కానిస్టేబుల్స్ తదితర పరీక్షలకు కోచింగ్ తీసుకున్నవారు, గ్రూప్స్ పరీక్షల కోసం రెండు/మూడు నెలల స్పెషల్ ఫౌండేషన్ కోర్సు ద్వారా శిక్షణ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఇతర కోర్సులు చేస్తున్నవారు, కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తత్సమాన ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లో చేరినవారు దరఖాస్తుకు అనర్హులు. ఇప్పటికే టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకున్నవారు; అలాగే టీఎస్‌బీసీ స్టడీ సర్కిల్, ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఫర్ ఎస్టీస్, మైనారిటీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందినవారు అప్లయ్ చేయడానికి వీలు లేదు.



**ఎంట్రెన్స్ ఎగ్జామ్:** ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో మాదిరిగానే మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ స్టడీస్(పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ, హిస్టరీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కల్చర్ అండ్ సోషల్ ఇష్యూస్, కరెంట్ అఫైర్స్) నుంచి 100 ప్రశ్నలు; సీశాట్ పేపర్ 2 అంశాలైన టెస్ట్ ఆఫ్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్ కాంప్రహెన్షన్ నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. జనరల్ స్టడీస్ ప్రశ్నలకు ఒక్కో దానికి రెండు మార్కులు; సీశాట్ పేపర్ 2 ప్రశ్నలకు ఒక్కోదానికి రెండున్నర మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 300. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే మూడోవంతు మార్కు కోత విధిస్తారు.

### ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూలై 5 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 9
- **వెబ్‌సైట్:** www.tsstudycircle.co.in

## వైబ్స్

### మీకు తెలుసా?



- ఆకుపచ్చ రంగులో ఉండి.. కింద భాగంలో ఎరుపు, రెక్కలు నలుపు ఉండే చిలుక లాంటి ఈ పక్షిని రెస్ప్లెండెంట్ క్వెట్జల్ అని పిలుస్తారు. ఇదో అందమైన పక్షి. ముఖ్యంగా మెక్సికో, మధ్య అమెరికాలో ఈ పక్షులు ఎక్కువగా కనపడతాయి.
- ఆకులు, పండ్లు తినే ఈ పక్షులు అప్పుడప్పుడూ బల్లులు, పురుగులు, కప్పలు, నత్తలను తింటాయి.
- వడ్రంగి పిట్టల గూళ్లను వాడుకుంటాయివి. మూడు గుడ్లు పెడతాయి. పొదిగే కాలం పంతొమ్మిది రోజులు.
- పావుకేజీ బరువుంటాయి.
- మధ్య అమెరికాలోని అడవుల్లో ఉండే కొందరు ఈ పక్షులను దైవత్వం, వెలుగుకు ప్రతీకగా కొలుస్తారు.
- మధ్య అమెరికాలోని నాలుగు వేల నుంచి పదివేల ఫీట్లు ఉండే పర్వతాల్లోని చిత్తడి ప్రాంతాల్లో ఇవి ఉంటాయి.
- ఇవి భూమిమీద అతి నిదానంగా నడుస్తాయి. సాఫ్ట్‌గా ఉంటే ఈ బుల్లి పిట్టలు గట్టిగా అరుస్తాయి. ముఖ్యంగా మగపక్షులు అరుపు గట్టిగా ఉంటుంది.
- ఇవి కేవలం 50 వేల పక్షులు ఉన్నట్లు గుర్తించారు. అంతరించి పోయే జాతి అంటున్నారు పరిశోధకులు.
- వీటి జీవనకాలం ఇరవై ఏళ్లనుంచి ఇరవై ఐదేళ్ల మధ్య ఉంటుంది.



### దారి కనుక్కోండి



### సరైన నీడ ఏది?



### 8 తేడాలు గుర్తించండి



### రంగులు వేయండి



### డైలీ సుడోకు - 34

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | 9 | 8 | 5 | 1 | |
| | | 2 | 3 | | | | 4 | |
| | | | | | 4 | 7 | | |
| | | 1 | | 8 | | | 7 | 6 |
| | 8 | | | | | | 5 | |
| 4 | 2 | | | 7 | | 3 | | |
| | | 9 | 8 | | | | | |
| | 4 | | | | 2 | 9 | | |
| | 6 | 8 | 5 | 3 | | | | |

**సుడోకు - 33 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 7 | 9 | 8 | 4 | 5 | 6 | 1 | 2 |
| 1 | 6 | 8 | 9 | 2 | 7 | 5 | 4 | 3 |
| 2 | 5 | 4 | 1 | 6 | 3 | 9 | 8 | 7 |
| 7 | 9 | 3 | 2 | 5 | 4 | 8 | 6 | 1 |
| 6 | 8 | 5 | 3 | 9 | 1 | 7 | 2 | 4 |
| 4 | 1 | 2 | 6 | 7 | 8 | 3 | 9 | 5 |
| 8 | 4 | 1 | 7 | 3 | 9 | 2 | 5 | 6 |
| 9 | 2 | 7 | 5 | 1 | 6 | 4 | 3 | 8 |
| 5 | 3 | 6 | 4 | 8 | 2 | 1 | 7 | 9 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

## శ్రీలంక ఘన విజయం

**బులవాయో :** ప్రపంచకప్ క్వాలిఫయర్ టోర్నమెంట్‌లోభాగంగా మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన గ్రూప్–బి మ్యాచ్‌లో శ్రీలంక 82 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తు చేసింది. ఈ టోర్నీలో శ్రీలంకకు ఇది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.3 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ పాథుమ్ నిసాంకా పది ఫోర్లతో 75 పరుగులు చేశాడు. చరిత్ అసలంకా 4 ఫోర్లు, రెండు సిక్సర్లతో 63 పరుగులు సాధించాడు. సమరవిక్రమ (26), ధనంజయ డిసిల్వా (23) పరుగులు చేశారు. మిగతావారు విఫలమయ్యారు. ప్రత్యర్థి జట్టు బౌలర్లలో క్రీస్ నాలుగు, మార్క్ వాట్ మూడు, సోల్ రెండు వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 29 ఓవర్లలో కేవలం 163 పరుగులకే కుప్పకూలింది.

## ఐర్లాండ్ జయకేతనం

**బులవాయో :** వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ 138 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 349 పరుగుల భారీ స్కోరును సాధించింది. ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ అద్భుత సెంచరీ సాధించాడు. ధాటిగా ఆడిన స్టిర్లింగ్ 15 ఫోర్లు, 8 సిక్సర్లతో 134 బంతుల్లోనే 162 పరుగులు చేశాడు. కెప్టెన్ బాల్‌బర్ని (66), టెక్టర్ (57) తమవంతు పాత్ర పోషించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యుఎఇ 39 ఓవర్లలో 211 పరుగులకే కుప్పకూలింది.

## త్రిశూల్ మెహ్రాకు టైటిల్



(అక్షర సవాల్ ) /హైదరాబాద్ : రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టిటి పోటీల్లో త్రిశూల్ మెహ్రా టైటిల్‌ను సాధించాడు. నగర శివారులో మొయినాబాద్ లోని టిటి అకాడమీలో ఈ పోటీలు జరిగాయి. ఎల్‌బిస్టేడియంకు ప్రాతినిథ్యం వహించిన త్రిశూల్ మెహ్రా బాలుర యూత్ విభాగంలో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో త్రిశాఊల్ 4–0 తేడాతో తరుణ్‌ను ఓడించాడు.

# అక్టోబర్ 5 నుంచి మెగా టోర్నీ

## ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

- అహ్మదాబాద్‌లో దాయాదుల పోరు
- నవంబర్ 19న ఫైనల్




**ముంబై :** భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) మంగళవారం విడుదల చేసింది. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు ఈ మెగా టోర్నమెంట్ జరగనుంది. అహ్మదాబాద్ వేదికగా అక్టోబర్ 5న డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్, రన్నరప్ న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో వరల్డ్‌కప్‌కు తెరలేవనుంది. ఇక నవంబర్ 19న ఫైనల్ సమరం జరగనుంది. ఫైనల్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఇక చిరకాల ప్రత్యర్థులు భారత్–పాకిస్థాన్ జట్ల మధ్య అక్టోబర్ 15న పోరు జరుగుతుంది. ఈ మ్యాచ్‌కు కూడా అహ్మదాబాదే ఆతిథ్యం ఇస్తోంది. ఇక వరల్డ్‌కప్‌లో భాగంగా హైదరాబాద్‌లో మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. పాకిస్థాన్ తన రెండు లీగ్ మ్యాచ్‌లను హైదరాబాద్‌లో ఆడనుంది. న్యూజిలాండ్ కూడా ఉప్పల్‌లో ఓ మ్యాచ్ ఆడుతుంది. క్వాలిఫయర్–1తో న్యూజిలాండ్ ఈ మ్యాచ్‌లో తలపడనుంది. ఇదిలావుంటే టీమిండియా తన తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో ఆడనుంది. లీగ్ దశలో భారత్ మొత్తం మ్యాచుల్లో తలపడనుంది.

### పది వేదికల్లో..

కాగా, భారత్‌లోని మొత్తం పది నగరాలు ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అహ్మదాబాద్ హైదరాబాద్, ధర్మశాల, న్యూఢిల్లీ, చెన్నై, లక్నో, పుణె, బెంగళూరు, ముంబై, కోల్‌కతా నగరాలు వరల్డ్‌కప్‌కు వేదికలుగా ఎంపికయ్యాయి. మరోవైపు సెమీ ఫైనల్ మ్యాచ్‌లు ముంబై, కోల్‌కతా జరగనున్నాయి. లీగ్ దశలో మొత్తం 45 మ్యాచ్‌లు జరుగుతాయి. మూడు నాకౌట్ మ్యాచ్‌లు ఉన్నాయి. వరల్డ్‌కప్‌లో 42 డే–నైట్ మ్యాచ్‌లు జరగనుండగా మరో ఆరు డే మ్యాచ్‌లు ఉంటాయి. డే మ్యాచ్ ఉదయం 10.30 గంటల నుంచి డే–నైట్ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతోంది. ఇదిలావుంటే వార్నప్ మ్యాచ్‌లు మూడు వేదికల్లో జరుగనున్నాయి. హైదరాబాద్, తిరువనంతపురం, గౌహతి నగరాల్లో ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఇదిలావుండగా భారత్ లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లు ఆడనుంది. అక్టోబర్ 84 ఆస్ట్రేలియాతో (అహ్మదాబాద్‌లో), 11న అఫ్గానిస్థాన్‌తో (న్యూఢిల్లీలో), 19న బంగ్లాదేశ్‌తో (పుణెలో), 29న ఇంగ్లండ్‌తో (లక్నోలో), నవంబర్ రెండున క్వాలిఫయర్–2తో (ముంబైలో), నంబర్ ఐదున దక్షిణాఫ్రికాతో (కోల్‌కతాలో), నవంబర్ 11న క్వాలిఫయర్–1తో (బెంగళూరులో) భారత్ తలపడనుంది. కాగా, లీగ్ దశలో ప్రతి జట్టు తొమ్మిది మ్యాచ్‌ల చొప్పున ఆడుతాయి. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచే నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. తొలి సెమీ ఫైనల్ నవంబర్ 15న ముంబైలోని వాంఖడే స్టేడియంలో రెండో సెమీ ఫైనల్ నవంబర్ 16న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్‌లో జరుగుతోంది. ఫైనల్ నవంబర్ 19న అహ్మదాబాద్‌లో జరగనుంది. ఇక నవంబర్ 20ను రిజర్వ్‌డేగా ప్రకటించారు.

### ఉప్పల్‌లో మ్యాచ్‌లే మ్యాచ్‌లు..

హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో వరల్డ్‌కప్‌లో భాగంగా మొత్తం ఐదు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో మూడు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఉండగా మరో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఉన్నాయి. వీటిలో పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లే నాలుగు ఉండడం విశేషం. పాకిస్థాన్ సెప్టెంబర్ 29న న్యూజిలాండ్‌తో అక్టోబర్ 3న ఆస్ట్రేలియాతో వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. అంతేగాక అక్టోబర్ ఆరున క్వాలిఫయర్–1తో, అక్టోబర్–12న క్వాలిఫయర్–2తో తలపడనుంది. దీంతో పాటు అక్టోబర్ 9న న్యూజిలాండ్ కూడా ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ఆడనుంది. క్వాలిఫయర్–1తో న్యూజిలాండ్ ఢీకొంటోంది.



## వరల్డ్ కప్ షెడ్యూల్ ఇదే..

| | | |
|---|---|---|
| ఇంగ్లండ్ vs న్యూజిలాండ్ | అక్టోబర్ 5 | అహ్మదాబాద్ |
| పాకిస్థాన్ vs క్వాలిఫయర్ 1 | అక్టోబర్ 6 | హైదరాబాద్ |
| బంగ్లాదేశ్ vs అఫ్గానిస్థాన్ | అక్టోబర్ 7 | ధర్మశాల |
| దక్షిణాఫ్రికా vs క్వాలిఫయర్ 2 | అక్టోబర్ 7 | ఢిల్లీ |
| భారత్ vs ఆస్ట్రేలియా | అక్టోబర్ 8 | చెన్నై |
| న్యూజిలాండ్ vs క్వాలిఫయర్ 1 | అక్టోబర్ 9 | హైదరాబాద్ |
| ఇంగ్లండ్ vs బంగ్లాదేశ్ | అక్టోబర్ 10 | ధర్మశాల |
| భారత్ vs అఫ్గానిస్థాన్ | అక్టోబర్ 11 | ఢిల్లీ |
| పాకిస్థాన్ vs క్వాలిఫయర్ 2 | అక్టోబర్ 12 | హైదరాబాద్ |
| ఆస్ట్రేలియా vs దక్షిణాఫ్రికా | అక్టోబర్ 13 | లక్నో |
| ఇంగ్లండ్ vs అఫ్గానిస్థాన్ | అక్టోబర్ 14 | ఢిల్లీ |
| న్యూజిలాండ్ vs బంగ్లాదేశ్ | అక్టోబర్ 14 | చెన్నై |
| భారత్ vs పాకిస్థాన్ | అక్టోబర్ 15 | అహ్మదాబాద్ |
| ఆస్ట్రేలియా vs క్వాలిఫైయర్ 2 | అక్టోబర్ 16 | లక్నో |
| దక్షిణాఫ్రికా vs క్వాలిఫైయర్ 1 | అక్టోబర్ 17 | ధర్మశాల |
| న్యూజిలాండ్ vs అఫ్గానిస్థాన్ | అక్టోబర్ 18 | చెన్నై |
| భారత్ vs బంగ్లాదేశ్ | అక్టోబర్ 19 | పుణె |
| ఆస్ట్రేలియా vs పాకిస్థాన్ | అక్టోబర్ 20 | బెంగళూరు |
| ఇంగ్లండ్ vs సౌతాఫ్రికా | అక్టోబర్ 21 | ముంబై |
| క్వాలిఫైయర్ 1 vs క్వాలిఫైయర్ 2 | అక్టోబర్ 21 | లక్నో |
| భారత్ vs న్యూజిలాండ్ | అక్టోబర్ 22 | ధర్మశాల |
| పాకిస్థాన్ vs అఫ్గానిస్థాన్ | అక్టోబర్ 23 | చెన్నై |
| దక్షిణాఫ్రికా vs బంగ్లాదేశ్ | అక్టోబర్ 24 | ముంబై |
| ఆస్ట్రేలియా vs క్వాలిఫయర్ 1 | అక్టోబర్ 25 | ఢిల్లీ |
| ఇంగ్లండ్ vs క్వాలిఫయర్ 2 | అక్టోబర్ 26 | బెంగళూరు |
| పాకిస్థాన్ vs దక్షిణాఫ్రికా | అక్టోబర్ 27 | చెన్నై |
| క్వాలిఫైయర్ 1 vs బంగ్లాదేశ్ | అక్టోబర్ 28 | కోల్‌కతా |
| ఆస్ట్రేలియా vs న్యూజిలాండ్ | అక్టోబర్ 28 | ధర్మశాల |
| భారత్ vs ఇంగ్లాండ్ | అక్టోబర్ 29 | లక్నో |
| అఫ్గానిస్థాన్ vs క్వాలిఫైయర్ 2 | అక్టోబర్ 30 | పుణె |
| పాకిస్థాన్ vs బంగ్లాదేశ్ | అక్టోబర్ 31 | కోల్‌కతా |
| న్యూజిలాండ్ vs సౌతాఫ్రికా | నవంబర్ 1 | పుణె |
| భారత్ vs క్వాలిఫయర్ 2 | నవంబర్ 2 | ముంబై |
| క్వాలిఫయర్ 1 vs అఫ్గానిస్థాన్ | నవంబర్ 3 | లక్నో |
| ఇంగ్లండ్ vs ఆస్ట్రేలియా | నవంబర్ 4 | అహ్మదాబాద్ |
| న్యూజిలాండ్ vs పాకిస్థాన్ | నవంబర్ 4 | బెంగళూరు |
| భారత్ vs సౌతాఫ్రికా | నవంబర్ 5 | కోల్‌కతా |
| బంగ్లాదేశ్ vs క్వాలిఫయర్ 2 | నవంబర్ 6 | ఢిల్లీ |
| ఆస్ట్రేలియా vs అఫ్గానిస్థాన్ | నవంబర్ 7 | ముంబై |
| ఇంగ్లండ్ vs క్వాలిఫయర్ 1 | నవంబర్ 8 | పుణె |
| న్యూజిలాండ్ vs క్వాలిఫయర్ 2 | నవంబర్ 9 | బెంగళూరు |
| సౌతాఫ్రికా vs అఫ్గానిస్థాన్ | నవంబర్ 10 | అహ్మదాబాద్ |
| భారత్ vs క్వాలిఫయర్ 1 | నవంబర్ 11 | బెంగళూరు |
| ఇంగ్లండ్ vs పాకిస్థాన్ | నవంబర్ 12 | కోల్‌కతా |
| ఆస్ట్రేలియా vs బంగ్లాదేశ్ | నవంబర్ 12 | పుణె |
| సెమీ ఫైనల్ 1 | నవంబర్ 15 | ముంబై |
| సెమీ ఫైనల్ 2 | నవంబర్ 16 | కోల్‌కతా |
| ఫైనల్ | నవంబర్ 19 | అహ్మదాబాద్ |




## ఫ్యామిలీకి నచ్చే పాత్రలో కనిపిస్తా



యంగ్ హీరో శ్రీవిష్ణు... రామ్ అబ్బరాజు దర్శకత్వంలో పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సామజవరగమన'తో రాబోతున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. గురువారం ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో హీరో శ్రీవిష్ణు మీడియాతో మాట్లాడుతూ ''ఇది అవుట్ అండ్ అవుట్ క్లీన్ ఎంటర్‌టైనర్. కడుపుబ్బా నవ్విస్తుంది. తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ రాని పాయింట్‌ను ఈ సినిమాలో చెబుతున్నాం. చాలా డిఫరెంట్‌గా వుంటుంది. ఇంతకుముందు నరేష్‌తో అర్జున ఫల్గుణ చిత్రంలో కూడా చేశాను.'సామజవరగమన'లో నరేష్ పాత్రకి యూత్ పిచ్చెక్కిపోతారు. తండ్రి, కొడుకుల అనుబంధం చాలా లైవ్లీగా వుంటుంది. ఇందులో ఫ్యామిలీకి నచ్చే పాత్రలో కనిపిస్తా. హీరోయిన్ రెబా మోనికా జాన్ చాలా చక్కగా నటించింది''అని తెలిపారు.

## ఫ్యామిలీతో పాటు యూత్‌కు నచ్చే సినిమా



యంగ్ హీరో నాగ శౌర్య, కొత్త దర్శకుడు పవన్ బాసంశెట్టి కాంబినేషన్‌లో వస్తున్న పూర్తి ఎంటర్‌టైనర్ 'రంగబలి'. ఎస్ఎల్‌వి సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో యుక్తి తరేజ కథానాయికగా నటిస్తోంది. మంగళవారం ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు మేకర్స్. ఈ ఈవెంట్‌లో హీరో నాగశౌర్య మాట్లాడుతూ ''దర్శకుడు పవన్ చెప్పింది చెప్పినట్లుగా తీశాడు. యుక్తి తరేజ చాలా బ్యూటిఫుల్‌గా వుంది. ఈ సినిమాతో అందరు కనెక్ట్ అవుతారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది''అని అన్నారు. దర్శకుడు పవన్ మాట్లాడుతూ ''ఈ కథలో రంగబలి అనేది మెయిన్ సెంటర్. దానికి తగ్గట్టు ఈ చిత్రానికి ఆ టైటిల్ పెట్టాం. జులై 7న వస్తున్న ఈ సినిమా విజయంపై చాలా నమ్మకంగా వున్నాం''అని తెలిపారు. యుక్తి తరేజ మాట్లాడుతూ ''ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ట్రైలర్ అందరికీ నచ్చడం ఆనందంగా వుంది''అని పేర్కొన్నారు.

## కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం



చిన్నా పాపిశెట్టి దర్శకత్వం లో యంగ్ హీరో సుధాకర్ కోమాకుల నటించిన హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి ఫిల్మ్ ప్రొడక్షన్స్, సుఖ మీడియా బ్యానర్లపై పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కూడా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ వేడుకలో బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, విజయ్ కనకమేడల, తిరువీర్, రాజ్ కందుకూరి, ఆర్పీ పట్నాయక్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ ''సినిమా కంటెంట్ చాలా బావుంది. 'నారాయణ అండ్ కో'తో సుధాకర్‌కు మంచి బ్రేక్ వస్తుందని భావిస్తున్నాను''అని తెలిపారు. హీరో సుధాకర్ కోమాకుల మాట్లాడుతూ ''చాలా మంచి ఫన్ ఎంటర్‌టైనర్ ఇది. 'నారాయణ అండ్ కో' సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ సినిమా'' అని అన్నారు. దర్శక, నిర్మాత చిన్నా మాట్లాడుతూ ఇది ఫ్యామిలీ ఫండెడ్ మూవీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమని, దేవి ప్రసాద్, పూజా కిరణ్, ఆర్తి పొడి, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## అందమైన ప్రేమ కథ



సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ కె.దశరథ్ నిర్మాతగా వ్యవహరిస్తూ కథ అందించిన చిత్రం 'లవ్ యు రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరించారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్ధనన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా శుక్రవారం కానుంది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత డివై చౌదరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ''ఇప్పటివరకూ చూసిన ప్రేమ కథలకు 'లవ్ యు రామ్' చాలా భిన్నంగా ఉంటుంది. ప్రేమించడమే జీవితం అని నమ్మే ఒక అమ్మాయి, నమ్మించడమే జీవితం అనుకునే అబ్బాయి మధ్య జరిగే అందమైన ప్రేమకథ ఇది. ఈ సినిమాలో నిజమైన ప్రేమని చెప్పాం. నేను ,దశరథ్ చిన్నప్పటి నుంచి స్నేహితులం. ఆయన అందించిన ఈ కథ యూత్ , ఫ్యామిలీ ఆడియన్స్, ఎన్ఆర్ఐలకు బాగా నచ్చుతుంది. ఇందులో కథే హీరో. ఈ కథ ప్రేక్షకులకు కనెక్ట్ కావాలంటే కొత్త వాళ్ళతో చేయడమే కరెక్ట్ అనిపించింది. ప్రేక్షకులకు మంచి విజువల్ ఫీస్ట్‌లా వుంటుంది ఈ సినిమా''అని అన్నారు.

## సస్పెన్స్ థ్రిల్లర్



కా మూవీ మేకర్స్ పతాకంపై కొల్లకుంట నాగరాజు నిర్మాతగా ప్రముఖ దర్శకుడు పి.వాసు తనయుడు శక్తి వాసుదేవన్ హీరోగా రాజ్ శంకర్, పూర్ణ, నాగ బాబు, బ్రహ్మానందం, అలీ, సీత, సితార, నిషా కొఠారి ప్రధాన పాత్రలో రాఘవ దర్శకత్వం వహించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఆలా ఇలా ఎలా'. మెలోడీ బ్రహ్మ మణిశర్మ అందించిన బాణీలను హిందూపూర్‌లో విడుదల చేశారు. ఈ చిత్రాన్ని జులై 21న ఎస్‌కెఎమ్‌ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా విడుదల చేస్తారు. ఈ ఆడియో విడుదల వేడుకకు ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్, ఆడియోని విడుదల చేశారు. హీరో శక్తి వాసుదేవన్ మాట్లాడుతూ ''83 రోజుల్లో మంచి మంచి లొకేషన్స్ లో ఈ సినిమాను చిత్రీకరించాం. ఈ సినిమా కథ, కథనం గొప్పగా ఉంటుంది''అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎమ్‌ఎల్ మోషన్ పిక్చర్స్ అధినేత ఆదినారాయణ మాట్లాడుతూ ''ఇది ఒక సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం. స్క్రీన్ ప్లే చాలా బాగా వచ్చింది''అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత కొల్లకుంట నాగరాజు, రేవతి, నిషా కొఠారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కొందరు నేతలు దుష్ప్రచారాలు చేస్తున్నారు

- ఇంత బతుకు బతికి పార్టీలో ఇలాంటి పరిస్థితులు చూస్తాననుకోలేదు
- తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న పరిస్థితులపై జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు



(అక్షర సవాల్ ) /హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న పరిస్థితులపై ఆ పార్టీ ఎమ్మెల్యే, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పలువురు ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరనున్న నేపథ్యంలో పార్టీ పరిస్థితులపై జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కొందరు కాంగ్రెస్ పార్టీలోని నేతలపైనే దుష్ప్రచరాలు చేసే దరిద్రం దాపురించిందన్నారు. ఇంత బతుకు బ్రతికి పార్టీలో ఇలాంటి పరిస్థితులు చూస్తానని అనుకోలేదన్నారు. పార్టీలో నాలుగేళ్ల నుంచి తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, పార్టీ కోసం ఎంత చేసినా తనను ప్రశ్నిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఎందుకు ఇలాంటి పరిస్థితి ఉందో అర్థం కావడం లేదన్నారు. మీడియా అడిగేదాంట్లో తప్పు లేదని ఆయన తెలిపారు.

### నేను పైరవీకారుణ్ణి కాదు

నేను పైరవీకారుణ్ణి కాదనీ, వాళ్లు పిలిస్తేనా ఢిల్లీకి వచ్చానని, పార్టీ ఐక్యంగా ఉందో లేదో తాను చెప్పలేనన్నారు. ఈసారి కూడా అధికారంలోకి రాకపోతే చాలామంది రాజకీయ జీవితాలు దెబ్బతీంటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లల చేష్టలుగా వ్యవహారిస్తే మరింత నష్టం జరుగుతుందన్నారు. వాస్తవరూపంలో క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ఇప్పటికే నష్టం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జైపాల్ రెడ్డి మేధావులందరూ కలిసి రాష్ట్ర విభజన చేసి కాంగ్రెస్ పార్టీ కోలుకోలేనంత నష్టం చేశారని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకైతే అలాంటిది జురుగుతున్నట్లుగా లేదని అన్నారు. తాను చెప్పే వాడిని కూడా కాదనీ, పార్టీ ఐక్యంగా ఉందో లేదో రాహుల్ గాంధీకి చెబుతానని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. ఎన్నికల వ్యూహాలపై రాహుల్ గాంధీ తనను ఢిల్లీకి పిలిచారని ఆయన తెలిపారు.

### రాహుల్‌గాంధీతో జగ్గారెడ్డి ప్రత్యేక భేటీ

ఢిల్లీలో కాంగ్రెస్ స్ట్రాటజీ సమావేశంలో భాగంగా తెలంగాణ నేతలతో సమావేశం అనంతరం రాహుల్ గాంధీ తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడారు. అలాగే ఆయనతో మాట్లాడుకుంటూ తనతో పాటు జగ్గారెడ్డిని టెన్ జన్‌పథ్‌లోని సోనియా నివాసానికి రాహుల్ తీసుకెళ్లారు. రాహుల్‌గాంధీతో భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డిలో భారత్ జోడో ప్రభావం గురించి మాత్రమే రాహుల్ అడిగారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు జగ్గారెడ్డి ఎలాంటి వివరణ ఇవ్వలేదు. సమావేశ వివరాలు బయటకు చెప్పనని ఆయన వివరించారు. దయచేసి తనను ఎలాంటి ప్రశ్నలు వేసి ఇబ్బంది పెట్టవద్దని, తాను ఏమీ చెప్పడానికి సిద్ధంగా లేనని జగ్గారెడ్డి వెల్లడించారు. కేకే వేణుగోపాల్ ఇక్కడకు వస్తున్నారని చెప్పి అక్కడి నుంచి జగ్గారెడ్డి జారుకున్నారు.

### కలిసికట్టుగా పని చేస్తారు : థాక్రే

తెలంగాణలోని కాంగ్రెస్ నేతలందరూ కలిసికట్టుగా పని చేస్తారని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మానిక్ రావ్ థాక్రే తెలిపారు. మంగళవారం ఏఐసిసి కార్యాలయంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఖర్గే సమావేశం నిర్వహించారు. అనంతరం మానిక్ రావ్ మీడియాతో మాట్లాడుతూ 100 శాతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు సిద్ధం కావాలని నాయకులకు రాహుల్ పిలుపునిచ్చారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలతో మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగిందని రాష్ట్రంలో చేపట్టే కార్యక్రమాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ గెలిచిన తర్వాత చేయాల్సిన అంశాలపై చర్చించామన్నారు. కాంగ్రెస్‌తో తెలంగాణ వికాస్ ఉంటుందన్నారు.

# అన్ని నియోజకవర్గాల్లో టిడిపి బస్సు యాత్ర



(అక్షర సవాల్ ) /హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ టిడిపి బస్సు యాత్ర 5 వేల కిలోమీటర్లు కొనసాగుతుందని తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం గెలుపే లక్ష్యంగా చేపడుతున్న ఈ బస్సు యాత్రను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఖమ్మం, జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో బస్సు యాత్ర కొనసాగేలా రూట్ మ్యాప్ సిద్ధమైందన్నారు. ఈ రూట్ మ్యాప్ మేరకు బస్సు యాత్రలో ఎక్కడెక్కడ కార్నర్ మీటింగ్స్, సభలు నిర్వహించాలన్నది షెడ్యూల్ రూపొందించడం జరుగుతుందన్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని, ఖమ్మం జిల్లా రాజకీయాలు సంచలనంగా మారిన పరిస్థితుల్లో ఆ జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు విబేధాలు వీడి సమిష్టిగా కృషి చేసి తెలుగుదేశం ప్రతిష్టను నిలబెట్టాలని ఆదేశించారు. ఈ దిశగా వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మెజార్టీ స్థానాల్లో టిడిపి జెండా ఎగురవేసి సత్తా చాటాలని కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సూచించారు.బస్సు యాత్ర కొనసాగే గ్రామంతో పాటు ప్రతి పల్లెలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. ఆర్నెళ్ల నుండి పార్టీ కార్యక్రమాల జోరు పెరిగినందున నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగి తెలంగాణలో టిడిపి బలం రోజురోజుకూ పుంజుకుంటుందన్నారు. పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ పెంచి వచ్చే ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు బస్సు యాత్రకు సిద్ధం కావాలని ఖమ్మం, జహీరాబాద్ పార్లమెంటు నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యులు బంటు వెంకశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్, ఖమ్మం పార్లమెంటు నాయకులు కూరపాటి వెంకశ్వర్లు, వాసిరెడ్డి రామానాథం, కనగాల సాంబశివరావు, కుమార్, స్వామి దొర, జహీరాబాద్ పార్లమెంటు నాయకులు పైడి గోపాల్ రెడ్డి, కరా రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED,PUBLISHED,AND,OWNED,BY,BIREDDYRAJENDHAR REDDY,PRINTED,AT,PUSHPALATHA PUBLICATIONS,AND,PRINTING, H.NO.1-83,ARSHANPALLY,GRAMPANCHAYAT, WARANGAL,DISTRICT-506349 TELANGANASTATE,PUBLISHED,AT,H-NO,2-8-739/1ROADNO-2 BHAWANINAGAR,HANAMKONDA,506001 WARANGAL DIST,TELANGANA STATE
EDITOR : BIREDDY RAJENDHAR REDDY, RNI. NO:TEL TEL 2023/84132, CELL NO :9642225337,9912125337 , Website : aksharasaval.com Email:aksharasaval@gmail.com